



# భక్తినివేదన

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీసర్వజిత్ నామ సంవత్సర చైత్రము (ఏప్రిల్, 1947) నుండి ఆధ్యాత్మిక సేవలో...

ఆగష్టు 2015

వెల 20/-






పుష్కరాల సందర్భముగా గోదావరిలో భద్రాద్రి సుదర్శన పెరుమాళ్లకు తిరుమంజనం, శిష్యబృందంతో శ్రీశ్రీశ్రీ స్వామివారి పుష్కరస్నానం






హనుమద్ వాహనంపై వయ్యారి నడకల శ్రీరాముడు, శ్రీశ్రీశ్రీ స్వామివార్లతో పుష్కర స్నానంలో రాష్ట్ర మంత్రి వర్యులు







శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్ స్వామి వారిచే పుష్కర ప్రయుక్త తిరుమంజనం, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామివారి మంగళాశాసనాలు

శ్రీమతే నారాయణాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

69 సం॥ల నుండి భగవద్బంధువులు ఆదరిస్తున్న ...
ఆధ్యాత్మిక మాసపత్రిక

# భక్తినివేదన









సంపుటి 69 | ఆగష్టు 2015 | సంచిక - 5

శ్రీమన్మథనామ సంవత్సర నిజ ఆషాఢమాసము


## విషయసూచికా


| | |
|---|---|
| సుదృఢాభయం - సుందరసేతు | 4 |
| కనుమరుగవుతున్న కుటుంబ సంబంధాలు (సంపాదకీయం) | 6 |
| గీతలో నేర్చుకొనదగినదేది? | 8 |
| ఆచార్య హృదయము | 10 |
| నేర్చుకుందామా!! | 12 |
| శ్రీరామానుజ శతకము | 12 |
| సత్కథా కాలక్షేపము | 13 |
| శ్రీవరదరాజ పంచాశత్ (శ్రీస్తవము) | 15 |
| ఇరామానుశ నూత్తందాది | 17 |
| అహోభారతమ్ | 18 |
| ముఖచిత్ర పరిచయము | 19 |
| నమ్మాళ్వార్ల కృష్ణానుభవము | 20 |
| ఉపనిషత్ కథలు | 31 |
| శ్రీవేంకటాచల 'చిత్రే'తిహాసమాల | 23 |
| కోరినవారికెల్లను... | 24 |
| రామానుజ చిత్రకథ | 25 |
| గోదావరీ పుష్కర దృశ్యాలు | 29 |
| అత్రేదం తత్త్వమ్ | 32 |
| జీవన సాఫల్యము | 33 |
| ఆళ్వారుల దివ్య వైభవము (బుఱ్ఱకథ) | 34 |
| అరచేతిలో ఆరోగ్యం | 36 |
| రాశి ఫలాలు | 37 |
| కేలండర్ | 38 |
| ప్రచార వార్తలు | 39 |
| వికాసదర్శిని | 43 |
| మహిళా ఆరోగ్యవికాస్ | 47 |
| నూతన గ్రంథ పరిచయము | 48 |
| పరమపద వార్తలు | 49 |
| మెదడుకు మేత | 50 |



వ్యవస్థాపకులు
పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ
రామానుజ జీయరుస్వామివారు

సంపాదకులు
శాస్త్రరత్నాకర, శాస్త్రవిద్వన్మణి
శ్రీ.ఉ.వే.శ్రీమాన్ డా॥ S.V. రంగరామానుజాచార్యులు

ఉప సంపాదకులు
శ్రీమతి డా॥ T.K. చూడామణి

డి.టి.పి మరియు డిజైన్
కంప్యూటర్ స్టేషన్-పరిశోధన-ప్రకాశన విభాగం
జీవా,శ్రీరాంనగర్, ముచ్చింతల్,
రం.రె.జిల్లా- 509325 తెలంగాణ,
పరిశోధనాలయం, సీతానగరం, ఆం.ప్ర-522 201

చందావివరాలు :-
సంవత్సరచందా రూ.225/-
విదేశాలకు సంవత్సరచందా $30/-

మా సేవలో....
భక్తినివేదన, సీతానగరం - 522 501,
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. 08645 272929.
E-mail : **jetsitanagaram@yahoo.com**
Internet : www.chinnajeeyar.org



*Printed & Published by* : H.H. Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamiji on behalf of **Jeeyar Educational Trust**
*Printed & Published at* : **Srijman Printers & processors** : C/o JET, Sitanagaram - 522 501, Guntur Dist., Andhra Pradesh.
*Editor* : Sriman **S.V. Rangaramanujacharyulu** S/o. Lakshmanacharyulu, JIVA, Sriramnagar, Shamshabad, R.R.Dist.

శ్రీః

# సుదృఢాభయం... సుందరసేతు



శ్రీయః భగవద్బంధువుల్లార!
శ్రీమతే నారాయణాయనమః!
అనేక మంగళాశాసనాలు!

గోదావరి పుష్కరాలు
17.7.2015

మీ అందరికీ శాంతి, సుఖములనిచ్చే సత్సంపదలు చేకూరాలని ముందుగ మన శ్రీ సీతారామ చంద్ర ప్రభువు శ్రీచరణాలవద్ద ప్రార్థిస్తున్నాం.

ఈరోజే దక్షిణాయన పుణ్యకాలంలోకి ప్రవేశించాం. పండగల పర్వానికి తెరతీసినట్టేగద! గురుపూర్ణిమ నుండి ప్రారంభిస్తే వరసగా అన్నీ పండుగలే. ఎప్పుడూ ఇలాంటి వాతావరణమే మీకు చుట్టూ భగవంతుడు ఉంచాలనేది మా ప్రార్థన.

ఈ ఏడాది ఎదురయ్యే సమస్యలనేకాలు ధైర్యంగా ఎదుర్కొనే శక్తి మనకి కావాలని, రాబోయే కాలానికి మనలను సంసిద్ధులను చేయగలగాలి అని కోరుకుంటూ, ఈ గడచిన ఉగాదినాటి రాబోయే ఉగాదిదాక "శాంతి సుందరమ్" అనే పేర శ్రీమద్రామాయణంలోని "సుందర కాండని" మన పెరుమాళ్ళవద్ద మహా సప్తసర్గ క్రమంలో పారాయణం చేస్తున్నాం.

3 భాగాలుగ చేయాలనుకున్న దానిలో మొదటి 68 దినాల పారాయణ మన దివ్యసాకేతంలో పూర్తి అయింది. రెండవ భాగం ఈ పుష్కరాలతో ముగుస్తుంది. చివరి భాగం 108 దినాలు. చాతుర్మాస్యంతో దాన్ని తిరిగి దివ్యసాకేత నాథుడు శ్రీరామచంద్రుని సన్నిధిలో ప్రారంభించి చాతుర్మాస్య కాలమంతా కొనసాగిస్తాం.

ఈ మధ్యలో "సుందరసేతు" అంటూ రెండే నిముషాలలో సుందరకాండ పూర్తిగ స్మరించే లాభాన్ని పొందాలని పురుషోత్తమ మాసంగ సంభవించే 'అధిక ఆషాఢ మాసాన్ని' సద్వినియోగం చేసుకోగలిగాం. ఇది చాలా నచ్చింది అందరికీనూ. మళ్ళీ ఎప్పుడిది చేస్తావని అంటున్నారు.

→ →





—2—

సుందరసేతువనే పేరు, మనం చేసినది కొద్దిగానే, కానీ, ఎంతో
ప్రభావవంతంగ పనిచేసింది చాలమందికి. ప్రతిరోజూ
సరిగ్గా ఉదయం ఎనిమిది గంటలకి భారత కాలమాన ప్రకారము
ఇతర దేశాలనుండి ఫోనులో చేరేవాళ్ళు కొందరు. ఇంకొందరు
నేరుగ చేరి పారాయణ చేసేవారు. 6 శ్లోకాలు అందరికీ నియతంగ
ఉంటాయి. సుందర కాండలో ఒక్కొక్క శ్లోకం మాత్రం ఒక్కొక్కరికీ
కేటాయిస్తారు. 2804 శ్లోకాలని అంతమంది ఒక్కసారే చదివినా
అందరూ ఆ సమయానికే అన్ని శ్లోకాలు చదవడంతో, అన్ని అందరూ
చేసినట్లైంది. దీనికి హనుమంతుడే రక్షకుడై ఉంటాడు.
ఏకాంతముంటే, ఎంతో కొంత సుందర కాండ తాత్పర్యం నేర్పవచ్చు.
ఎప్పుడైనా ఇది బాగ నచ్చి - పురుషోత్తమ మాసమంతా చేసారు.
అందరికీ మంగళాశాసనాలు.

అందరూ కలిసే మాసం శ్రావణం కనుక ఆ మాసమంతా ఇంకా ఎంతో
మందిని చేర్చుకొంటూ "సుందర సేతు"ను మరింత దృఢతరం చేయ
వలసింది. గతంలో జరిగిన సమయాలలో, ఎక్కువ మందికి విషయం
చెప్పే అవకాశం లేక పోయింది. ఇప్పుడా భయం లేదు. అందరికీ
తెలిపి, ప్రేమతో పంపాలని, విశ్వాసం నల్పలదాయనే, అందరినీ
కలుపుకుందాం!
ఎందరో ధార్మిక సేవలో పాల్గొంటూ ఉన్నారు. వారందరికీ స్వామికృప సదా
ఉండాలి.
శ్రీరామానుజ సహస్రాబ్దిలో ఆచార్యుల శ్రీవిగ్రహాన్ని నిర్మించాలనే
శ్రద్ధ, వసతి కల ముగ్గురు పాలిదారులు "జీవా" లో ప్రస్తుతాయి
త్వరగానే కలుస్తున్నారు. ఎవరో ఒకరిని నిర్ణయించి, వానికి work-
order ఇస్తారు. దానిగురించి మరోసారి తెలియచేస్తాం.
గురుపూర్ణిమ, మనందరి జ్ఞానాన్ని వికసింప చేసి, ఆచార్యకృపా
పాత్రులుగ మనలను చేయుగాక!
జై శ్రీమన్నారాయణా!

[signature]
17/7/2015




# కనుమరుగవుతున్న కుటుంబ సంబంధాలు

సంపాదకీయం

మానవుని సామాజిక జీవనం కుటుంబంతో ప్రారంభమవుతుంది. ఒకమనిషికి మరొకమనిషి పట్ల, ఒక ప్రాణికి మరొక ప్రాణిపట్ల మైత్రీద్వేషాలు ఉండటం సహజం. ఇవి మనస్సుచెందిన సంస్కారాల మీద ఆధారపడి ఉన్నవి. అనాదిగా భారతీయ జీవనానికి వేదాలు, ఇతిహాస పురాణాలు కావ్యసారస్వతం, సంస్కారాలను సరిదిద్దుకొనే విధానాన్ని నేర్పుతున్నాయి, కనుకనే అప్పుడప్పుడు పెడత్రోవన పడుతున్న సామాజిక సంబంధాలను మనకు గుర్తు చేస్తూ మన జీవనవిధానం క్రమబద్ధంగా నడిచి ప్రయోజనవంతమయ్యేలా మన సారస్వతం మనకు చక్కటి మార్గదర్శనం చేస్తోంది.

కుటుంబంతో ప్రారంభమయ్యే సామాజిక జీవనంలో తల్లి దండ్రులు, బిడ్డలు, వీరికుండే పరస్పర అనుబంధాలు, ఒకరు నేర్పితే ఏ ప్రాణీ నేర్వలేదు. పుట్టిన బిడ్డపై తల్లికి ఉండే ప్రేమ, తల్లిదండ్రుల పట్ల బిడ్డలకు ఉండే ప్రేమ, ఏ గ్రంథాలూ చూచి నేర్చుకొనేదికాదు. ఈ అనుబంధాలు సహజంగానే అన్ని ప్రాణులకు ఏర్పడ్డాయి. కోకిల బిడ్డలను పొదగడం చేతకాని దశలో, కాకుల గూళ్ళలో గుడ్లను పెట్టి, పొదిగించి, పెంచడం అనే విచిత్ర ప్రక్రియ ప్రాణులమధ్య ఉండే అనుబంధాలకు ప్రత్యక్ష తార్కాణం. పశువులు కూడా ఒక జాతికి చెందినవి గుంపులు గుంపులుగా ఒకచోట చేరి తమను తాము రక్షించుకుంటూ బ్రతకడం ఉండగా, ఇదే బుద్ధిజీవులైన మనుష్యులలో క్రమబద్ధమై కనిపిస్తుంది. అనుబంధాలు, ప్రేమలు, ద్వేషాలు, అన్ని ప్రాణులకు సమానమే అయినా మనుష్యులకు ఉన్న విలక్షణత వావివరుసలతో కూడిన అనుబంధాలను రక్షించుకొనే ప్రయత్నం చేయడం, ఇది మానవ సంతతిలోనే విశేషంగా ఉంది. పశువులకు, పక్షులకు వావివరుసలు లేవు.

ఇతర సమాజాలలో లేని విలక్షణత భారతీయ సమాజంలో విశేషంగా గోచరిస్తుంది. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, సోదరులు సోదరీమణులు, తల్లిదండ్రులు వీళ్ళమధ్య ఉండే పరస్పర సంబంధ బాంధవ్యాలు అనాదిగా భారతీయ సమాజంలో ఒక నిర్దుష్ట రూపాన్ని సంతరించుకొని ఉన్నాయి. ఒకరికోసం ఒకరు ప్రాణత్యాగం చేసే స్థితి కూడా కనిపిస్తుంది. భారతీయ సారస్వతం రామాయణ మహాభారత ఇతి హాసాలతో ప్రారంభించి ఈ క్రమబద్ధమైన అనుబంధంతో కూడిన నిర్దుష్ట జీవన విధానాన్నే నిరూపిస్తూ, వాటిలో ఏర్పడే వ్యత్యాసాలవల్ల వచ్చే అనర్థాలను గుర్తింపచేస్తూ, మానవ సమాజాన్ని ఎప్పటికప్పుడు జాగరూక పరుస్తున్నది. మహా భారతం, భారతాధార సారస్వతం, అన్నదమ్ములు ఎలాఉండాలో పాండవ జీవనం ద్వారా సూచిస్తూ, ఎలా ఉండకూడదో కౌరవ పాండవుల మధ్య ఏర్పడిన కలతల ద్వారా ఏర్పడిన దారుణ పరిణామాలను నిరూపిస్తూ, మనముందుంచింది. ఈనాటికీ గ్రామీణ కుటుంబాలలో ఈ బాంధవ్యాల పట్ల అవగాహన పట్టు చెక్కుచెదరకుండా ఉండటం మనం గమనించవచ్చు. నగరజీవనాల్లో ఇప్పుడిప్పుడు క్రమక్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆధునిక సమాజంలో ఈ సంబంధ బాంధవ్యాల శైథిల్యం క్రమక్రమంగా ఎక్కువౌతోంది. ముఖ్యంగా నగరాల్లో అపార్టుమెంట్ కల్చర్ సహజీవనాన్ని పెంచేదే అయినా ప్రక్కప్రక్కవారు కూడా ఒకరినొకరు పట్టించుకోని దుస్థితి కూడా కనిపిస్తున్నది.

తరతరాలుగా ఉన్న వావి వరుసలు కనుమరుగవుతున్న ఉదాహరణలు కోకొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. అర్థకామాలు సమాజంలో ప్రధానమై, కుటుంబ వ్యవస్థతో ప్రారంభించి, మొత్తం సామాజిక జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న వైనం, ఈనాడు స్పష్టంగా కనిపిస్తుంది. భార్యాభర్తలమధ్య, అన్నదమ్ముల మధ్య, స్నేహితులమధ్య, ఒకే సమాజానికి చెందిన భిన్న ప్రాంతాలమధ్య, ఆర్థిక ప్రయోజనాలే ప్రాధాన్యాన్ని వహించి, అనాది సిద్ధమైన బాంధవ్యాన్ని పాడుచేస్తున్నాయి. అర్థ మూలంగా ఒకరిపట్ల ఒకరు విశ్వాసాన్ని కోల్పోయిన స్థితి కూడా కనిపిస్తున్నది. బిడ్డలు గల తల్లిదండ్రులు కొందరు ధనార్జననే ప్రధానంగా చేసుకొని ఆస్తులు అమ్ముకొని విదేశాలలో బిడ్డలను చదివించి, వారిని పెద్దవారిని చెయ్యాలని పడుతున్న తపన, చివరికి తాము తమ బిడ్డలకు దూరం అయ్యే స్థితిని కలిగించడం చూస్తున్నాం. ఎన్నో కుటుంబాలలో వృద్ధులైన తల్లిదండ్రులు వృద్ధాశ్రమాల పాలు కావడమో, ఓల్డేజి హోములను ఆశ్రయించి, కన్నబిడ్డలకు దూరంగా బ్రతకడమో కనిపిస్తున్నది. ఈ దేశంలోనే బ్రతుకుతున్నవారిలో కూడా తల్లిదండ్రులు, బిడ్డల మధ్య ఉండవలసిన ఆరోగ్యకరమైన బాంధవ్యాలు లేకపోవడం గమనించాలి. బిడ్డలు తల్లిదండ్రులు ఇచ్చిన బలంతో పెరిగి పెద్దవారై విదేశాలలోనో లేక స్వదేశంలో దూరంగానో స్థిరపడి ఉంటూ, అడపాదడపా కొంత డబ్బును ఇక్కడికి పంపించడం తప్ప, వృద్ధులైన తల్లిదండ్రుల ఆలనా పలానా పట్టించుకొన్న స్థితి చాలాచోట్ల కనపడడం లేదు. ధనం

మూలంగానే కుటుంబాలు విడిపోతున్నాయి. అన్నదమ్ములు విడిపోతున్నారు. ఆర్థిక ప్రయోజలకు ఇచ్చే ప్రాధాన్యం అనుబంధాలకు ఇవ్వలేని స్థితి క్రమక్రమంగా పెరుగుతున్నది. కుటుంబంతో ప్రారంభమయిన ఈ దయనీయ స్థితి, క్రమక్రమంగా సమాజాలమధ్య దూరాన్ని పెంచుతున్నది.

ధనార్జనా దృష్టి, ధనమే పరమార్థమనే స్థితికి చేరి, ఆర్థిక పరమైన వంచనలకు, మోసాలకు, హత్యలకు, దొంగతనాలకు, దోపిడీలకు కారణం అవుతోంది. తెల్లవారిలేస్తే ఏ వార్తాపత్రికలు చూసినా, ఏ ప్రసార మాధ్యమాలు చూసినా కోట్లాది రూపాయలు మోసంచేసి ఆర్జించిన వార్తలే కనిపిస్తున్నాయి. క్రమక్రమంగా ఈ ఆర్థికమైన నేరప్రవృత్తి కుటుంబపు బాంధవ్యాన్ని, సమాజంలోని సామాజిక బాంధవ్యాన్ని బలహీనపరిచి, కనుమరుగు చేస్తున్న స్థితి చాలా ఆందోళనను కలిగిస్తున్నది.

ఇక కామం, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాల్లో ఏర్పడిన వ్యత్యాసాలకు కారణం అవుతున్నది. వావివరుసలను దెబ్బతీస్తున్నది. సోదర సోదరీమణులమధ్య, తల్లి బిడ్డలమధ్య కూడా ఒక్కొక్కప్పుడు వావివరుసలు దిగజారిన పరిస్థితులను చెప్పేవార్తలు వింటుంటే భారతీయ సమాజ జీవనం బహుముఖీనమైన పతనానికి త్రోవతీస్తున్నదని అనకతప్పదు. కన్నబిడ్డల పట్లే వావివరులు మీరి ప్రవర్తిస్తున్న తండ్రులు కొందరు వార్తల్లో గోచరిస్తున్నారు. ఇక యువకులలోనూ, యువతులలోనూ కామప్రవృత్తి విశృంఖలంగా విజృంభిస్తున్నది. దీనికి ఉదాహరణలు రోజూ మనం చూస్తూనే ఉన్నాం. ఇదంతా కలిప్రభావమేనని సరిపెట్టుకొని బ్రతకడం ఎంతవరకూ సముచితం? సామాజిక జీవన విధానంలో రోజురోజుకూ ఏర్పడుతున్న దారుణ పరిస్థితులను చక్కదిద్దడానికి బాధ్యతగల సామాజికవేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు నడుంగట్టి ముందుకురావలసిన అగత్యం ఉంది. ముఖ్యంగ మానవ సంబంధాల విలువలను సమాజంలోని అన్నివర్గాలచేత గుర్తింపచేసే ఒక ఉద్యమం ఏర్పడితే తప్ప ప్రస్తుత భారతీయ సమాజానికి భవిష్యత్తు భద్రం కాదేమో అనే భయం కూడా చాలామందిలో కనిపిస్తున్నది. అందరూ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు సులభమైన మాధ్యమాలు అందుబాటులో లేకపోవచ్చును. అయినా ఏదో ఒక దశలో వారి హృదయాలలోని ఆక్రోశం వెలుపలికి వస్తూనే ఉంది. ఏదైనా ఒక దుష్పరిణామం సమాజంలో కలిగినప్పుడు తాత్కాలికంగా ఆయా సామాజిక సంఘాల ద్వారా ఆవిర్భవించిన ఉద్యమాలలో కనిపించిన ఆ స్ఫూర్తి, స్థిరంగా ఉండటం లేదు. దీనికి ప్రత్యక్ష తార్కాణం రోజురోజుకూ పెరుగుతున్న మానభంగాలు మొదలైనవి.

ఈనాడు ఎంతో వివాదాస్పద స్థితిలోకి దిగజారిపోతున్న సామాజిక జీవనాన్ని వేలాది సంవత్సరాలు చరిత్ర గల మన సారస్వతం దిద్దుబాటుచేయలేకపోతోందా? మనంవేలాది సంవత్సరాలుగా అలవర్చుకున్న సనాతన ధర్మం, సనాతన ఆదర్శం, మన సంస్కారాల నుంచి క్రమక్రమంగా జారిపోతున్నదా? దీనిపై బుద్ధిపెట్టవలసిన అగత్యం ఉందని సభ్యసమాజం గుర్తించాలి. అనాదిగా మానవ సమాజానికి కావలసిన ఆర్థిక నియమాన్ని, కామనియమనాన్ని మహోదాత్తంగా ప్రతిబోధిస్తూవచ్చిన రామాయణ మహాభారతాల పర్యాలోచనం, ప్రచారం, మరింత విస్తారంగా సాగవలసిన అగత్యం ఉందా? పెద్దలు దీనికై దృష్టిపెట్టాలి. ఏదో ఒక వ్యాజంతో నిరంతరం ఈ గ్రంథాలలోని ఆదర్శాన్ని పదేపదే సామాజానికి అందించకపోతే ఈ సమాజం మరింతగా దిగజారే ప్రమాదం ఉంది. ఈ ఇతిహాసాల లోని కేవల కథల కంటే ఆదర్శజీవనం ప్రధానంగా ప్రతిబోధించింది.

ఆనాడు దాదాపు 50 సంవత్సరాల క్రితం మన శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారు చేసిన మహోద్యమ ఫలంగా రామాయణం, భారతదేశం నలుచెరగులా తన ప్రభను చూపించింది. అటుతరువాత ఆచార్య సేవాయాత్రా ముఖంగా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామివారు విస్తారంగా రామాయణ ప్రచారం చేశారు. ప్రస్తుతం ఆరంభించి చేస్తున్న “శాంతిసుందర” కార్యక్రమంకూడా సుందరకాండ ముఖంగా ఈ సమాజం ఇంకా నేర్వవలసిన ఆదర్శాన్ని మనముందుంచుతున్నది. ప్రతికుటుంబంలోనూ రామాయణ గాథలోని ఒకరెండు ఆదర్శాలైనా, చిన్నపిల్లల మనస్సులో సంస్కార బీజాలుగా వెయ్యగలిగితే భవిష్యత్ సమాజం మరింత దిగజారకుండా ఉంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా నష్టాలు వచ్చినా అన్నదమ్ముల మధ్య ఉండవలసిన బాంధవ్యంగాని, భార్యాభర్తలమధ్య ఉండవలసిన అనుబంధంగాని చెక్కుచెదరకుండా ఉండాలని చెప్పేదే రామకథ. నడుస్తున్న కాలగతిలో ఏర్పడే ఒడిదుడుకులవల్ల, అర్థాంతరంగా జీవితాన్ని త్రుంచుకొనే దౌర్బల్యం మానవుల హృదయాలకు కలుగకూడదని చెప్పేదే సుందరకాండ. సమాజ జీవనంలో మంచిపని చేయడానికి కావలసిన ధైర్యం, లక్ష్యశుద్ధి, చక్కటి ఆలోచన, సమర్థత అనే నాలుగు గుణాలను ఆంజనేయుని ద్వారా సుందరకాండం లోకానికి ప్రతిబోధించింది. కోల్పోయిన వస్తువును ఏడ్చికాక, పూనికతో ప్రయత్నించి, సాధించుకోవాలని సుందరకాండం చెప్పుతున్నది. ఈ ఆదర్శాన్ని మనమంతా పాటించుదాం. మన మధ్య ఉండవలసిన ఆరోగ్యకర సంబంధాన్ని రక్షించుకునే ప్రయత్నం చేద్దాం. అప్పుడే మన పెద్దలు చేసే ప్రయత్నాలు, ఉపాసనలు ఫలిస్తాయి.

-వేంకట రంగరామానుజాచార్య

మధురస్మృతులు

భక్తినివేదన ప్రత్యేక సంచిక, జయనామ సంవత్సరం, మాఘ మాసం 1954,
సంపుటి.8, సంచిక.26, 50 సంవత్సరాల పూర్వపు భక్తినివేదన నుండి

# గీతలో నేర్చుకొనదగినదేది?

శ్రీమతి తూ. వెం. చూడామణిగారు

**సత్ప్రవర్తన :** గీతలో దానిని తెలుపు ఘట్టములు నాలుగు

**12వ అధ్యాయములో 13వ శ్లోకము నుండి 19వ శ్లోకము వరకును**

**13వ అధ్యాయములో 8వ శ్లోకము నుండి 12వ శ్లోకము వరకును**

**14వ అధ్యాయములో 22వ శ్లోకము నుండి 25వ శ్లోకము వరకును**

**16వ అధ్యాయములో 1వ శ్లోకము నుండి 3వ శ్లోకము వరకును**

ఉన్నట్టి మొత్తము 19 శ్లోకములలో ఎట్టి నడవడికయున్న భగవంతుడు ప్రేమించునో, ఎట్టి నడవడికయున్న పరమాత్మ యెఱుకపడునో, ఎట్టి నడవడిక యున్న గుణాతీతుడు కాగలడో, ఎట్టినడవడిక యున్న భగవంతుడు తన కాపులను దైవకోటిలో చేర్చుకొనునో ఆ నడవడికను ఘట్టములు ఉద్ఘాటించుచున్నవి. శ్లోకములు గ్రంథమునుండి గ్రహింతరుగాక యని యిచ్చుట తదర్థములనే పొందుపరచుచున్నాను.

**మొదటి ఘట్టము: గీత 12వ అధ్యాయము 13వ శ్లోకము నుండి 19వ శ్లోకము వరకు**

1. ఏభూతమునందును ద్వేషముచూపకుండుట.
2. అన్నింటియందును స్నేహభావముతోనే యుండుట.
3. దేహాదులయందు మమకారము లేకుండుట.
4. దేహాత్మాభిమానము లేకుండుట.
5. అభిమానిక సుఖదుఃఖములయందు ప్రొంగుక్రుంగులు లేకుండుట.
6. సాంస్పర్శిక సుఖదుఃఖములయెడల వికారములు చెందకుండుట.
7. ఎల్లప్పుడును నిండుగ నుండుట.
8. శుద్ధాత్మస్వరూపమునే ఎల్లప్పుడనుసంధించుట.
9. మనోవృత్తులను స్వాధీనపరచుకొనుట.
10. వేదాంతార్థములయందు దృఢవిశ్వాసము కలిగియుండుట.
11. కర్మలచే నారాధింపబడి ఆత్మసాక్షాత్కారమును ప్రసాదించువాడను నేనేనని (భగవానుడేనని) మనస్సును బుద్ధిని నాయందర్పించుట.
12. లోకమును క్షోభింపచేయకుండుట.
13. ఒడలెఱుంగని ఆనందము కోపము, భయము, మనోవ్యాకులత లేకుండుట.
14. ఆత్మేతరముయందు ఆసక్తి లేకుండుట.
15. శాస్త్రీయమైన ఆహారములతో మాత్రమే శరీరమును పోషించు కొనుట.
16. శాస్త్రీయ కర్మలను నేర్పుతో నాచరించుట.
17. ఇతరపనులను ఉపేక్షించుట.
18. అనివార్య మగు సుఖదుఃఖములకు కలతచెందకుండుట.
19. శాస్త్రవిరుద్ధకర్మలను విడిచి నన్నే (భగవంతునే) భజించుట.
20. ప్రియమునకు సంతోషించక అప్రియమునకు దుఃఖించక లభించనివాటిని కోరక బంధహేతువులగు పుణ్యపాపములను విడిచియుండుట.
21. శత్రుమిత్రాదులయెడల సమముగానుండుట.
22. గౌరవాగౌరవములను శీతోష్ణములను సుఖదుఃఖములను సమముగా భావించుట.
23. దూషణభూషణములను సమముగా తలంచుట.
24. వాఙ్నియమము కలిగియుండుట.
25. లభించినదానితో తృప్తిని చెందుట.
26. ఆత్మయందే స్థిరబుద్ధికలిగి గృహాదులయందు ఆసక్తి లేకయుండుట.

ఈ గుణములుకలభక్తుడు భగవంతునకు మిక్కిలి యిష్టుడు. జ్ఞానమేమి? యని అర్జునుడు అడిగిన ప్రశ్నకు, జ్ఞానసాధనములేమని ప్రశ్న తాత్పర్యమును వర్ణించి అట్టివి యీ క్రింది గుణములని 13వ అధ్యాయమున 8వ శ్లోకము నుండి 12వ శ్లోకము వరకు చెప్పుచున్నాడు.

1. గర్వములేకుండుట. 2. దంభములేకుండుట 3. పరులపీడింప కుండుట 4. పరపీడచే తాను కలత చెందకుండుట. 5. కరణత్రయముల నేకరీతి నుండుట. 6. గురుశుశ్రూష చేయుట. 7. కరణత్రయమును (మనస్సు, వాక్కు, కాయము అనువాటిని) శాస్త్రోక్తరీతిగా శుద్ధముగా నుంచుట. 8. వేదాంతార్థములయందు నిశ్చలముగా నుండుట. 9. మనోనిగ్రహము కలిగియుండుట. 10. విషయములయందు వైరాగ్యము కలిగియుండుట. 11. అహంకార మమకారములు లేకుండుట. 12. జననము మరణము ముదిమి వ్యాధి దుఃఖము అను దోషములు శరీరధారుల కనివార్యములని తలంచుట. 13. ఆత్మేతరములయందు సంగము లేకుండుట. 14. పుత్రకళత్రక్షేత్రాదుల యందు అనురక్తి లేకుండుట. 15. ఇష్టానిష్టములు కలిగినప్పుడెల్లనుసమచిత్తుడై యుండుట. 17. ఏకాంతమగు ప్రదేశమునందు నివసించుట. 18.

జనసమూహమధ్యలో నుండుట కిష్టపడకుండుట. 19. ఆత్మజ్ఞానమందు నిష్ఠకలిగియుండుట. 20. ఆ జ్ఞానమున కుపయోగించు చింతన కలిగియుండుట.

ఇట్లుండుటచే శుద్ధాత్మ సాక్షాత్కారముద్వారా భగవత్ప్రాప్తి తప్పక కలుగును. 14వ అధ్యాయమున అర్జునుడు గుణాతీతుడగుటకును, అయినట్లు తెలియుటకును, సాధనమగు ప్రవర్తన యెట్లుండుననని ప్రశ్నించగా అందులకు శ్రీకృష్ణుడీగుణములను ఉపదేశించెను.

1. సత్వరజస్తమోగుణకార్యములగు ప్రకాశము, ప్రవృత్తి, మోహము అనునవి, అనిష్ట వస్తువులయందు ప్రవర్తించిన ద్వేషించుట ఇష్టవస్తువులనుండి మరలిన కాంక్షించుట లేకయుండుట.
2. సత్వాది గుణములచేగాని తత్కార్యములచేగాని చలించక వానిని తమపనులు తాము చేసుకొననిమ్మని లక్ష్యపెట్టక యుండుట.
3. సుఖదుఃఖములలో చిత్త మేకరీతిగా నుండుట.
4. మట్టి, రాయి, బంగారములయందు సమబుద్ధి కలిగియుండుట.
5. ఇష్టానిష్ట తారతమ్యము లేకుండుట.
6. దేహాత్మ వివేకముతో నుండుట.
7. నిందాస్తుతుల నొకే విధముగ భావించుట
8. మానావమానములయందు సమానబుద్ధి కలిగియుండుట.
9. శత్రుమిత్రుల నొకేవిధముగ జూచుట.
10. సాంసారిక ప్రవృత్తులనుండి విరమించుట.

ఇట్లున్నచో గుణములబారినుండి తప్పించుకొనవచ్చును. ఈ గుణములను బట్టి అట్టివాడనియు తెలియవచ్చును అని సెలవిచ్చెను.

లోకమున మానవులు, దేవతలు, రాక్షసులు రెండే తెగలు, అందు భగవదాజ్ఞను తలదాల్చి వర్తించువారు దేవతలు, దాని నుల్లంఘించి దూషించువారు రాక్షసులు. అందు మన మేతెగకు చెందినవారమో మనంతటగనే పరిశీలించుకొని బాగుపడుటకు ఆ రెండు విధములగు గుణములను ఉపదేశించెను. అందు దైవీసంపదకు చెందినవారి

**గుణములు :**

1. భయము లేకుండుట 2. అంతఃకరణశుద్ధి కలిగియుండుట 3. ఆత్మతత్వనిష్ఠ కలిగియుండుట 4. సత్పాత్రకు దానమొసంగుట. 5. మనోనిగ్రహము కలిగియుండుట. 6. ఫలాపేక్షలేక భగవదారాధన గావించుట 7. వేదాధ్యయనమును నియమముగా జేయుట. 8. చాంద్రాయణ ఏకాదశీ ఉపవాసాదుల జేయుట. 9. ఋజుప్రవర్తన కలిగియుండుట. 11. సత్యమునే పలుకుట. 12. పరులు పీడించినను అలుగకుండుట. 13. ఆత్మహితవిరోధుల త్యజించుట. 14. బాహ్యేంద్రియముల జయించుట. 15. పరుల కనర్థకరముగా మాట్లాడకుండుట. 16. భూతదయ కలిగియుండుట. విషయాసక్తి లేకుండుట. 18. మృదుస్వభావము కలిగియుండుట. 19. కూడనిపనులు చేయుటకు సిగ్గుపడుట. 20. విషయములు దగ్గరనున్నను చలించకుండుట. 21. శత్రువులకు లొంగకుండుట. 22. ఓరిమి కలిగియుండుట. 23. విఘ్నములకు భయపడి ఉద్యమమును విడువకుండుట. 24. బాహ్యాభ్యంతర శుద్ధి కలిగియుండుట. 25. ద్రోహబుద్ధి లేకుండుట. 26 గర్వపడకుండుట.

ఇట్టి నడవడిక గలవాడు దైవీసంపదకు చెందినవాడు గాన యిట్టివాడు మోక్షమునకు అర్హుడు అని ఉపదేశించెను.

ఇట్లు పెక్కు ఫలములకు పెక్కురీతులగు నడవడిక విధింపబడినను పర్యవసానమునకు ఫలమొక్కటియే గావున గీతయందు అభిమానముగల ప్రతి ఆస్తికుడును ఇందు కొన్ని గుణములనైనను అలవరచుకొనుటకు ప్రయత్నించిన తనగీతాభిమానము సార్థకమగును. లేనిచో నిరర్థకమే.

### ప్రియమైన భక్తినివేదన పాఠకులకు - విశేషసూచన

మన భక్తినివేదనను శ్రద్ధతో ఆదరిస్తున్న మీకు ధన్యవాదాలు. మీ సూచనలు, సలహాలను స్పష్టంగా తెలియజేస్తారు కదా! ఇంత వరకూ మన సంస్థలు జరిపే ఎన్నో కార్యక్రమాలలో పాల్గొన్న మీ అనుభవాలను భక్తినివేదన బంధువులతో పంచుకోవాలను కుంటున్నారా? ఎలా ఏ సందర్భంలో పాల్గొని ఏమిచేసారో, అది మీలో ఎలాంటి మధురానుభూతులను మిగిల్చిందో ఒక పేజీకి పరిమితం చేస్తూ వ్రాసిపంపండి.

ఎంపిక జరిపిన వాటిని అందరికీ అందిస్తాం!!! మరిన్ని వివరాలకు

సంపాదకుడు, భక్తినివేదన,
శ్రీరామనగర్, ముచ్చింతల్, పాలమాకుల(పో),
509325 రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.



# ఆచార్య హృదయము

శ్రీమాన్ శ్రీభాష్యం శ్రీనివాసాచార్య స్వామి, హైదరాబాద్

**ఆచార్యస్వాన్తవక్తారం అభిరామవరాభిధమ్**
**శ్రీకృష్ణతనయం వందే జగద్గురువరానుజమ్ ।**
**ద్రావిడామ్నాయహృదయం గురుపర్వక్రమాగతమ్**
**రమ్యజామాతృదేవేన దర్శితం కృష్ణసూనునా ॥**

**అర్థము:** ఆచార్యహృదయము అనే ఈ గ్రంథాన్ని కటాక్షించిన వారున్నూ స్వామి వడక్కుతిరువీధిప్పిళ్ళైగారి కుమారులున్నూ, స్వామి పిళ్ళైలోకాచార్యులవారి సోదరులన్నూ అయిన మణవాళప్పెరుమాళ్ నాయనారులకు నేను నమస్కరిస్తున్నాను. ఆచార్యపరంపరలో వరుసగా వస్తూన్న ద్రవిడవేదమైన తిరువాయ్మొళ్ళి లోని భావం, స్వామి వడక్కుతిరువీధిప్పిళ్ళైవారి తిరుక్కుమారులయిన అళ్గియ మణవాళ ప్పెరుమాళ్ నాయనారులవారిచేత ప్రకాశింపబడింది.

**పణవాళ్ అరవణైప్పళ్ళి పయిల్పవర్క్కెవ్వుయిరుమ్**
**కుణపోగమెన్ఱు కురుకైక్కతిపన్ ఉరైత్త తుయ్య**
**ఉణర్పావి నుట్పొరుళ్ ఒన్ఱు మఱియా వులకఱియ**
**మణవాళన్ మాఱన్ మనమురైత్తాన్ వణ్ముడుమ్బై వన్దే ॥**

**అర్థము:** పడగలతోనున్న ఆదిశేషునిమీద శయనించియున్న శ్రీరంగనాథుడికి సమస్తప్రాణులూ శేషములేనని నమ్మాళ్వారులు తిరువాయ్మొళ్ళిలో సాయించారు. దీనిలోని గంభీరమైన, అంత రార్థాన్ని శ్రీనమ్మాళ్వారుల హృదయాన్ని (ఆచార్యుల మనస్సులో ఏముందో దానిని) అసతూ తెలియని ఈ లోకం కోసం ముడుంబైవంశంలో అవతరించిన అళ్గియ మణవాళప్పెరుమాళ్ నాయనార్వారు కటాక్షించారు.

**మాత్తవత్తోన్ మాఱన్ మనమ్ కూఱుమ్ మణవాళన్**
**తోతవత్తి త్తూయ్మఱైయోరాన పెత్తార్ నీతియినాల్**
**ఆఴ్గవర్ తాళ్ శేర్ పెత్తార్ ఆయ్ మణవాళముని**
**పూఴ్గమలత్తాళ్కళ్ నెఞ్జే పోత్తు.**

**అర్థము:** నమ్మాళ్వారుల హృదయంలోని అభిప్రాయాలందరికీ తెలిసేటట్లుగా అళ్గియ మణవాళప్పెరుమాళ్ నాయనారులు ఈ గ్రంథాన్ని "పెత్తార్" అనే ఒక పూర్వాచార్యులకు ప్రసాదించారు. వారు స్వామిమణవాళ మామునులకి కటాక్షించారు. ఓ నా మనసా! అట్టివారి శ్రీపాదకమలాలను కీర్తించు.

**"శ్రియఃపతియాయ్ సర్వస్వామియాన సర్వేశ్వరన్......."**

పెరియపిరాట్టిమారులకి నాయకుడు, లోకానికంతటికీ యజమానుడు అయిన శ్రీమన్నారాయణుడు, హద్దులేని ఆనందంతో శ్రీవైకుంఠములో ఎల్లప్పుడూ ఉండటంచేత, ఆ శ్రీవైకుంఠం నిత్యమని చెప్పబడుతుంది. అక్కడ వేంజేసి ఉండే ఆయనని, నిత్యుడనీ, దోషాలు లేని జ్ఞానంమొదలైన అనేక గుణములుగలవాడనీ, సర్వేశ్వరుడనీ ఆయన గురించిన తలంపుతోటే యుండే స్వరూపం, స్థితి, ప్రవృత్తులు గలవారైన నిత్యసూరులక్కడ ఉంటూ, ఎల్లవేళలా ఆ స్వామిపాదాలకు కైంకర్యం చేస్తూంటే వాళ్ళని అభిమానిస్తూ లోకాలని నడిపిస్తూన్న వాడుగా సర్వేశ్వరుడు అక్కడ వేంచేసియున్నాడు.

ఈ భూమిమీదనున్న ఇతరులుకూడా ఆ నిత్యసూరులలాగనే తనను అనుభవింపదగిన సంబంధం గల వాళ్ళైనా, వాళ్ళు దాన్ని పొందక నష్టపోయి యుండటంచూసి, అయ్యో అని చాలా బాధపడ్డాడు. అందుచేత వీళ్ళని ఈ దుఃఖంలోంచి ఒడ్డుకు చేర్చాలని ఆశించేడు. భట్టరువారి శ్రీరంగరాజస్తవం ఉత్తరశతకం 41వ శ్లోకంలో **"అచిదవిశేషితాన్ ప్రళయసీమని సంసరతః కరణ కళేబరైః ఘటయితుం దయమానమనాః"** (ప్రళయంచివర జ్ఞానంలేని అచేతన వస్తువుల్లాగ పడియున్న ఈ ఆత్మలకీ, ఇంద్రియాలు, శరీరాలూ ఏర్పాటుచేసి వాళ్ళు తనని చేరి ఆనందంగా ఉండాలనే జాలిమనస్సుతో నున్నవాడు) అని చెప్పినట్లుగా శరీరేంద్రియాలు లేనివాళ్ళుగా, జ్ఞానములేని అచేతనాలవలె పడియుండి, అందుచేత ఆనందాన్నీ, మోక్షాన్నీ అనుభవించలేనివారుగా ఈ ఆత్మలు ఉంటే వీటిని చూసి దయాపూర్ణమైన మనస్సుతో దుఃఖించాడు. అందుకని, ఈ ఆత్మలు తన శ్రీపాదాలను ఆశ్రయించటానికి ఉపకరణాలుగా ఇంద్రియాలతో పాటు శరీరాలని ప్రసాదిస్తున్నాడు. అంతేకాక, శ్రీరంగరాజస్తవంలోనే **"మానం ప్రదీపమివ కారుణికో దదాతి"** (పరమకారుణికుడైన సర్వేశ్వరుడు దీపములెనున్న ప్రమాణమైన శాస్త్రములను ప్రసాదించెను) అని చెప్పినప్రకారం చేతనులకు సరియైన మార్గాన్ని చూపించటానికి వేదశాస్త్రాలను ప్రసాదించాడు.

**"అనన్తరమ్ మన్వాదికళుక్కు అన్తర్యామియాయ్ నిన్ఱు...."**

ఆ తరువాత, మనువు మొదలైనవారికి అంతర్యామిగానుండి చేతనుల శరీరాలతో చేరిన ఆత్మలను గురించిన శాస్త్రాన్ని ప్రకాశింపజేసేడు. కాని, ఆ శాస్త్రాలను నేర్చుకోవటానికి ఎన్నో యెగ్యతలు అవసరమనవటంచేతను, వాటిని నేర్చుకొని తెలుసుకొన టానికి చాలాకాలం పట్టటంచేతను, వాటిని చదివి తెలుసుకోవటం చాలాకష్టమని భావించేరు. అందుచేత నేర్చుకొనటానికి చాలా సులువుగాను, చదివి తెలుసుకోవటానికి కావలసిన యోగ్యత ఏదీ అవసరంలేనిదిగాను ఆత్మని గురించి మత్రమేచెప్పే మంత్రమైన (అష్టాక్షరీ మంత్రం) బ్రహ్మవిద్యను తానే ప్రకాశింపచేసేడు.

ఈ విధంగా అష్టాక్షరీ మంత్రాన్ని ప్రకాశింపచేసినా, దానిని ఉపయోగించు కోవడం లేకపోయింది. అలాంటి లోకాన్ని తామే నేరుగా పోయి వారిని దిద్దుబాటు చేసే రాజులలాగా "మనమే వాళ్ళున్నచోటికి వెళ్ళి వాళ్ళని దిద్దుబాటు చేద్దాం" అని భావించి, రాముడు, కృష్ణుడు మొదలైన అవతారాలెత్తి, వీళ్ళున్నచోటికి తానే వచ్చి దిద్దుబాటుప్రయత్నం చేసేడు. అప్పుడుకూడ లోకులు బాగుపడలేదు.

అది గమనించిన సర్వేశ్వరుడు "వీళ్ళలో సజాతీయులం కానందున వీళ్ళను బాగుచేయటం కుదరటంలేదు. మగ ఏనుగును పనిలోకి పెట్టుకోవటానికి ఎలాగైతే ఆడయేనుగును ఉపయోగిస్తారో అలాగే వీళ్ళలోనే ఒకడుగా ఉన్నవారిద్వారానే వీరిని దిద్దుబాటు చేయాలి" అని నిశ్చయించుకున్నాడు. అందుకోనం అన్నింటికీ ముందుకొచ్చేవాడిని ఏర్పాటుచేయటానికి అన్ని ఆత్మలనీ ఉజ్జీవింపచేయటమే కోరికగాగల ఆ పరమాత్మ తమ కరుణను అంతటా ప్రసరింపజేసి చూసినా అలాంటివాడు దొరకలేదు.

అప్పుడు సర్వేశ్వరుని దృష్టి దక్షిణంవేపుపడింది. ఆ చూపు తిరువాయ్‌మొళ్ళిలో "మాఱి మాఱి పలపిఱప్పుమ్ పిఱన్దు" అని 2-6-8లో చెప్పినట్టుగా ఎన్నోజన్మలు ఈ సంసారంలో మళ్ళీమళ్ళీ తిరిగి తిరిగి పుట్టుతూ, గిట్టుతూ నిత్యం సంసారంలోనే యుండేవారైన స్వామి నమ్మాళ్వారుల మీద పడింది. ఏకారణం లేక ప్రసరించిన సర్వేశ్వరుడి ఆ కటాక్షంచేత దివ్యమైన జ్ఞానాన్నీ భక్తినీ ఐశ్వర్యాలు అనే వాటినన్నింటినీ స్పష్టంగానూ, విస్తారంగానూ అనుభవించారు.

అలాంటి అనుభవాలు ఆళ్వారులకి లోపల ఇమడక ఆ అనుభవాలు పాశురాలుగా బైటికి వచ్చాయి. రామాయణంలో బాలకాండలో వాల్మీకి మహర్షి స్నానానికి వెళ్తుంటే ఒక వేటగాడు జంటగా ఉన్న పక్షుల్లో ఒకదానిని బాణంవేసి కొట్టి చంపాడు. దానికోసం రెండో పక్షి విలవిల్లాడితే అది చూసి చలించిపోయిన మహర్షి ఆ వేటగాడిని "మానిషాద! అంటూ నిందించాడు." ఆ నిందావాక్యమే – "ఓ వేటగాడా! ఏ కారణంచేత నువ్వు జంటగానున్న పక్షుల్లో ఒక పక్షిని చంపావో, అదే కారణంచేత నువ్వు ఇక బ్రతికి ఉండగా అటువంటి చేరికను పొందవు" అని శపించాడు. అలా ప్రారంభమైన ఆ మాట బ్రహ్మకటాక్షంచేత శ్లోకంగా అయింది. సమస్త లక్షణాలతో నున్న ఆ శ్లోకాలతో చెప్పిన రామాయణంలాగ సర్వేశ్వరుడి కటాక్షం కారణంగా సమస్త లక్షణములతోనున్న పాశురాలుగా ప్రసిద్ధి పొందాయి.

**"ఇతుతానుమ్, ద్రావిడవేదతయా విస్తీర్ణమాయ్...."**

ఇలాంటి ఆళ్వారులు ప్రసాదించిన తిరువాయ్‌మొళ్ళి ద్రవిడవేదం కావటంచేత చాలా వివరముగా ఎన్నో అర్థాలను ఇముడ్చుకొని చెప్పినదిగా ఉంది. అందుచే దీని రహస్యార్థాలనేవి అందరికీ తెలుసుకోవటానికి చాలా కష్టమని అళ్గియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్ భావించారు.

కనుక ఈ ద్రవిడవేదంలో చెప్పబడే అన్ని రహస్యార్థాలని ఆళ్వారులు చక్కగా అనుభవించి ప్రసాదించారనీ, నమ్మాళ్వారులకు ప్రతికరమైనవి మాత్రమే అందరికిని ప్రాప్యాన్ని పొందించే గంభీరార్థాలనీ, తన అపారకరుణ కారణంగా వాటిని అందరికీ వివరించాలనీ భావించారు.

అందుచే "ఆచార్యపరంపర" అనే శ్రీమన్నారాయణుడితో ప్రారంభమైన ఈ పరంపరలో క్రమాగతంగా వస్తున్న ఈ గంభీర రహస్యార్థాలనన్నింటినీ అందరూ తెలుసుకోవటానికి తగినట్లుగా అతిసంగ్రహంకాకుండా, అతి విస్తారమూకాకుండానూ ఉన్న ఈ ఆచార్యహృదయం అనే గ్రంథాన్ని ప్రసాదించారు.

స్వామి ఆళవందారులు స్తోత్రరత్నం(5)లో **ఆద్యస్య నః కులపతేః** మన వంశానికి మొదటివారూ, ముఖ్యులూ అయిన నమ్మాళ్వారుల– అని చెప్పినట్లుగా నున్న వైదికకులానికి ప్రథమాచార్యులైన నమ్మాళ్వారులు ప్రసాదించిన దివ్య ప్రబంధాలలోవారి మనస్సులో కలిగిన గంభీరార్థాలను చెప్పడంచేత ఈ గ్రంథానికి "ఆచార్య హృదయం" అని పేరువచ్చింది.

అజ్ఞానగంధ రహితమైన భక్తిరూపాపన్న జ్ఞానం పొందినవారు సాయించినవి అనే కారణంచేత చాలా విశ్వాసపాత్రమైనవి, అతిప్రీతికరమైనవి ఈ దివ్యప్రబంధాలు తమకే ఎప్పుడూ అపేక్షితాలు అవటంచేతను, ముత్యాలలక్షణాలని చక్కగా తెలిసినవాడు తయారుచేసిన ముత్యాలహారం చాలా విలువగలదై అమ్ముడు పోయినట్లు, పదాలను కూర్చటంలో మెళకువతో, ఆళ్వారుల సూక్తులని ఆనందించేవారికి, వాని అర్థంకంటె పదాలకూర్పే చాలా బాగుంటుం దని భావించటం చేతను, ఈ ప్రబంధంలో వీరు ఆళ్వారులు సాయించిన ప్రబంధాలలోని పదాలతోనే ప్రసాదించిన చూర్ణికలు అమర్చారు. అందుచేతనే ఈ గ్రంథం పదాలు, వాటి అర్థాలు అనే రెండు విధాలైన రుచులతో రసికులైనపాఠకుల మనస్సులకి ఆనందం కలిగించేటట్లు ఉంటుంది. *(సశేషం)*

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341
Vijay Ads




శ్రీమతి డా॥టి.కె. చూడామణి-సికింద్రాబాద్

*(గత సంచిక తరువాయి)*

## శ్రీభాష్యకార నవరత్న విన్నపములు

### 3

భక్తసులభా! మీ ప్రభావంబు కొనియాడ బ్రహ్మాదుల కసాధ్యంబు. భూపతి కొమార్తెను పట్టిన బ్రహ్మరాక్షసిని విడిపించి మోక్షంబు ప్రసాదిస్తిరి. 'శివాత్ పరతరం నాస్తి' అన్న చోళేశును బట్టి మీ శిష్యుని చేయగెలిపిస్తిరి. చెరబోయిన శెల్వపిళ్ళరాయుని దెచ్చి సింహాసనస్థునిగ చేస్తిరి. శ్రీభాష్యాది రహస్యంబులుద్ధరించి సిద్ధాంత కర్తలయితిరి. విష్ణుదర్శనంబు నిలుపచేస్తిరి. శ్రీవేంకటేశ్వరుని మీ శిష్యునిగా చేసుకుంటిరి. ఇటువంటి మహాత్ములు మీరు. మీ ప్రభావంబు కొనియాడ నేనెంతడివాడను? అధమాధముడ అజ్ఞాన జంతుడను. నరపశువును. నా నేరములెంచక నన్ను రక్షించుటేఘనము శ్రీభాష్య కారోత్తమా ।

### 4

మాయావాదికోలాహలా, చతుర్భుజుండైన శ్రీమన్నారాయ ణుడు కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, కలియుగంబులందు, మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, కృష్ణ, బౌద్ధ, కల్క్యాది దశావతారంబులుగా అవతరించి శరణాగతులైన వారిని కాచి సంసార బద్ధులం చేసిరికాని మోక్షము ప్రసాదించ లేదాయె. మీరు కలియుగంబునందు అవతరించి సకల ఆత్మలకు, అనేక అర్థంబులు ప్రసాదించి శేషత్వ, పారతంత్ర్య, కైంకర్యంబులు తెలిపితిరి. కామ, క్రోధ, లోభ, మోహాదులు విడిపిస్తిరి. సర్వరక్షకా! ఇటువంటి దోషభోగ్యులు ఎందు కలిగే శ్రీభాష్యకారోత్తమా!

*(సశేషం)*







**ఉపయుక్త శ్రుతివాక్కరంబిత మదీయోక్తుల్ నిబంధించుచో**
**నపశూద్రాది కృతి ప్రసక్తి జొర దాజ్యావేక్షణన్యాయమై**
**యపరిత్యాజ్య మటంచు భర్తృహరి భాష్య వ్యాఖ్యమాడ్కిన్నిగుం**
**భపరీపాకముఁజూచి మెత్తురుబుధుల్ భావజ్ఞ! రామానుజా॥**

**అర్థము:** భావజ్ఞ= పరుల భావమును గుర్తింప సమర్థుడా, రామానుజా! ఉపయుక్త=ఈ శతకమందచ్చటచ్చట నాచే నుపయో గింపబడిన, శ్రుతివాక్=ఉపనిషద్వాక్యములతో, కరంబిత= కలపబడిన, మదీయోక్తుల్=నామాటలు, నిబంధించుచో= కూర్చిన యెడల, ఆజ్యావేక్షణ న్యాయమై=నేతిలో ముఖము చూచుకొను రీతిగా (దుష్టనక్షత్రమందు జన్మించిన పుత్రుని ముఖమును తండ్రియు, దుష్టనక్షత్రమందు రజస్వలయయిన భార్య ముఖము భర్తయును నూనెలో జూచుకొనుట ఆచారము, ఆరీతిగా) అపశూద్రాది కృతిప్రసక్తి=అపశూద్రాధికరణమందు చెప్పబడిన దోషము యొక్క ప్రసక్తి, చొరదు=రాజాలదు. అపరిత్యాజ్యమటంచు= విడువఁదగనిది యని, భర్తృహరి భాష్య వాఖ్య మాడ్కిన్=నీచకులమందు బుట్టిన భర్తృహరి రచించిన పతంజలి మహాభాష్య వ్యాఖ్యానమువలె, నిగుంభ పరీపాకము= రచనాపరి పాకమును జూచి, బుధుల్=పండితులు, మెత్తురు=శ్లాఘించెదరు.

**తాత్పర్యము:** ఈ పద్యమును బట్టి యీ శతక కర్త శూద్రుడని స్పష్టముగా దెలియుచున్నది. సాక్షాద్దర్శనము లేకుండ భర్తృ భార్య లొకరి ముఖమును మఱియొకరు నూనెలో జూచుకొన్న యెడల దోషము తొలగునట్లు మదీయోక్తి బింబాంతరితోపనిషద్వాక్యసమితి నీ శతకమందు నేను ప్రయోగించినను శూద్రుడు వేదమంత్రముల నుచ్చరింప గూడదను అపశూద్రాధికరణమందు జెప్పఁబడిన నిషేధము నాకు తగలదు. సరియే కదా మీదుమిక్కిలి తక్కువ జాతియందు బుట్టిన భర్తృహరి రచించిన పతంజలి మహాభాష్య వ్యాఖ్యానమువలె బుధజనాదరణీయమై శ్లాఘింపఁబడును. *(సశేషం)*

# సత్కథా కాలక్షేపము

కీర్తిమూర్తులు, కవికళానిధి, కవిశేఖర, పండితరత్న
'విద్వత్ కవిశేఖర' కవిరత్న
**ఉ॥ వే॥ శ్రీమాన్ గుదిమెళ్ళ రామానుజాచార్యస్వామి (కవిగారు)**

*(గత సంచిక తరువాయి)*

ఒకనాడు శ్రీ కేశవసూరి తన కుమారుని వెంటనిడుకొని సన్నిధికి బోవుచుండెను. త్రోవలో నొక శ్రీవైష్ణవస్వామి తిరుమాళిగ ప్రాంగణములో కొందరు ఛాత్రులు బహిర్విత్తర్దికల మీద కూర్చొని వేద పన్నములను వర్లన చేయుచుండిరి. ఆ వర్లనలో నొక చోట స్వరము తప్పినది. వెంటనే తండ్రివెంట త్రోవలో బోవుచున్న లక్ష్మణాచార్యుడు ఆస్వర మట్లుగా దిట్లని చదివి వినిపించెను. విద్యార్థి లొక్కుమ్మడి లేచి స్వరము తప్పినట్లు నీకేమి తెలియునని లక్ష్మణాచార్యుని మీదికి వచ్చిరి. ఇదే పన్నము మొన్న మీ గురువుగారు మీకు చెప్పుచుండగా వింటినని లక్ష్మణార్యుడనెను. ఏదీ ఆ పన్నమునీ విపుడు చెప్పుమనెను. "లక్ష్మణార్యుడదే పన్నము ఉదాత్తానుదాత్త స్వరములో చదువుట కుపక్రమించెను. ఇంతలో కేశవసూరి వచ్చి నాయనా! ఉపనయనము కానిదే వేద ముచ్చరించరాదని నివారించి కుమారుని వెంట తోడ్కొని పోయెను. విద్యార్థులకిది వింతగా గనిపించెను. విద్య, పూర్వజన్మ సంస్కార జనితము, గురువులు నిమిత్త మాత్రులు.

లక్ష్మణార్యునకు జూచుచుండగా ఎనిమిదేండ్లు వచ్చెను. ఈ ఎనిమిదేండ్ల ప్రాయములోనే సంస్కృతములో మాట్లాడగల సాహిత్య మార్జించెను.

**మౌంజీబంధం చకారాథ పుత్రస్యాఽ మిత తేజసః ।**
**గర్భాష్టమే శుభదినే కేశవార్యో మహాయశాః ॥**
**వేదాన్ సలక్షణాన్ తస్య స్వయమే వోపదిశ్య చ ।**

లక్ష్మణార్యునకు సలక్షణముగా ఉపనయనమైనది. వేదవిద్య ప్రారంభించెను. మూలము వచ్చినది. క్రమము, జట, ఘన చెప్పుట ప్రారంభించెను. సకాల సంధ్యావందనాది నిష్ఠలను, సక్రమముగా జరుపుచుండెను.

సంస్కృత భాషా సాహిత్యముతో పాటుగా ద్రావిడభాషా సాహిత్య మార్జించెను. పల్లాండు వచ్చినది. తిరుప్పళ్ళిఎఴుచ్చి వచ్చినది. తిరుప్పావు పాశురములన్నియు కంఠతఃవచ్చినవి. క్రమక్రమముగా నారాయిర పాశురములన్నియు నాలుకమీద నాట్యమాడుచుండెను.

లక్ష్మణార్యుడు తిరుప్పావు పాశరములన్న విశిష్య ఈడు పడుచుండును. ప్రతిదిన మా పాశుములెన్నిమారులో అనుసంధానము చేయుచుండును. తదర్థ విశేషములను దండ్రి కడ గొంతవఱకు తెలుసుకొనెను. ఎనిమిదేండ్ల ప్రాయము గల యీ బాలునకు తిరుప్పావు పాశురములనిన ఎంత ప్రీతి!

గోదాదేవి పాశురములు గులాబి పువ్వుల వాసన వలె ఘుమఘుమ లాడుచుండును. ఆ కవిత్వము అభ్యాసము వలన వచ్చినది కాదు. స్త్రీ సహజమైన ప్రేమరస మాకవితారూపముగా భగవంతుని యందు సుధా ప్రవాహము వలెఁ బ్రవహించినది. కవిత్వము కష్టబడి నేర్చుకొనిన వచ్చు కళ కాదు. అది పూర్వజన్మ సుకృత విశేష సంపాదితము. కవులు పుట్టుదురుగాని పుట్టిన తరువాత కవులు గారు, అట్లే గోదాదేవి పుట్టుకతోనే కవయిత్రి. ఈమె తండ్రిగారు శ్రీవిష్ణుచిత్తులు వారు పాడిన పల్లాండు పాశురము లెంత మధురాతి మధురములో వారి తిరుక్కుమార్తె యయిన శ్రీఆండాళ్ తిరుప్పావు పాశురములంత ప్రపన్నజనైక భోగ్యములు. తండ్రిగారి పాండిత్యమునకు భగవత్కటాక్ష మవలంబము, ఈ భగవత్కవి **"గురుముఖ మనధీత్య ప్రాహ వేదానశేషాన్"** అట్లే యీ గోదాదేవి అయోనిజ – తులసీకాననోద్భవ.

తులసీదళము భగవంతునకు బ్రీతి పాత్రము. అట్టి వనములో నీమె జన్మించుటే భగవత్కటాక్ష పాత్రురాలనుటలో సందేహమేమి! కనుకను ఈ తండ్రి కుమార్తెలు రచించిన పల్లాండు తిరుప్పావు ప్రబంధము లద్యాపి ప్రపన్నులకు పరమ భాగధేయములుగా నున్నవి.

ఒకనాడు లక్ష్మణార్యుడు తండ్రికడ వినమ్రుడై బద్ధాంజలియై నిలుచుండెను. శ్రీకేశవసూరి ఏమి నాయనా! అట్లు నిలుచుంటివి. ఏదియో యడుగ దలచినట్లుంటివి యడుగుమనెను. కుమారుని ప్రియమార నొడిలోనికి తీసుకొని, ఏమి నీ సంశయమని యడిగెను.

అంత లక్ష్మణార్యుడు – గోదాదేవి గుఱించి యొక వింత వింటిని. యిది యెంత వరకు నిజమని యడిగెను. ఏమా వింత యని తండ్రి యడిగెను. అసలు గోదాదేవి తులసీవనములో నవతరించలేదనియు, ఆమెను భట్టనాథుడు పెంచలేదనియు, ఆమె స్వయముగా తిరుప్పావు


**www.mangalaakshatas.com**
In commitment to help the people of spiritually inclined,
we come up with the unique platform for
'Sri Vaishnava Community' to choose their life partner with an ideal mind set.
*With the Mangalasanams of*
"Sri SriSriTridandiChinnaSrimannarayanaRamanujaJeeyarSwamiji" we
present you with 'mangalaakshatas' - A wedding platform for Sri Vaishnavas.
We are now open for free registrations. Please visit: **www.mangalaakshatas.com**
**మీ జీవిత భాగస్వామికోసం ఎదురుచూస్తున్నారా?.. ఇదిగో మీ ముందుకు 'మంగళాక్షతలు'**
**మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి**
**మంగళాశాసనములతో...! పై వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోండి!**

రచించలేదనియు, ఆమె రంగనాథుని వివాహమాడ లేదనియు, ఇదంతయు శ్రీభట్టనాథుని భావనా ప్రపంచములో జరిగిన కథా విశేషమనియు, భట్టనాథుని విజ్ఞానరేఖ యొక గోదాదేవిగా సృష్టింపబడినదనియు ఆయనకుఁ దులసీవన కైంకర్యము పరమ ప్రీతి కరముగాన ఆ తులసీవనములోన భావనారూపములో గోదాదేవి అవతరించెననియు, ఆమెను తాను పెంచుకున్నట్లును, తాను పెరుమాళ్ళకు నిత్యము సమర్పించు తులసీ పుష్ప మాలికలు ఆమె ధరించినట్లున్ను, అవి వటపత్రశాయికి భక్తితో సమర్పించు పత్రముగాని పుష్పముగాని తనకు పరమ భోగ్యమని గీతాసూక్తి మహా ప్రీతికరములయ్యెననియు, ఈ భావనారూపిణి యగు గోదాదేవి శ్రీరంగనాథుని వరించి వ్రతానుష్ఠానము ప్రారంభించి దినమునకొక పాశురము రచించినట్లుగా తానే రచించి నట్టున్ను తుదకు తన భావనారూప గోదాదేవి శ్రీరంగమున కేగి శ్రీరంగనాథుని పాదార విందములో నైక్యమొందెననియు, నీ రీతిగా నొక పండితమ్మన్యుడు విమర్శించినట్లుగా నాకొక స్వామి వివరించెను. ఇది సత్యమా! శ్రీగోదాదేవి ఎంత గోపికా భావనతో ఉన్నను తిరుప్పావులో వర్ణించిన దృశ్యములన్నియు శ్రీవిల్లిబుత్తూరు దృశ్యములే కనిపించుచున్నవట, యీ గోదాచరిత్ర మంతయు శ్రీభట్టనాథుని భావనా ప్రపంచములో జరిగిన ఒక దృశ్యమట. ఆనాడు శ్రీవిష్ణుచిత్తులు శ్రీగోదాదేవినిగా తనను భావించుకొని తదీయ కథా తన్మయత్వములో రచించినవే యీ తిరుప్పావు పాశురములు శ్రీగోదాదేవి భట్టనాథుని భావనా స్వరూపిణియైన కన్యక. తదీయమైనదీ విషయమని తెల్పెనట. ఇందలి తత్త్వమేమని లక్ష్మణార్యుఁడు తండ్రినడిగెను.

నాయనా! ఇట్టి విషయము లెవరు చెప్పినను నీవు వినవలదు. ఇవి కుతర్క జనితములు. గోదాదేవి తులసీ వనములో నవతరించ లేదని వాదించిన వాడు, సీతాపిరాట్టి కూడా భూమిలో నవతరించలేదని వాదించును. 'సీతాయాశ్చరితం మహత్' అని శ్రీవాల్మీకి మహర్షి రచించిన రామాయణ కావ్యమునే విమర్శించ వచ్చును. ఇది యొక్క విపరీత వాదము. దీనిని విశ్వసింపకుము. ఆండాళ్ తల్లి అవతారము సత్యము. తిరుప్పావు శ్రీగోదాదేవి రచించిన దనుటలో ఆవంతయు నసత్యములేదు. నీ జీవితములో ఈ తిరుప్పావు పాశురములను సదా అనుసంధానము చేసుకొను చుండుము. గోదాదేవియందు, ఆమె పాశురముల యందు సదా ఈడుపడి యుండుము. ఈ తిరుప్పావు పాశురములే నీ భవిష్యజ్జీవితములో అసమానకీర్తి నార్జించి యిచ్చును. తుదకు ఈ తిరుప్పావు నామమునకు నీ నామమునకు అవినాభావ సంబంధమేర్పడి యుండుగాకయని కుమారునిదీవించెను. తదాది లక్ష్మణార్యునకు తిరుప్పావు పాశురములందు ప్రీతి ద్విగుణీకృత మయ్యెను. లక్ష్మణార్యునకుఁ బదారేండ్లు వచ్చినవి. సంస్కృత భాషలో నపార పాండిత్య మార్జించెను. ఇక వేదాంత విద్య నభ్యసింపవలెను. తగిన గురువు ఎవరా! యని అన్వేషించు చుండెను.

శ్రీకేశవసూరి కుమారునకు వివాహము చేయవలెనని సంకల్పించెను. కుమారుడు నవమన్మథునివలె నున్నాడు. విద్య, వినయము, విజ్ఞానము, వయస్సు అందము, అన్నియు గుమిగూడి లక్ష్మణాచార్యుని యందు ప్రవేశించినవి. ఒకనాడు ఒక శ్రీవైష్ణవ స్వామి తన కుమార్తెనిత్తునని శ్రీకేశవసూరి తిరుమాళిఘకు వేంచేసెను. శ్రీకేశవసూరి కన్యాదాత వంశవృత్తాదులు విచారించెను. గోత్రములు కలిసినవి. జాతకములు చూచుకొనిరి. తారాబలము చూచుకొనుటలో ప్రత్యక్‌తార వచ్చినదేయని కొంచెము ముందు తటపటాయించిరి. కాని దాని కుపశాంతి చేసుకొనవచ్చునని సరిపుచ్చుకొనిరి. మరునాడు శ్రీకేశవసూరి, కాంతిమంతీ దంపతులు పిల్లను జూచుటకు వెళ్ళిరి. పిల్లబాగుగనే ఉన్నది. మొగలిరేకువలే ముద్దుగా నున్నది. నీ పేరేమని కాంతిమతి యడిగెను. తంజమ్మయని కోకిల స్వరముతో కోమలముగాఁ జెప్పెను. కేశవసూరి యా పేరు వినగనే సంతసించెను.

తంజమ్మ ఈ పేరు ఎంత బాగున్నది. తంజ మనగా రక్షకము. తంజమ్మనగా రక్షకురాలు. ఎవరికి రక్షకురాలు ఆసూరివారి కుటుంబమునకా? లేక లోకులకా! ఏమో ఈమె తన భర్తకే రక్షకురాలగునా! అయినా మంచిదే కదా! సిరిని బట్టియేకదా హరికిగౌరవము, భగవంతునకెన్ని తిరునామములున్నను, శ్రియః పతి శబ్దమే ప్రపన్నులకు శ్రవణపేయము. **"అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా"** యని కదా వాల్మీకి వ్రాసెను. పిల్లబాగున్నది. పేరు బాగున్నది. కాని పిల్లకనులలో ఏదో అభిమానము గోచరించుచున్నది. కాపురములోఁ గలత లేకుండ కలకాలము జరుగునా! "యద్భవ్యం భవ్యం భవతి" అనుకొని తంజమ్మను తన కుమారునకు వివాహము చేసుకొనుట కంగీరించెను. దారాః పితృకృతా ఇతి న్యాయముగా తల్లిదండ్రులంగీకరించిన పిల్లను వివాహ మాడుటకు లక్ష్మణార్యుడు అంగీకరించెను. *(సశేషం)*




తీర్థయాత్ర
19.9.2015 విజయవాడ నుండి బయలుదేరును
108 శ్రీ వైష్ణవ దివ్య దేశములలో 95 క్షేత్రములు
మరియు కేరళలోని
శ్రీ వైష్ణవ దివ్య దేశముల 16 రోజుల తీర్థయాత్ర
ముక్తినాథ్ యాత్ర కలదు.
వివరములకు :
విష్ణు వందన ట్రావెల్ సర్వీసెస్ సెల్: 09290574187 09032935316

| | |
|---|---|
| తొండైనాడు | 22 |
| నడునాడు | 2 |
| చోళనాడు | 40 |
| పాండ్యనాడు | 18 |
| మలైనాడు | 13 |
| క్షేత్రములు | 95 |



# వరదరాజ పంచాశత్ (శ్రీస్తవము)


ఉ.వే.శ్రీమాన్ కె.ఇ. స్థలశాయి స్వామి- స్థానాచార్యులు,
శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం - భద్రాచలం

భారతీయ వాఙ్మయములో స్తోత్ర సాహిత్యమునకు ప్రత్యేక స్థానమున్నది. ప్రధానముగా శ్రీవైష్ణవ సంప్రదాయమునకు చెందిన పూర్వాచార్యులు స్తోత్రవాఙ్మయమునకు ఎనలేని సేవచేసినారు సాధారణముగా స్తోత్రమనగా ఇష్టదేవతను కీర్తించునదే అయినా, ఇష్టదేవతా కీర్తనతో పాటుగా వేదాన్తము, సామాజిక స్పృహ, పూర్వపక్ష-సిద్ధాన్తములు, భౌగోళిక వర్ణనము మొదలగు అనేక విషయములు శ్రీవైష్ణవాచార్యుల స్తోత్ర రచనలలో కనిపిస్తాయి. భగవద్రామానుజుల తర్వాత వారి సంప్రదాయమును పరిపుష్టం చేసిన మహనీయులు, వారి సమకాలికులు మరియు శిష్యులైన శ్రీవత్సాంకమిశ్రులు పంచ స్తవములనే స్తోత్రములను కావ్య సదృశములుగా రచించారు. వీరి పుత్రులైన శ్రీపరాశర భట్టర్ అనువారు శ్రీగుణరత్నకోశము, శ్రీరంగరాజస్తవము మొదలగు స్తోత్రములను రచించారు. మరల, శ్రీవైష్ణవ సంప్రదాయ సంస్కృత వాఙ్మయమునకు వారివలె సేవనందించిన వారిలో శ్రీవేదాన్తదేశికులదే ప్రథమ స్థానమనుట అతిశయోక్తికాదు. శ్రీవేంకటేశ్వరుని ఘంటాంశమున అనంతసూరి, తోతాంబ దంపతులకు కాంచీపురమునందలి తూప్పుల్ అనే ప్రాంతమున అవతరించిన శ్రీవేదాన్తదేశికులు, శ్రీహయగ్రీవస్వామి యొక్క అనుగ్రహముచే కవితార్కిక సింహులని, సర్వతంత్ర స్వతంత్రులని ఖ్యాతిని పొందారు. సంప్రదాయ-స్తోత్ర-శాస్త్ర-సాహిత్య-వేదాన్త-వాద గ్రంథములను శతాధికంగా రచించి శ్రీవైష్ణవ సంప్రదాయమునకు కంచుకోటవలె నిలిచారు. ఆ మహనీయులు, కాంచీపురమున వెలసిన శ్రీవరదరాజస్వామిని స్తుతిస్తూ రచించిన 'ఈ వరదరాజ పంచాశత్' అనే స్తోత్రము అనేకములైన విశిష్టాద్వైత సిద్ధాంత రహస్యములను ప్రతిపాదించుచున్నది. యథాశక్తిగా వాటిని పరిశీలించుదాము.

తిరుక్కోవలూర్ అనే దివ్యదేశమునందు వేంచేసియున్న శ్రీత్రివిక్రమస్వామిని 'దేహలీశస్తుతి' అనే స్తోత్రముద్వారా వేదాన్త దేశికులు కీర్తించారు. "తద్విష్ణోఃపరమంపదం సదా పశ్యన్తి" అన్నట్లు, సదా భగవదనుభవాన్ని ఈ సంసార మండలంలో కోరుతున్న వీరికి అది లభింపకపోవుటవల్ల ఖిన్నులైనారు. వీరి విశ్లేషావస్థను చూచిన భగవానుడు వీరిని అనుగ్రహించుటకై హృదయమున చేరి 'శ్రీహస్తిశైల శిఖరోజ్వల పారిజాతము'నై సర్వభూతములకు చర్మచక్షుర్గోచరముగా ఉండగా మీరు ఎందుకు దుఃఖపడుట. కాంచీపురమునకు వచ్చి సేవించి, పరమపదమునందలి అనుభవమును ఇక్కడే పొందవచ్చునుకదా!" అని ఆదేశించగా, తిరుక్కోవలూర్ నుండి బయలుదేరి మార్గమధ్యంలో ''పాథేయం పుండరీకాక్ష నామసంకీర్తనామృతమ్" అన్నట్లుగా 'వరదరాజ పంచాశత్' నందలి **"ద్విరద శిఖరిసీమ్నా సద్మవాన్ పద్మయోనేః"** అనే శ్లోకాన్ని అనుగ్రహించి స్వామి సన్నిధిని చేరిన వెనుక మిగిలిన స్తోత్రమును ఆశువుగా పలికినారని శ్రీదొడ్డైయాచార్యులను వారు 'వైభవ ప్రకాశికా' అనే తమ గ్రంథంలో పేర్కొన్నారు.

**తైత్తిరీయ శాఖాసామ్యం:** కృష్ణయజుర్వేదమందలి తైత్తిరీయ శాఖలోని విషయ విభాగమును 'ప్రశ్న'లుగా పేర్కొంటారు. సాధారణంగా సంహితా భాగమందలి ప్రశ్నలు యాభై 'పనస'లు (పద్యములు)గా ఉంటాయి. అంతేకాక, ఆ పనసలలోని పదాలు తప్పనిసరిగా (అనువాకం చివరి పనసతప్ప) యాభై మాత్రమే ఉంటాయి. అందుకే పనసలకు సంస్కృతంలో 'పంచాశత్' అని పేరు. తమిళులు 'పంజాది' అని, ఆంధ్రులు 'పనస'లని వ్యవహరిస్తారు. ముఖ్యంగా ఈ శాఖలో 'అశ్వమేధయాగము'నకు సంబంధించిన అనేక విషయముల ప్రస్తావన ఉన్నది. వరదరాజస్వామియొక్క ఆవిర్భావమే బ్రహ్మదేవుడు కాంచీపురమున నిర్వహించిన అశ్వమేధయాగ సందర్భంగా జరిగినది. **"పద్మయోనేః తురగ సవన వేద్యాం శ్యామలో హవ్యవాహః"** అంటూ ఈ స్తోత్ర ప్రారంభ శ్లోకంలోనే శ్రీదేశికులు దీనిని ప్రస్తావించారు. కావున తైత్తిరీయశాఖలో ప్రధాన విషయమైన 'అశ్వమేధయాగ' ఫలముగా కాంచీపురమున ఆవిర్భవించిన వరదరాజుని స్తుతించే ఈ స్తోత్రమును యాభైశ్లోకములుగా రచిస్తూ 'పంచాశత్' అనే పేరును ఉంచినట్లు భావించవచ్చు. యజుర్వేదము యజ్ఞభోక్త భగవానుడే.

అదృష్ట రత్నాలు ధరించండి! అనుకున్నది సాధించండి!
శ్రీ సాయి
పవిత్ర డైమండ్స్
4/7, బ్రాడీపేట, ఖజానా జ్యూయలర్స్ ప్రక్కన, గుంటూరు. సెల్: 9246410099, ఫోన్: 2262626.
బి/3, జైహింద్ కాంప్లెక్స్, గ్రౌండ్‌ఫ్లోర్, యాక్సిస్‌బ్యాంక్ ప్రక్కన, గవర్నర్‌పేట, విజయవాడ. సెల్: 9246310099, ఫోన్: 6665011.
సంపూర్ణ జ్యోతిష్యం చూడబడును
నాణ్యమైన జాతిరత్నాలు
జెమ్ టెస్టింగ్ ల్యాబ్
కెంపులు పచ్చల పూసలు
మంచి ముత్యములు, పగడములు
శివస్వరూపమైన రుద్రాక్షలు
స్ఫటికమాలలు
1 గ్రామ్ గోల్డ్ ఇమిటేషన్ జ్యూయలరీ



మొదటి శ్లోకంలో 'వేద్యాం శ్యామలో హవ్యవాహః' = 'అశ్వమేధయాగ వేదియందలి శ్యామలమైన అగ్ని' అని.

**తత్తత్పదై రూపహితేఽపి తురంగమేధే**
**శక్రాదయో వరద పూర్వమలబ్ధ భాగాః ।**
**అధ్యక్షితే మఖపతౌ త్వయి చక్షుషైవ**
**హైరణ్యగర్భ హవిషాం రస మన్వభూవన్ ॥**

"ఓ స్వామీ! అశ్వమేధయాగము ఇంద్రుడు మొదలుగా గల ఏ దేవతలను చెప్పే శబ్దములతో కూడినదైనప్పటికినీ, యాగమందలి హవిర్భాగములను ఇంద్రాది దేవతల పొందలేక పోయినారు. యజ్ఞపతివైన నీవు యజ్ఞవేదియందు సాక్షాత్తుగా నిలచి ఉండి బ్రహ్మదేవుడిచ్చు హవిస్సులను గ్రహించుచుండగా దేవతలందరూ నీ దివ్యమంగళ విగ్రహ సందర్శనముచే వారి వారి హవిర్భాగములను నేత్రములతోనే (నిన్ను చూస్తూనే) గ్రహించారు" అంటూ ఎనిమిదవ శ్లోకంలో యజ్ఞపతి అయిన వరదరాజస్వామిని కీర్తించారు. ఆయా యజ్ఞకర్మలన్నియూ భగవానుని ప్రీతి కొరకే అని వేదాన్త సిద్ధాంతము. యజ్ఞ సంబంధమైన మంత్రములందు ఇంద్ర-అగ్న్యాది దేవతలను సూచించు పదములన్నియూ పరమాత్మయందే పర్యవసిస్తాయి.

ఇక్కడ యజ్ఞము చేయు యజమాని బ్రహ్మదేవుడు. ఆయన అశ్వమేధ యాగము చేసేటప్పుడు ఆయనచే సృష్టింపబడిన ఇంద్రాదులు ఆయన సమర్పించు హవిస్సును నేరుగా గ్రహింపలేరు కదా! 'ఇంద్రాయ శచీపతయే' వంటి మంత్రములలో "అనన్యథా సిద్ధ జీవలింగక పదము"లు, అనగా కేవలము ఇంద్రుడు-అగ్ని మొదలగు వారినే అర్థముగా చెప్పేవి ఉన్నప్పటికీ అవికూడా భగవంతునే తెలుపుతాయి అని, బ్రహ్మ సూత్రములోని ప్రథమాధ్యాయము- రెండవ పాదము- ఇరవై తొమ్మిదవ సూత్రమునందు **"సాక్షాదప్యవిరోధం జైమినిః"** అంటూ బాదరాయణులవారు అంటారు.

ఈ సూత్ర భాష్యంలో భగవద్రామానుజులు, **"యథా వైశ్వానర శబ్దః సాధరణోఽపి పరమాత్మా సాధారణ ధర్మ విశేషతః విశ్వేషాం నరాణాం నేతృత్వాదినా గుణేన పరమాత్మాన మేవాభిదధాతీతి నిశ్చీయతే, ఏవమగ్ని శబ్దోఽప్యగ్రనయనాదినా యేనైవ గుణేన యోగాత్ జ్వలనే వర్తతే, తస్యైవ గుణస్య నిరుపాధికస్య కాష్ఠాగతస్య పరమాత్మని సంభవాదస్మిన్ ప్రకరణే పరమాత్మా సాధారణ ధర్మ విశేషితః పరమాత్మాన మేవాభిధత్తే"** = యోగవ్యుత్పత్తిచే 'వైశ్వానర' శబ్దము 'నరులందరినీ నడిపేవాడు' అనే అర్థముచే పరమాత్మను తెలిపినట్లుగా 'అగ్ని' శబ్దముకూడా 'అగ్రంనయతి' అనే వ్యుత్పత్తిచే పరమాత్మనే తెలుపును అని వివరించారు. పై వివరణను అనుసరించి బ్రహ్మయొక్క అశ్వమేధ యాగమున హవిర్భాగములను సాక్షాత్తుగా పరమాత్మయైన వరదరాజ స్వామియే యజ్ఞపతియై గ్రహించాడు అనే శ్లోకముద్వారా యజుర్వేద ప్రతిపాద్యుడైన వరదరాజస్వామికి సంబంధించిన ఈ స్తోత్రము తైత్తిరీయశాఖా సామ్యమును కలిగియున్నది.

ఇక ఈ స్తోత్రమును శ్రీదేశికులవారు, వరదరాజస్వామి వారి స్వరూప-రూప-గుణ-విభవములను మనస్సున భావించుటచే కలిగిన నిరవధికమైన ప్రీతితో ఆశువుగా పలికినారు. **'శోకః శ్లోకత్వ మాగతః'** అన్నట్లుగా భగవత్సంకల్పం వలన వాల్మీకి మహర్షి వాక్కు నుండి ఆయన హృదయమందలి శోకమే ఛందోవృత్తాది లక్షణ పరిపూర్ణమైన శ్లోకముగా ఎలా వెలువడినదో, అదే విధముగా వీరి వాక్కునుండి ఈ స్తోత్రము వెలువడినది. కావ్యలక్షణ పరిపూర్ణమై, వేదాన్త శాస్త్రమువలె తత్త్వ-హిత-పురుషార్థ ప్రతిపాదకమై, కుదృష్టి నిరసన పూర్వక స్వసిద్ధాన్త స్థాపకమై, **'పాఠ్యేగేయేచ మధురమ్'** అన్నట్లు సద్యః చిత్త రంజకమై ఈ స్తోత్రము అలరారుతున్నది. ప్రారంభ శ్లోకంలోనే స్తోత్రవస్తువును శ్రీదేశికులు వ్యంజింపచేసిన రీతిహృద్యముగా ఉన్నది.

**'కలశజలధికన్యావల్లరీ కల్పశాఖీ'**= అనే పదంవలన **'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ'** అనే పురుషసూక్త ప్రతిపాద్యుడైన శ్రియఃపతియే వరదరాజస్వామియని, ఆయనయే పరమాత్మయని సూచించారు. 'పద్మయోనేః' అనేపదం వలన బ్రహ్మను సృష్టిచేసిన స్వామియే సకలసృష్టికి కారణభూతుడని, అశ్వమేధయాగవేదియందు శ్యామలుడైన హవ్యవాహుడన్నందున వేదవేద్యుడు, సర్వకర్మ సమారాధ్యుడు ఆయనయేయని సూచించారు. **'కోఽపి కారుణ్యరాశిః'** అన్నందున దయాగుణము సకల కళ్యాణగుణములకు ఉపలక్షణమై భగవంతుడు సకల కళ్యాణ గుణనిధియని తెలిపినట్లయినది. 'ద్విరద శిఖరిసీమ్నా సద్మవాన్' అంటూ హస్తిశైల శిఖరముపైన నెలకొన్న అర్చామూర్తిని ప్రస్తావించుటచే ఆగమశాస్త్రప్రతిపాద్యమైన భగవంతుని పంచ ప్రకారములను సమర్థించినట్లయినది. **'కలయతు కుశలం నః'** అంటూ కర్మ ఫలప్రదాత వరదుడే అనుటచే వేదాన్తమునందలి **'ఫలమత ఉపపత్తేః'** అనే సూత్రముయొక్క తాత్పర్యమును సూచించి నట్లయినది. ఈ విధంగా తత్త్వము హస్తిశైల పారిజాతమైన వరదరాజస్వామియే యని, హితము- వర్ణాశ్రమాది సకలధర్మములను ఆయన యొక్క ఆరాధన రూపముగా ఆచరించుట ఆయన ముఖవికాసమునకే కావున ఆయనయే ఆయనను పొందించుటకు సాధనమని, పురుషార్థము- ఇక్కడ, పరమపదములోనూ కూడా ఆయన సేవయేయని ఇందులో వ్యంజింపచేశారు. (సశేషం)

తిరువరంగత్తముదనార్లు అనుగ్రహించిన ప్రపన్నగాయత్రి

# ఇరామానుశనూత్తన్దాది

గత సంచిక తరువాయి

శ్రీమతి డా॥టి.కె. చూడామణి-సికింద్రాబాద్

## పాశురం-71

**వార్న్దతెన్ శిన్దై ఉన్ తాళినైక్కీల్ అన్బుతాన్ మికవుమ్**
**కూరన్దతు అత్తామరైత్తాళ్గళుక్కు ఉన్తన్ కుణఙ్గళుక్కే**
**తీరన్దతెన్ శెయ్‌కై మున్‌శెయ్ వినై నీ శెయ్‌వినై అతనాల్**
**పేరన్దతు వణ్మై ఇరామానుశా! ఎమ్ పెరున్తకైయే**

**ప్రతిపదార్థము:**

| | | |
|---|---|---|
| వణ్మై | = | ఔదార్య గుణశీలురై |
| ఎమ్ | = | మాకు స్వామియై |
| పెరుతకై | = | గొప్పతనాన్ని కల్గినవారైన |
| ఇరామానుశా | = | భగవద్రామానుజా |
| ఎన్‌శిన్దై | = | నా మనస్సు |
| ఉన్ తాళ్ ఇణైకీళ్ | = | మీ పాదద్వయము క్రింద |
| శారన్దతు | = | చేరియున్నది |
| అన్బుతాన్ | = | నాభక్తి కూడా |
| అత్తామరై తాళ్గళుక్కు | = | మీ ఆ పవిత్ర శ్రీచరణపద్మాల విషయంలో |
| మికవుమ్ కూరన్దతు | = | మిక్కిలి చేరియున్నది |
| ఎన్ శెయ్‌కై | = | నాచేతలు కూడా |
| ఉన్ తన్ కుణఙ్గళుక్కే | = | మీ కళ్యాణ గుణాలకే |
| తీరన్దతు | = | వశమై ఉన్నవి |
| మున్ శెయ్‌వినై | = | నేను పూర్వమే చేసినపాపాలన్నీ |
| నీ శెయ్‌వినై | = | మీరు చేసిన-(చూపిన) |
| అతనాల్ | = | కటాక్షము చేతనే |
| పేరన్దతు | = | నశించిపోయాయి. |

***తాత్పర్యము:*** ఔదార్యమూర్తీ! స్వామీ! భగవద్రామానుజా! నా మనస్సు పవిత్రమైన మీ శ్రీపాదాలనే ఆశ్రయించి ఉంది. నా జ్ఞానపూర్వకమైన భక్తి మీ పవిత్రపాదాలనే నమ్మి ఉంది. ఇంక నేను చేసే పనులో మీ కల్యాణ గుణాలకు పరవశించి కైంకర్యం చేయడం మొదలు పెట్టాయి. మీ కటాక్షంతో నా పాపాలన్నీ పటాపంచలయ్యాయి. ఇవన్నీ మీ కరుణ వలన కలిగిన ఫలాలే అంటున్నారు అముదనార్లు.

## పాశురం-72

**కైత్తనన్ తీయ శమయ క్కలకరై, క్కాశినిక్కే**
**ఉయ్‌త్తనన్ తూయ మఱై నెఱితన్నై, ఎన్నున్ని యుళ్ళమ్ ।**
**నెయితు వన్బోడిరున్దు ఏత్తుమ్ నిఱై పుకళ్ఙోరుడనే**
**వైత్తననెన్నై, ఇరామానుశన్ మిక్కవణ్మై శెయ్‌తే ॥**

**ప్రతిపదార్థము:**

| | | |
|---|---|---|
| ఇరామానుశన్ | = | భగద్రామానుజులు |
| మిక్కవణ్మై | = | తమ ఔదార్యాన్ని |
| శెయ్‌తు | = | ఎక్కువగా చూపి |
| తీయ శమయమ్ కలకరై | = | దుష్టమతాలలో ఉంటూ కలహించే వారిని |
| కైత్తనన్ | = | నిరసించారు |
| తూయ | = | పరిశుద్ధమైన |
| మఱై నెఱితన్నై | = | వేదమార్గాన్ని |
| కాశినిక్కు ఉయ్‌త్తనన్ | = | ఈ లోకంలో ప్రతిష్ఠించారు |
| ఎన్ను ఉన్ని | = | అని అనుసంధానంచేసి |
| ఉళ్ళమ్ నెయ్‌త్తు | = | మనస్సుపండి |
| అవ్వన్బోడు ఇరున్దు | = | ఆప్రీతితో నిండి |
| ఏత్తుమ్ | = | స్తుతించే |
| నిఱై పుకళ్ఙోర్ ఉడనే | = | నిండు కీర్తికల మాహాత్ములతో |
| ఎన్నై వైత్తనన్ | = | నన్ను కూడా నిలిపారు. |

***తాత్పర్యము:*** యతిరాజులు దుష్టమతాలను నిరసించారు. ఈ విశేష విషయాన్ని తలుచుకొని పొంగిపోయే మహనీయులతో నన్ను కూడా ఒకనిగా లెక్కించారు. నన్ను కూడా ఒక వస్తువుగా చేశారు. ఇంతటి ఔదార్యాన్ని నాపై చూపించారా స్వామీ! అంటూ అముదనార్లు కరిగి కరిగి పోయారు. (సశేషం)

**శ్రీరామానుజ సహస్రాబ్ది - 2016 - 17**

**ప్రియ భగవద్బంధువులారా! మీరంతా ఎంతో ఉత్సాహంతో భగవద్రామానుజ విగ్రహ నిర్మాణానికి మీమీ ద్రవ్యాన్ని వినియోగింపదలచడం చాలా ముదావహం.**

**ఈక్రింది అకౌంట్లకు తమ ద్రవ్యాన్ని నేరుగా జమచేయవచ్చును.**

ఆంధ్రాబ్యాంక్ - శ్రీరామనగరం బ్రాంచి
**Ac. No: 209710100000007**
**IFSC Code ANDB - 0002097**

**శ్రీరామానుజ సహస్రాబ్ది కార్యనిర్వాహక సమితి**
**9553549971, 9553549972**
శ్రీరామానుజ సహస్రాబ్ది, జీవా, శ్రీరామనగర్, ముచ్చింతల్(గ్రా),
పాలమాకుల(పో), శంషాబాద్ (మం), రంగారెడ్డి జిల్లా -509325
Email -contact@sriramanujasahasrabdi.org



# అహో! భారతమ్

(గత సంచిక తరువాయి)

## అరణ్యపర్వము

శ్రీమతి డా॥టి.కె. చూడామణి-సికింద్రాబాద్

అరణ్యవాసం సాగుతున్న సమయంలో ఒక నాడు సాయంకాలం పాండవులంతా ఒకచోట సమావేశమయ్యారు. కబుర్లలో పడ్డారు. ద్రౌపది కూడా మెల్లగా వారిని చేరింది. ధర్మరాజు ప్రక్కన కూర్చుని నెమ్మదిగా మాటలో మాట కలిపి మాట్లాడడం మొదలుపెట్టింది.

రాజా! ఏమిటో ఆనందంగా రాజ్య సుఖాలు అనుభవించ వలసిని మనం ఈ అరణ్యాలలో ఇలా కష్టాలు పడుతున్నాం. దీనికి విముక్తి ఎప్పుడో పదివేలమంది బ్రాహ్మణోత్తములకి బంగారు కంచాలలో విందు భోజనాలు పెట్టి ఆ ప్రసాదం ఆరగించే నీకు అడవి దుంపలు వేళ్ళు, పళ్ళు ఇవా! ఆహారం! ఎంత కష్టకాలమొచ్చింది. పదివేల ఏనుగులు బలంగల భీమసేనుడు చూడు చూడు. ఈ ఆకుకూరలతో కడుపు నింపుకొని ఎలాగ బక్కచిక్కి పోయాడో. వేయి చేతుల కార్తవీర్యార్జునుని కంటే బలవంతుడైన అర్జునుడు, ఐదువందల బంగారు బాణాలు అద్భుతంగా వేయగల సవ్యసాచి నీ ఆజ్ఞ అనే బోనులో చిక్కిన సింహంలా ఎలా తిరుగుతున్నాడో చూడు. అసమాన వీరులు, సౌందర్యమూర్తులయిన నకుల సహదేవులు పాపం దీనంగా గడుపుతున్నారు. వీళ్లని చూస్తూ ఉన్నా నీకు కౌరవులపై కోపం రావడం లేదా.

ఇక నా గోడెవరికి చెప్పను? వరబలంతో పుట్టానని గర్వించనా? మీ ఇల్లు మెట్టానని ఆనందపడనా, మీ వంటి భర్తలు దొరికేరని ఓహో... ఏం చెప్పను? నన్ను చూచినా నీకు శత్రువులపై కోపంరాదులే ఔనుమరి! క్షమామూర్తివిగదా! క్షమ గొప్ప అనుకుంటున్నావేమో! అది అన్ని సమయాలలోను మంచిది కాదు. బురద పామైనా బుస్సుమనకపోతే రాళ్ళతో కొట్టి చంపడం నువ్వు చూడడంలేదా!

ఒకనాడు ద్రౌపది ధర్మరాజుతో ఇలా అన్నది. స్వామీ! మీ పెదతండ్రి మనల్ని అడవికి పంపించి హాయిగా ఉన్నాడేమో ఇప్పటికీ. ఆ కొడుకులు అంతంత మాటలంటూ ఉంటే నోరు కూడా విప్పలేదు కదా! ఆయనలాగ ఆ బ్రహ్మకి కూడా మనపై కోపమా? సర్వసంపదలను అనుభవించే మీరు ఇలా దర్భలమీద, మట్టిలో పడుకొనడం చూస్తూంటే నాకు కన్నీరు ఆగడంలేదు. మీ ఆజ్ఞ, పాపం గొలుసులా బంధిస్తే మీ తమ్ముళ్ళా కష్టాలపాలై ఎలా ఉన్నారో చూడండి. రత్నకాంతులతో ఎరుపెక్కే మీ పాదాలు రాళ్ళ ఎఱ్ఱరంగువలన ఎరుపెక్కుతున్నాయే అయ్యో! ఎంతటిదుర్దశఆ భీముణ్ణి చూడండి. ఆ అర్జునుని చూడండి. అసహాయస్థితిలో ఏం చెయ్యాలో తెలియక ఎలా తిరుగుతున్నారో! ఓర్పు, తేజస్సుని సమయాన్ని బట్టి ఉపయోగించాలి. ఏదో ఒక తప్పు పరవాలేదు. వరుసగా తప్పులే చేస్తున్న క్షమించాలా? వారిపై కోపం తెచ్చుకో. శత్రునాశనం చెయ్యాల్సిన సమయమది కాదా అంది.

వింటున్నాడు ధర్మరాజు "ద్రౌపదీ! ఏమంటున్నావు? కోపం తెచ్చుకోనా! ధర్మజ్ఞులు కోపం తెచ్చుకోవచ్చా. కోపాన్ని జయించాలి. చల్లార్చాలి గాని పనికట్టుకొని తెచ్చుకొని ఒళ్ళు మరిచి అధర్మకార్యాలు చేయవచ్చా? క్షమా వంతునికే విజయం సాధ్యమౌతుంది. క్షమతోనే విద్య లభిస్తుంది క్షమావంతులు తేజోవంతులు, బ్రహ్మజ్ఞానులు అవుతారు. క్షమాగుణంవల్లనే నా పెద్దలు నన్ను ప్రేమిస్తున్నారు. క్షమ లేకపోవడం వల్లనే కౌరవులు పెద్దల ఆగ్రహానికి గురిఔతున్నారు. క్షమా గుణం-కళ్యాణ గుణం, క్షమా గుణం-తేజోగుణం, క్షమాగుణం -సర్వోత్తమగుణం ఓర్పుకల్గి ఉండాలి ఓర్పే సకల శుభాలను కల్గిస్తుంది. ద్రౌపదీ! అన్నాడు. ధర్మరాజు.



## శ్రీరామానుజ సహస్రాబ్ది కైంకర్యము

విజయనగరం, కొత్తగ్రహారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆండాళ్ గోష్ఠి సభ్యులందరూ 06.07.2015న శ్రీరామానుజ సహస్రాబ్దికి రూ. 1,50,000/- (ఒకలక్షా యాభైవేలు) శ్రీమాన్ గొడవర్తి నరసింహాచార్యులు వారి తరుపున శ్రీమతి అనూరాధ, శ్రీమతి జయగార్ల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీస్వామి వారికి సమర్పించారు. శ్రీశ్రీశ్రీస్వామివారు వీరికి ముందు ముందు ఇంకా ఆధ్మాత్మిక కార్యక్రమాలు చేయమని మంగళాశాసనాలు చేశారు.

ఎప్పుడూ ప్రతాపం పనికిరాదు. అలాగే ఎప్పుడూ ఓర్పు పనికిరాదు. ఈ కథ నీకు తెలిసే ఉంటుంది. బలిచక్రవర్తి తన తాత ప్రహ్లాదుని ఒకసారి క్షమ, ప్రతాపాల్లో ఏవి గొప్ప అని అడిగాడట. దానికి ప్రహ్లాదుడు– "ఎప్పుడూ కోపమూ పనికి రాదు ఎప్పుడూ సహనమూ పనికి రాదని చెప్పాడటగా..ఆ విషయం మీకు గుర్తులేదా? ఇది చేతులు ముడుచుకొని కూర్చునే సమయంకాదు. కొంచెం కొంచెం కోపంలో ఆ కౌరవులకు బుద్ధి చెప్పండి. మీరీ పరాక్రమవంతులయిన సోదరులకు అవకాశమివ్వండి. ఆ కౌరవుల పని పట్టడానికి నీ తమ్ములు సిద్ధంగా ఉన్నారు. ఏమంటారు? " అన్నది. ద్రౌపది మాటలకు చిఋనవ్వు నవ్వాడు ధర్మరాజు. ఆ నవ్వు మరింత కోపకారణమైంది ద్రౌపదికి.

"చూడు! నువ్వు కోపంలో ఏదో చెప్తున్నావు కాని కోపంమెంత మహాపాపమో నీకు తెలియదా? కోపంలో ఉన్నవాడికి స్వ–పర భేదం తెలుస్తుందా? ఎలాంటివాడినైనా చంపడానికీ వెనుకాడడే. సామాన్యుడంటే అలా. మరి, ధర్మం ధర్మం అంటూ దాని కోసమే బ్రతికే నాకు కోపం రావచ్చా? కోపం ఒకమంట. జ్ఞానం జలం. ఆ కోపాన్ని జయించినవాడు ప్రపంచాన్నే జయించ గల్గుతాడు. కశ్యప గీత క్షమావంతుని గొప్పదనాన్ని ఎంతబాగా చెప్పిందో నీకు తెలుసుకదా! క్షమావంతునికే ఉత్తమగతి లభిస్తుంది. నా ఓర్పును చూచి మా తాత భీష్ములవారు, వ్యాసాదులు ఎంత మెచ్చుకుంటారో తెలుసా! ఓర్పు లేనివారు వాళ్ళే అనుభవిస్తారు. అంతేగాని వాళ్ళకోసం నా గొప్పగుణాలు విడిచి... కోపం తెచ్చుకోనా! బలే చెప్పావులే అన్నాడు.

కళ్ళు ఒత్తుకొంది ద్రౌపది. ఔను మీరు అజాత శత్రువులు. ధర్మం మీద మీకు విశ్వాసం అంతగొప్పది. కానీ, నాకు మోసాన్ని మోసంతోనే జయించాలి అనిపిస్తోంది. ఏంచేయగలను... ఓ బ్రహ్మదేవుడా! మంచివాళ్ళకి కష్టాలా! అధర్మం చేసేవారికి అభ్యుదయాలా? అధర్మాత్ములు నీ చుట్టాలా ఏమిటి? చివరికి నువ్వు కూడా ధర్మాన్ని విడిచిపెట్టావా తండ్రీ! అని ఘోల్లుమంది ద్రౌపది. ఒక్క క్షణం వింతగా చూచి ధర్మరాజు– "ద్రౌపదీ... ఆగు–ఆగు. నువ్వుకూడా దైవాన్ని దూషిస్తున్నావా! మహర్షులంతా నన్ను ధర్మమూర్తివని మెచ్చుకొనడం చూసీ కూడా ఇలా మాట్లాడతావా? ఎవరో దుర్మార్గంగా ప్రవర్తించారని... నేను... ధర్మప్రీతి గలిగిన నేను, మార్గాన్ని విడిచి పెట్టాలా? కొంచెం ఆలోచించి చూడు. మోక్షమార్గాన్ని చేర్చేది ధర్మమొక్కటే అని నీకూ తెలుస్తుంది. పుణ్యం ఒకటుందని నువ్వు, మీ అన్న ధృష్టద్యుమ్నుడు పుట్టిన కథ నిరూపిస్తోంది కదా. ధర్మంవల్లనే దివ్యత్వం లభిస్తుందని మరిచిపోకు. తెలిసిందా...అన్నాడు.

"ఆ... తెలిసింది. నేనేమీ ధర్మం గురించి అంత తెలియని దానను కాను. వేదాలు– ప్రమాణాలు ధర్మాలు– ఫలాలు నాకు కూడా అంతో ఇంతో తెలుసు. కర్రలో నిప్పు ఉంది నువ్వుల్లో నూనె ఉంది. కాని పురుష ప్రయత్నం చెయ్యనిదే అవి వస్తున్నాయా! కేవలం దైవం అంటూ కూర్చుంటే ఫలితం దొరుకుతుందా! మన కర్తవ్యం మనం ముందు బాధ్యతగా నీటిని పొయ్యకపోతే ఏమౌతోందో చూడడం లేదా! మీరెన్ని చెప్పండి.. అవన్నీ నాకూ తెలుసు. కాని కేవలం దైవశక్తినే నమ్ముకుని మనిషి ఉండకూడదు. తన ప్రయత్నం – తన పౌరుషం, తన కర్తవ్యం చెయ్యాల్సిందే. ఇలా చేస్తేనే ఫలితాన్ని పొందగలుగుతాడు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటారా? ఆ దీపం ఆరిపోకుండా చుట్టూ రక్షణను ఏర్పాటుచేస్తారా? కొంచెం ఆలోచించండి. మీ మౌనాన్ని అందరూ బలహీనతగా లెక్కిస్తారు. వద్దు. ఆ అవకాశం ఎవరికీ ఇవ్వకండి. శత్రువులను జయించండి. అప్పుడే మన సిరిసంపదలు, అదృష్టాలు మనని వరిస్తాయి. అలా కూచుని కూచుని దేవా–దేవా అంటూ దైవశక్తిపై ఆధారపడకండి. మీ పురుష ప్రయత్నం మీరుచేసి ఆ భగవంతుని ప్రార్థిస్తే– ఆయన తప్పక సహకరిస్తాడు. ఉత్సాహం తెచ్చుకోండి. విజయం సాధించండి." అంది ద్రౌపది. *(సశేషం)*

## ముఖచిత్ర పరిచయం

**గోదావరీ భవ్యపుష్కరాలు ఈనెల జూలైనెల 14వ తేదీ నుండి 25వ తేదీ వరకు దేశంలో ఏయే ప్రాంతాల గోదావరి ప్రవహిస్తోందో ఆ ప్రాంతాల్లో వైభవంగా జరిగింది. మన తెలుగు రాష్ట్రాల్లో రెండిటా ఈ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు యాత్రికులకు చక్కటి ఏర్పాట్లు చేశాయి. మన జీయర్‌స్వాములు ముగ్గురూ మూడు చోట్ల పుష్కరారంభంచేశారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు భద్రాచలంలోను, శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామివారు రాజమండ్రిలోను, శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామివారు మంచిర్యాలలోను పుష్కరారంభం చేశారు. మన శ్రీచిన్న జీయర్ స్వామివారు 14, 15, 16 తేదీల్లో భద్రాచలంలోను, 17, 18, 19, 20, 21 తేదీలు మంచిర్యాల్లోను 22 నుండి 26 వరకు రాజమండ్రిలోను ఉండి పుష్కరోత్సవాలను సుసంపన్నంచేస్తారు. మంచిర్యాల, రాజమండ్రి నగరాల్లో బ్రహ్మయజ్ఞాలు చేస్తున్నారు. అశేష భక్త బృందం శ్రీశ్రీశ్రీ స్వామివార్లతో మూడు ప్రదేశాల్లోను విశేషంగా పాల్గొని పుష్కర స్నానాలు మన స్వామివార్లతో కలిసి చేయగలిగారు. మూడు స్థలాల్లోని విశేషాలు ముఖచిత్రంగా సాక్షాత్కరిస్తున్నాయి. లోపలి కలర్ పేజీల్లో కూడా ఈ విశేష దృశ్యాలను పాఠకులు చూడగలరు.**




*(గత సంచిక తరువాయి)*

ఇక "వళర్న్దవాఱుమ్" పెరిగిన పద్ధతి. కంసునికి కనబడకుండా వ్రేపల్లెలో నంద నందనుడై పెరిగిన పద్ధతి ఏమి ఆశ్చర్యము. పుట్టుట అట్లు పుట్టాడు, మరి పెరుగుట ఏమైనా గొప్పగా పెరిగాడా అంటే అదీ లేదు. కంసభయం రాక్షసభయం. పుట్టిన నాటినుండి గండములే. పుట్టిన 7వనాడు పూతనా అనే రాక్షసి విషపు పాలనిచ్చినది. "పెత్తతాయ్‌పోల్ వంద పేయ్‌చ్చి పెరుములైయూడు ఉయిర్ వత్తనాంగి" కన్నతల్లివలె వచ్చిన పిశాచి పాలను, పాలతో ప్రాణములను లాగివేశాడు. అనంతరము మొదటి మాస తిరునక్షత్రము రోజున శకటాసురుడు వచ్చాడు. ఇట్లు లెక్కలేనంతమంది రాక్షసులు కృష్ణుని అంతమొందించాలని చూడగా వారినే అంతమొందించి పెరుగుట. "తాయార్ మకిళ్ల ఒన్నార్ తళర" తల్లులైన యశోదాదులు సంతోషించునట్లు పూతనాదులు నశించునట్లు పెరిగెను. కంసుని సంహరించిన పద్ధతి. ఇది ఎవరి జ్ఞానమునకైనా అందునా? అందనే అందదుకదా!

ఇక "పెరియపారదమ్ కైశెయ్‌దు" పెద్ద భారత యుద్ధమందు సేనలను వ్యూహముగా నేర్పరచి పాండవులకు సహాయముచేసిన పద్ధతి ఏమి ఆశ్చర్యము. భారతయుద్ధమునందు తానొక్కడూ పాండవులవైపు ఉండి తన సైన్యమైన గోపాలురనందరనూ దుర్యోధనునివైపు ఉంచి చేసినది భారత యుద్ధము. "కొల్లామాక్కోల్ కొలైశెయ్‌దు పారదప్పోర్ యెల్లాచ్చేనైయుం ఇరునిల తవిత్త ఎన్దాయ్" (తిరువాయ్‌మొழி2-3) భారత యుద్ధమునందు చంపుటకు సాధనముకాని గొప్ప కమ్చీతో (గుఱ్ఱములనుతోలు కఱ్ఱతో) సకల సేనలను చంపిన స్వామీ అని ఈఆళ్వార్లు స్వామి భారతయుద్ధ కౌశలమును పొగడిరి. ఆయుధము పట్టనని యుద్ధములో అర్జున సహాయ వ్యాజమున అర్జునునికి సారథిగానుండి గుఱ్ఱములను తోలు సాధనమైన కమ్చీతో యుద్ధముచేసెను. సైంధవ వధ ఘట్టమున తన చక్రాయుధముతో పగటిని రాత్రిచేసెను. అర్జునునకు దూత్య సారధ్యములు చేసెను. యుద్ధమునందు దుర్యోధనాదుల గుట్టుమట్లను తెల్పెను. గీతోపదేశము చేసెను. అర్జునునకు తన విశ్వరూపమును చూపెను. లోకమునంతటినీ మోహింపజేసి తిరిగి తన దివ్యదేశమునకు వేంచేసెను.

భారతములో చక్కగా ఇట్లు తెలిపిరి.

**కృత్వాభారావతరణం పృధివ్యాః పృధులోచనః ।**
**మోహయిత్వా జగత్సర్వమ్ గతః స్వస్థానముత్తమమ్ ॥**

ఈలోకములోనికి కృష్ణునిగా అవతరించి భూమి భారము నంతటినీ తొలగించెను. విశాలమైన ఎఱ్ఱతామరలవంటి తన నేత్రములతో జగత్తునంతటినీ మోహింపజేసి తన స్థానమైన పరమపద మునకు తిరిగి వేంచేసెను.

శ్రీకృష్ణపరమాత్మ గీతలో **"జన్మ కర్మచ మే దివ్యం"** ఓ అర్జునా నా జన్మ కర్మలు నాకు దివ్యములు అని తెలిపెను. ఎవరికి దివ్యములు అనగా **"మమాపిచ"** మీకేకాదు, నాకు కూడా దివ్యములు. నేను నా ఈ కృష్ణావతారములో చేసిన వెన్న దొంగతనము, దూత్య సారధ్యములు "వన్స్‌మోర్" అన్నా తిరిగిచేయలేను అన్నాడు. అట్టి కృష్ణావతార అతిమానుషచేష్టలనే ఆళ్వార్లు "పిఱంద వాఱుం వళర్న్ద వాఱుం" అని తెలిపి, ఆ కృష్ణపరమాత్మకే మోదమును కలిగించెను. ఇట్లు నమ్మాళ్వార్లు అనేక దశకములలో కృష్ణానుభవమును అత్యద్భుతముగా చేసిరి. సమయాభావముచే ఇంతటితో మనం ఈ వ్యాసమును ముగిద్దాము.

మిగిలిన దశకములలో నుండు కృష్ణానుభవమును కూడా మనము క్రమముగా తెలుసుకొందాము. *(సశేషం)*

వ్యక్తిత్వ వికాసానికి ... నాణ్యమైన సాంకేతిక విద్యా బోధనకు
కళ్ళం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

శ్రీ కళ్ళం హరనాథరెడ్డి
ఛైర్మన్ : కళ్ళంగ్రూప్


బిటెక్ కోర్సులు
కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సియస్ఇ)
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఇఇఇ)
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్ ఇంజనీరింగ్ (ఇసిఇ)
సివిల్ ఇంజనీరింగ్ (సిఇ)
మెకానికల్ ఇంజనీరింగ్ (ఎమ్ఇ)
M.Tech :- CSE
మేనేజ్‌మెంట్ సీట్స్ కొరకు సంప్రదించండి : సెల్ : 98856 04528, 94402 61773, 94910 73337.
EAMCET Code KHIT
NH- 5.10వ కి.మీ వద్ద, కళ్ళం స్పిన్నింగ్ మిల్స్ వెనుక, చిలకలూరిపేట రోడ్, చౌడవరం, గుంటూరు- 19. ఫోన్: 0863 2119726.
సిటీ ఆఫీస్: ఫస్ట్‌లైన్, గుజ్జనగుండ్ల సర్కిల్, గుంటూరు -6. ఫోన్: 0863 2272345.

# ఉపనిషత్ కథలు

## యాజ్ఞవల్క్యుడు

శ్రీమాన్ వోలేటి రామకృష్ణమాచార్యస్వామి - హైదరాబాద్

*(గత సంచిక తరువాయి)*

**అశ్వల-యాజ్ఞవల్క్య సంవాదం**

**అశ్వ :** యాజ్ఞవల్క్యా యజ్ఞ సాధనాలన్నీ మృత్యువుచే నియమించబడి ఉన్నప్పుడు యజ్ఞం చేసే యజమాని మాత్రం మృత్యువు నుండి ఎలా తప్పించుకుని ముక్తిని పొందుతాడు? (సాధనాలన్నీ ఈ ప్రకృతిలో భాగాలే కాబట్టి వాటికి నాశముంటుంది. నాశము గల వస్తువు నాశము లేని ముక్తిని ఎలా సంపాదిస్తుంది అన్నది ఇక్కడ ప్రశ్న.)

**యాజ్ఞ:** అగ్ని రూపమైన వాక్కుచే. యజ్ఞాలలో యజమాని యొక్క వాక్కే హోత. అదే అగ్ని. దానితోటే ఆతడు మృత్యువును జయించగలుగుతాడు. అదే అతనికి మోక్షాన్ని సాధించి పెడుతుంది. (అంటే ఆ వాగ్రూపమైన అగ్నిలో పాప పుణ్యములు దగ్ధమై అతనికి మోక్షము దగ్గరౌతుంది. హోత, అధ్వర్యువు, ఉద్గాత, బ్రహ్మ అనే నలుగురూ ఒక్కొక్కరు ఒక్కొక్క వేదాలను చదివే బ్రాహ్మణులు.)

**అశ్వ :** యజ్ఞములలో కార్యకలాపమంతా అహోరాత్రములలో జరుగుతూ ఉండగా, యజ్ఞ యజమాని మాత్రం అహోరాత్రాలను ఎలా తప్పించుకుంటాడు?

**యాజ్ఞ:** ఆదిత్యరూపమైన చక్షుస్సుచే. యజ్ఞములో చక్షుస్సు సూర్యుడే. అతడే అధ్వర్యువు. అతని ద్వారానే అహోరాత్రాలను దాటి పోగలడు. ముక్తిని సాధించగలడు.

**అశ్వ :** యజ్ఞములోని సర్వకార్యక్రమాలు శుక్ల పక్షంలోనో కృష్ణ పక్షంలోనో జరుగుతూ ఉంటే, యజమానుడు మాత్రం ఈ శుక్ల కృష్ణ పక్షాల బంధనం నుండి ఎలా ముక్తిని పొంద గలడు? (శుక్ల, కృష్ణ పక్షాలను పూర్వపర పక్షాలని కూడా అంటారు.)

**యాజ్ఞ:** ముఖ్యప్రాణమైన వాయువుచే. యజ్ఞములో వాయువే ఉద్గాత. కనుక ప్రాణమే వాయు రూపాన్ని పొంది యజమానిని శుక్ల కృష్ణ పక్షాల నుండి బయటపడవేసి ముక్తిని పొందింపగలదు.

**అశ్వ :** ఆకాశమునకు ఆధారములేనట్లే కనబడుతోంది. మరి యజమాని దేనినాధారం చేసుకుని ముక్తిని పొందుతారు?

**యాజ్ఞ:** మనసనే చంద్రుని ద్వారా. చంద్రుడే యజ్ఞములో బ్రహ్మము అని చెప్పబడే ఋత్విక్కు. యజ్ఞంలో బ్రహ్మము యజమానుని మనస్సును చంద్రునిగా మారుస్తాడు. కాబట్టి యజమాని ముక్తిని పొందడానికి తనకు మరో ఆధారం అక్కర లేదు. చంద్రుడే ఇక్కడ ముక్తిహేతువు.

**అశ్వ :** ఎన్ని విధాలయిన ఋక్కులతో యజ్ఞములో హోత తన విధిని నిర్వర్తిస్తాడు?

**యాజ్ఞ:** మూడు విధములయిన ఋక్కుల చేత

**అశ్వ :** అవి ఏవి ?

**యాజ్ఞ:** వాటిని పురోను వాక్యములు, యాజ్యములు, శస్యములు అంటారు.

**అశ్వ :** వాటి ఫలం ఏంటి?

**యాజ్ఞ:** హోమము చెయ్యడానికి ముందు చదివేవి పురోను వాక్యములు, హోమము చేసేటప్పుడు పలికే ఋక్కులు యాజ్యములు. హోమం అయ్యింతరువాత దేవతల స్తోత్రంగా పఠించేవి శస్యములు. వీటితో ఆతడు ప్రాణుల మనస్సును జయిస్తాడు.(అంటే అతని సఫలతను ప్రజలు మెచ్చుకుంటారని భావము)

**అశ్వ :** హోమంలో ఇచ్చే ఆహుతులెన్ని ?

**యాజ్ఞ:** మూడు.

**అశ్వ :** అవి ఎవి?

**యాజ్ఞ:** అవి మూడు. పైకి వచ్చేవి, శబ్దం చేసేవి, లోపల జారి పోయేవి. సమిధల వలన, ఆజ్యం వలన జ్వాల పైకి వస్తుంది. సాకల్యము మొదలైన ద్రవ్యాలు పట పట మని శబ్దం చేస్తాయి. పాలు మొదలైనవి లోపలికి జారిపోతాయి.

**అశ్వ :** బ్రహ్మకు కుడి వైపున నుండి ఎంతమంది దేవతలు యజ్ఞాన్ని రక్షిస్తున్నారు?

**యాజ్ఞ:** ఒక దేవతే, మనస్సు. మనస్సును యజ్ఞంలో చక్కగా నిలిపేటట్లు బ్రహ్మ చూసుకుంటాడు. తద్వారా అనంతమైన లోకములను జయింప వచ్చును.

**అశ్వ :** పురోనువాక్యాది హోత కార్యక్రమాలలో అధ్యాత్మములు ఏవి? వాటి ఫలితములు ఏవి?

**యాజ్ఞ:** అధ్యాత్మములో పురోనువాక్యమే ప్రాణము. యాజ్యమే అపానము, శస్యమే వ్యానము. పురోనువాక్యము వలన పృథివి, యాజ్యము వలన అంతరిక్షము, శస్యము వలన స్వర్గము లభిస్తాయి. అశ్వలుడికి ఇంక ఏమడగాలో తెలియలేదు. ఇక ప్రశ్నించడంమాని కూర్చుండిపోయాడు.

**ఆర్తభాగ - యాజ్ఞవల్క్య సంవాదము**

అశ్వలుడు తన సంవాదం నుండి వైదొలగిన తరువాత ఆర్తభాగుడు అనే మహర్షి యాజ్ఞవల్క్యుని పై తన ప్రశ్నలను సంధించడం మొదలు పెట్టాడు.

**ఆర్త :** యాజ్ఞవల్క్యా! ఇంద్రియములనే గ్రహాలెన్ని? అవి గ్రహించే విషయాలెన్ని?

**యాజ్ఞ:** ఇంద్రియగ్రహాలు ఎనిమిది. అవేంటంటే ప్రాణమనేది

నాసిక గ్రహం. అది వాసన చూస్తోంది (గంధం). అంటే గంధం నాసికకు విషయము. వాక్ అనేది వాగింద్రియ గ్రహం. అది పలికే నామములు వాక్కుకు విషయం. జిహ్వా అనేది రసనేంద్రియ గ్రహం. దీనికి రసం అనేది విషయము. చక్షుస్సు ఒక గ్రహం. రూపం అనేది చక్షుస్సుకు విషయం. శ్రోత్రం అనేది ఒక గ్రహం. శబ్దం శ్రోత్రానికి విషయం. మనస్సు ఒక గ్రహం. దీని కామము విషయం. హస్తములు కూడా ఒక గ్రహం. కర్మలు దీనికి విషయాలు. త్వక్కు అనేది ఒక గ్రహం. స్పర్శ దీనికి విషయం.

**ఆర్త :** ఈ జగత్తంతా మృత్యువుకు ఆహారమే కదా! మరి మృత్యు దేవత దేనికి ఆహారమౌతుంది ?

**యాజ్ఞ:** అగ్ని సర్వానికి మృత్యువు. అంటే అదే మృత్యుదేవత. అది జలానికి ఆహారం. ఇది తెలుసుకున్న వాడు మృత్యువును జయించి ముక్తుడౌతున్నాడు.

**ఆర్త :** పురుషుడు మరణించినప్పుడు గ్రహరూపములైన ఇంద్రియాలు, విషయాలు,ప్రాణాలు కూడా అతని వెంటపోతాయా? పోవా?

**యాజ్ఞ:** పోవు. ప్రాణము, ఇంద్రియములు జీవునితో పాటు ఉత్క్రమించవు. ఇంద్రియ భాగములు శరీరంలోనే ఉండి వాటి వాటి కారణములలో లీనమౌతాయి. ఆతని శవము వాయువుతో నిండి ఉబ్బుతుంది. అది అదే స్థితిలో చచ్చిపడి ఉంటుంది.

**ఆర్త :** మానవుడు మరణించినపుడు ఆతనిని వదిలి పెట్టనిది ఏది?

**యాజ్ఞ:** అతని నామము అతనిని వదిలిపెట్టదు. నామములు అనంతములు. విశ్వేదేవులు అనంతులు. ఈ విషయము తెలిసినవాడు అనంత లోకాలను జయిస్తాడు.

**ఆర్త :** ఓ యాజ్ఞవల్క్యా! మరణించేవాని వాక్కు అగ్నిలో లయమవుతుండగా, గ్రహణశక్తి వాయువులో, చక్షుస్సు సూర్యునిలో, మనస్సు చంద్రునిలో, శ్రోత్రము దిశలలో, శరీరము పృథివిలో, హృదయాకాశము ఆకాశంలో, రోమములు ఓషధులలో, కేశములు వనస్పతులలో, రక్త శోణితములు జలములలో కలిసిపోతున్నాయి. మరి ఈ జీవుడు ఎక్కడికి పోతున్నాడు?

**యాజ్ఞ:** (ఆర్తభాగుణ్ణి) నాయనా ఇటు రా ! ఈ విషయాన్ని మనం ఏకాంతంగా చర్చించుకుందాం. (అని ఆర్తభాగుణ్ణి పక్కకు పిలిచాడు) కొంత దూరం నడిచి వెళ్లి వివరంగా మాట్లాడు కున్నారు.వెనకకు తిరిగి వచ్చిన ఆర్తభాగుడు ఇక పై ప్రశ్నించడాన్ని విరమించుకున్నాడు.

**భుజ్య - యాజ్ఞవల్క్య సంవాదము**

**భుజ్య :** ఓ యాజ్ఞవల్క్యా! కొంతకాలం కిందట మేము కొందరు మిత్రులతో కలిసి అధ్యయనం చేయడానికి పతంజలి స్వామివారి వద్దకు వెళ్ళాము. అదే రోజుల్లో ఆతని కుమార్తెకు ఒక గంధర్వునితో వివాహం జరిగింది. ఆమె భర్త అక్కడే ఉన్నాడు. ఆమె భర్తను పేరడిగాం. ఆతడు తాను అంగీరా గోత్రజుడైన సుధన్వుడను అని చెప్పాడు. మళ్ళీ మేమతణ్ణి మరియొక ప్రశ్న వేసాము. "సుధన్వా! మీరీ ప్రపంచమంతా తిరిగిన వారే కదా! అశ్వమేధయాగం చేసిన వాళ్ళు ఎక్కడున్నారో ఎక్కడికి వెళ్లారో మీకు తెలుసా?" అని అడిగాం. అతడు మాకు సమాధానం చెప్పాడు. ఓ యాజ్ఞవల్క్యా! నీకు అదే ప్రశ్నవేస్తున్నాను. అశ్వమేధ యాగం చేసినవారు ఎక్కడికి పోతారు?

**యాజ్ఞ:** ఓ భుజ్యా! పారిక్షితులు ఎక్కడికి పోతారో అక్కడికే అశ్వమేధ యజ్ఞం చేసిన వాళ్లు కూడా వెళ్తారు అని ఆ గంధర్వుడు మీకు సమాధానం చెప్పాడు.

**భుజ్య :** మరి పారిక్షితులు ఎక్కడికి వెళ్తారు?

**యాజ్ఞ :** పారిక్షితులనేది ఒక రాజవంశజుల నామము. వారు ఎల్లవేళలా అశ్వమేధయాగాన్ని చేసేవారు. వారెక్కడి వెళ్తారో చెప్తాను విను. సూర్యుడు ఎక్కడ ఉదయిస్తాడో, ఎక్కడ అస్తమిస్తాడో అక్కడికి చేరతారన్న మాట. ఈ మార్గాన్ని పూర్తి చేయడానికి ఆ సూర్యరథానికే 32 రోజులు పడుతుంది. ఈ పృథివి మనకి ఇటువైపు ఎంత కనబడుతుందో కిందవైపున కూడా అంతా ఉంది. కాబట్టి పృథివిమార్గం దేవమార్గం కంటే 2 రెట్లు ఉంటుంది. పృథివి కంటే సముద్రము 2 రెట్లు ఉంటుంది. పైన ఉన్న ఆకాశము పృథివిని, సముద్రాన్ని చాలా దగ్గరకు వచ్చి స్పృశిస్తుంది. అక్కడ ఈ రెండింటికి మధ్యన ఈగ రెక్క అంత అంతరం ఉంటుంది. ఆ మధ్యలో వాయువు ప్రవేశిస్తుంది. అశ్వమేధానికి దేవత అగ్నిహోత్రుడు. ఆతడు రెక్కలు కలిగిన పక్షిరూపాన్ని దాల్చి పారిక్షితులతో ఇలా చెప్పాడు. "మీరు ఈ పృథివి నుండి వాయుదేవత ద్వారా ఆకాశంలోకి ఎగిరిపొండి. వాయువు మిమ్మల్ని అశ్వమేధయాగం చేసేవారు చేరే బ్రహ్మలోకానికి చేరుస్తుంది. ఇలా వారిని గమ్యస్థానం చేర్చడానికి వాయువు సహాయపడతాడని ఆ గంధర్వుడు వాయువుని ప్రశంసించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వారు మృత్యువును జయించి ముక్తులవుతారు.

ఈ మాటలు విన్న భుజ్యుడు ప్రశ్నలు సంధించడం మాని మౌనంగా ఉండిపోయాడు. *(సశేషం)*

# శ్రీవేంకటాచల 'చిత్రే'తిహాసమాల-24





మూల సంస్కృత రచనం
శ్రీ అనంతాళ్వాన్

చిత్రానువర్తనం
సత్య శ్రీనివాస్ - సిద్ధాంతం



స్వామివారి మూలవిరాట్టుకు గడ్డంమీద పచ్చకర్పూరం అద్ది ఉంటుంది. దీనికి కారణం, అనంతార్యులు, సరోవారాన్ని నిర్మిస్తున్నప్పుడు, శ్రీనివాసుడు ఒక బాలునిగా మట్టి ఎత్తిపోస్తుంటే, ఇలా తానొక్కడే చేయదలచిన కైంకర్యంలో మరొకడు ఎవరో సహకరించడం ఇష్టంలేని దశలో, ఆ బాలుని పలుమార్లు వారించారు. అయినా వినకుండా అదేపని చేస్తుంటే చికాకుపడి అనంతార్యులు చేతిలోని గునపాన్ని విసిరారు. అది బాలరూపంలో ఉన్న స్వామి గడ్డానికి తగిలి, రక్తం వచ్చింది. బాలుడు పరుగు పరుగున ఆలయంలోకి ప్రవేశించి కనిపించలేదు. మరుసటిరోజు మూలమూర్తి గడ్డంపై గాయం ఏర్పడడం గమనించి, ఇది స్వామిలీల అని తెలుసుకొని జరిగిన అపచారానికి ఖేదపడి అనంతార్యులు, చిబుకంపై కర్పూరాన్ని అలదినారు. గాయానికి కారణమైన గునపం ప్రథమ గోపుర ద్వారంలో ఇప్పటికీ వ్రేలాడదీయబడి కనిపిస్తూ ఉంటుంది. అప్పటి నుంచి స్వామి చిబుకంపై కర్పూరం అలదటం అనే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ విషయం వేంకటాచల ఇతిహాసమాలలో ఉట్టంగింపబడింది.



బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు స్వామి తిరువీధి చేస్తూ అకస్మాత్తుగా వెనుదిరిగి అప్రదక్షిణంగా అనంతార్యులు నిర్మించిన రామానుజవనం వైపుకు వాహనంపై పరుగెత్తడం అనే ఒక ప్రక్రియ ఇప్పటికీ ఆచరింపబడుతూ ఉంటుంది. దీనికి కారణం, అనంతార్యులు నిర్మించిన ఉద్యానవనంలో ప్రతిరోజూ శ్రీనివాసుడు పద్మావతి విహారం చేస్తూ, చెట్ల పూవులు, చిగుళ్ల త్రెంపి పడవేస్తూ ఉంటే, అనంతార్యులు చూచారు. ఇలా చేస్తున్నవారెవరో గమనించి మాటువేసి పట్టుకోవాలని అనంతార్యులు ఒక రోజు రాత్రి ఉద్యానవనంలో ఉండి, పద్మావతీ శ్రీవివాసులను రాజకుమార వేషంలో విహరిస్తూ ఉండగా పట్టుకొని చెట్టుకు బంధించారు. శ్రీనివాసుడు ఎలాగో తప్పించుకొని పారిపోయాడు. పద్మావతి, చేతికి చిక్కి బంధింపబడి రాత్రంతా అక్కడే ఉండిపోయింది. తెల్లవారి అర్చకులు చూస్తే స్వామితో అమ్మవారు లేరు. దీనిని గమనించిన అర్చకులు తోటలో అనంతార్యులచే ఒక స్త్రీ రూపంలో ఆమె బంధింపడటం గమనించి అపచారానికి చింతించి ప్రార్థించారు. అనంతార్యులు జరిగినదానికి ఖేదపడి ఆమెను స్వామి సన్నిధికి చేర్చారు. ఈ విధంగా తన పత్నిని తనకు చేర్చడం వలన అనంతార్యులు శ్రీనివాసునికి మామగారైనారు. అనంతార్యులు, పద్మావతీ శ్రీనివాసులకు నూతన వస్త్రాలు ఆభరణాలతో సత్కారాలు జరిపారు. ఆనాటి ఆ సన్నివేశాన్ని గుర్తుచేసుకుంటూ బ్రహ్మోత్సవాలలో ఒకరోజున తిరువీధిచేస్తూ, స్వామి, అప్రదక్షిణంగా వెనుదిరిగి పారిపోతున్నట్లు ఉద్యానవనంవైపు వాహనంపై వేగంగా తీసుకొని వెళ్ళబడడం, అక్కడ అనంతార్యుల సత్కారం జరపడం అనే ప్రక్రియ నేటికీ వేడుకగా జరుపబడుతున్నది అని ఇతిహాసమాల చెబుతున్నది.



# "కోరినవారికెల్లను....."

**పోతన భాగవతం (6-159)**

వివరణ, చిత్రం: శ్రీమాన్ డా॥ చెలికాని మురళీకృష్ణారావు, బొబ్బిలి సెల్: 9440009535

కోరినవారలకెల్లను, జేరువకైవల్య పదము సిరివరుని మదిం
గోరినవారలకెల్లను, దూరము మోక్షాప్తి యెన్నిత్రోవలనైనను.


అజామిళుడు అవసారకాలంలో కుమారుని పేరు పెట్టి పిలిచాడు. కాని శ్రీహరిని పిలువలేదు. అయినా పుత్రుని పేరుతో విష్ణునామాన్ని మరణకాలమునందు ఉచ్చరించినందు వలన, హరిసాన్నిధ్యాన్ని చేరుకోగలిగాడు.


మోక్షం త్రికరణ శుద్ధిగా కోరుకున్నవారికి అతి సమీపంలో ఉంటుంది. శ్రీమహావిష్ణువును, అలాకోరినవారికి ఎన్ని విధాల ప్రయత్నించినా మోక్షమార్గం ఎంతో దూరమైపోతుంది అని సేవ ఒక్కటే మోక్షాన్ని సాధించడానికి అతి సులభమైన మార్గం. అంత సులువైన మార్గం మరొకటి లేదు అని శ్రీశుకుడు స్పష్టం చేస్తున్నాడు.

చిత్రకథ-45

# రామానుజ చిత్రకథ




కూరత్తాళ్వాన్! మీరింత విపులంగ వేదాలలోంచి, ధర్మశాస్త్రంలోంచి, పురాణేతిహాసాల్లోంచి, శ్రీపాంచరాత్రాగమాల్లోంచి,వైఖానస విధానాన్ని స్పష్టపరచే గ్రంధాల్లోంచి పుంఖానుపుంఖంగ ప్రమాణాలతో పాటు చేసిన ఈవివరణ మాకెంతో సంతృప్తినిస్తోంది.
అచార్య శ్రీరామానుజులే అనుగ్రహించి ఉంటే ఇంకా స్పష్టంగ ఉండిఉండేది. ఈ దాసుణ్ణి పరీక్షించడానికి ఈ అవకాశాన్ని ప్రసాదించారు.
కూరేశస్వామీ! మీ వినయశీలతే మీ ఉత్తమ యోగ్యతకి గుర్తు. మీరు మావారు కావడం మాకెంతో తృప్తికరం.
ధన్యో2స్మి. అనుగృహీతో2స్మి, అచార్యా!
స్వామీ! వేదైక వేద్యుడైన పరాత్పరుడు ఎవరు అనే విషయంలో.....
సంశయించ తగినదేమీ లేదు.
ఈజగత్తుకి కారణమైనవాడు
“యస్సర్వజ్ఞ: సర్వవిత్” “పరా అస్యశక్తి:”
“ఏకోహవై నారాయణ ఆసీత్”...


స్వామీ! పామరులం. మేమూ తెలుసుకోవచ్చా ఆ మంత్రాలేమిటో?
పరబ్రహ్మ ఈజగత్తుకి సృష్టి, స్థితి,లయాలు చేసే కారణతత్త్వం.
అతని శక్తి ఇలాంటిదని చెప్పనలవి కానిది.
అతనికి తెలియనివంటూ ఈవిశ్వంలో ఏదీలేదు. అన్ని ఉత్తమ గుణాలకూ ఆయన గనిలాంటివాడు.
బ్రహ్మరుద్రాది దేవతలూ మానవ, తిర్యక్ స్థావరాలుగ ఉండే జీవరాశులలో ఎవ్వరూ అతనికి సాటిరారు.
కనుకనే అయన పురుషోత్తముడు. అతణ్ణే 'నారాయణుడ'ని వేదము స్పష్టపరుస్తోంది.
ఈజీవులూ, ప్రకృతీ అతని సొత్తే కద!


మీరు చాల స్పష్టముగ వివరించారు స్వామీ! వైదిక వాఙ్మయమంతా తెలిపే పరతత్త్వం శ్రీమహావిష్ణువేనన్న వాస్తవాన్ని సూటిగ తెలిపారు గద!
ఆచార్యా! సంధ్యాకాలమవుతోంది! సాహసాన్ని మన్నించ ప్రార్థన.
అస్తు! అందరి సంశయాలూ నివారించేదీ, సదాచార సంవర్ధకమూ, సర్వశాస్త్ర తాత్పర్యమూ అయిన విషయాన్ని తెలుసుకున్నాం. అందరికీ విశ్రాన్తి!
నాకూ అనుమతినిస్తే సెలవు తీసుకుంటా యతిరాజా!
తథాస్తు!
ఇంకా ఉంది...

## సుందరసేతు పరిసమాపనము







జీవా ప్రాంగణంలో 68 రోజులపాటు సుందరకాండ పారాయణ ఆచరించిన అనంతరం ఏక కాలంలో సంపూర్ణ సుందరకాండ పారాయణము

## గోదావరీ పుష్కరాలు

### భద్రాచలం

నదీపూజను ఆచరించి, స్నానఘాట్‌కి ప్రవేశించిన శ్రీస్వామివారితో అశేష భక్తులు

### రాజమహేంద్రి

శ్రీఅహోబిల రామానుజ జీయర్‌స్వామివారు నదీపూజను గావించి, స్నాన సంకల్పం చేయిస్తున్నారు







భద్రాచలంలో శ్రీస్వామివారితో పాటు స్నానాన్ని ఆచరిస్తున్న అశేష భక్తజనం

# గోదావరీ పుష్కరాలు - రాజమహేంద్రి



పుష్కర సందర్భంగా రాజమహేంద్రి వేంచేసిన శ్రీఅహోబిల జీయర్‌స్వామివారు ఎ.పి. ముఖ్యమంత్రి శ్రీమాన్ నారా చంద్రబాబు నాయుడుగారితో ముచ్చటిస్తున్నారు.



నదీపూజను గావిస్తున్న శ్రీఅహోబిల రామానుజ జీయర్‌స్వామివారు



భక్తులతో సంకల్పాన్ని ఆచరింపచేస్తున్న శ్రీమాన్ శ్రీనివాసాచార్యులుగారు

# గోదావరీ పుష్కరాలు - మంచిర్యాల

పుష్కర విశేషాలను భక్తులకు తెలియచేస్తున్న శ్రీస్వామివారు



నదీపూజ, సంకల్పం, స్నానాలు







శ్రీస్వామివారితో పాటుగా పుష్కరస్నానాన్ని ఆచరించిన తెలంగాణ నీటి పారుదల శాఖామాత్యులు శ్రీమాన్ హరీష్‌రావు, తెలంగాణ ఆర్థికశాఖామాత్యులు శ్రీమాన్ ఈటెల రాజేందర్‌గారు,



పుష్కరఘాట్‌లో శ్రీస్వామివారితో పాటుగా వేద ఆగమ విద్వాంసులు



మంచిర్యాలలో పుష్కర విశేషాలను భక్తిలో శ్రవణం చేస్తున్న భక్తులు

With Best Compliments from



KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED



# KAKATIYA CEMENT

**Quality Always - Ahead**

## 53 Grade Cement & White Crystal Sugar

**Sri P. VENKATESWARLU**
Chairman & Managing Director

## KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

*Regd. Office :* 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
✆:27637717, 27633627, Fax No : 040 - 27630172, E-mail : kcsil@sol.net.in
E-mail: info@kakatiyacements.com

*Cement Factory :*
Srinivasanagar, Jaggaiahpet,
Krishna Dist - 521 175
✆ 08654 - 200014
Fax No: 08654-296331

*Sugar Factory :*
Peruvancha Village, Kallur Mandal,
Khammam Dist - 507 209,
✆: 08761 - 287207
Fax No: 08761 - 287206

# అత్రేదం తత్త్వమ్

శ్రీమాన్ డా. తె.కం.వెం. అయ్యంగార్ స్వామి (వరంగల్లు)

తత్త్వము అంటే ప్రమాణములచే బోధింపబడే వస్తువు. ఇది త్రికాలా బాధితమైనది. అంటే భూత భవిష్యత్ వర్తమాన కాలాలలో ఉండేది. ఇకప్పుడు ఉండి మరొకప్పుడు పోయేదికాదు. లేనిది పుట్టిడమూకాదు. అటువంటి తత్త్వాలు మూడు అని శాస్త్రము తెలుపుతుంది. చిత్, అచిత్, ఈశ్వరుడు అనేవి ఈ మూడు తత్త్వాలు. 'చిత్' తత్త్వం జీవుల సముదాయాన్ని నిరూపించేది. 'అచిత్' తత్త్వం అంటే ప్రకృతి తత్త్వము. ఈశ్వరుడు, అంటే ప్రకృతి తత్త్వము. ఈశ్వరుడు, అంటే భగవానుడు, చిదచిత్తులను నియమించేవాడు. ఇది భగవద్రామానుజులు మనకు అనుగ్రహించిన, పూర్వాచార్యులు తెలిపిన విషయము.

ఇక్కడ ఒక ప్రశ్న రావడం సహజం! మరి ఉపనిషత్తులు "ఏకమే తత్త్వము" అని తెలుపుతున్నాయి కదా! మీరు మూడు తత్త్వాలు అంటున్నారేమిటీ? అని. నిజమే! మూడు తత్త్వాలు ఉన్నాయి. కాని ఇవి ఒక దానితో ఒకటి విడదీయరాని స్థితిని, సంబంధాన్ని కలిగి ఉంటాయి. దీనినే "అపృథక్ సిద్ధ సంబంధము" కలిగి ఉండడం అంటారు శాస్త్రకారులు. ఈ మూడు తత్త్వములకు ఐక్యము ఉంటుంది. ఇది విశిష్ట ఐక్యము. ఈ మూడు తత్త్వములు అపృథక్ స్థితిలో ఉండగా ఆ తత్త్వము ఏకము. అద్వితీయము. అతి నిర్విశేషము కాదు, అంటే విశేషములు ఏవీ లేని తత్త్వము కాదు. సర్వదా (సర్వకాలములలో), సర్వథా (అన్నివిధాలుగా), ఈ ఏకతత్త్వము చేతన అచేతన పదార్థాలతో విడదీయరాని విధంగా కలిసిఉండేదని, శ్రుతులు తెలుపుతున్నాయి. శ్రుతి ప్రమాణంవల్ల విశిష్టమగు అద్వైతము, విశిష్టమగు ఏకము అయినదే తత్త్వము. ఈ తత్త్వము సకల సృష్టి, స్థితి, ప్రళయాదులకు కారణమైనది.

మూడు తత్త్వములతో విడదీయరాని సంబంధంగల ఏకతత్త్వము లోని ఈ మూడు తత్త్వాల స్వరూప స్వభావాలు వేరువేరుగా ఉంటాయి. భిన్న భిన్నాలు అన్నమాట! ఈ విషయాన్ని మనకు ప్రమాణమైన ఆ శ్రుతులే బోధిస్తున్నాయి.

శ్రుతులలో కొన్ని శ్రుతులు మూడు తత్త్వాలకూ కేవలం భేదమును తెలుపుతున్నాయి. కొన్ని శ్రుతులు అభేదమును– ఏకత్వాన్ని తెలుపు తున్నాయి. మరివేటిని ప్రమాణంగా తీసుకోవాలి? వేటిని అప్రమాణం అనాలి? అనేది సహజంగా కలిగే ప్రశ్న. త్రిమతాచార్యులలో అద్వైతమత ప్రవర్తకాచార్యులైన శంకరాచార్యుల వారు ఏకత్వాన్ని తెలిపే అద్వైతశ్రుతులకూ, అభేదశ్రుతులకూ ప్రామాణ్యాన్ని అంగీకరించి, ఇతర శ్రుతులకు తదనుగుణంగా అర్థాన్ని తెలిపారు. ద్వైతమతాన్ని ప్రతిపాదించిన మధ్వాచార్యులవారు, భేదశ్రుతులకే ప్రామాణ్యాన్ని అంగీకరించి, ఇతర శ్రుతులకు తమ అభిప్రాయానికి అనుగుణంగా అర్థాన్ని చెప్పారు.

ఇట్లా ఏవో కొన్ని శ్రుతులను మాత్రమే ప్రమాణముగా అంగీకరించి, మిగిలిన శ్రుతులు అప్రమాణము, అముఖ్యము అని చెప్పడం సరికాదు. అన్నింటికీ ప్రామాణ్యమును అంగీకరించాలి. మొదటి మనం చెప్పుకున్న తత్త్వాలలో భేదం ఉంది అని నిర్ద్వంద్వంగా చెప్పే శ్రుతులు (భేద శ్రుతులు) దీనికి భిన్నంగా ఏకత్వాన్ని బోధించే శ్రుతులు (అభేద శ్రుతులు, అద్వైత శ్రుతులు) – వీటితో పాటు ఈ రెండింటికీ సమన్వయాన్ని చూపించే మరికొన్ని శ్రుతులు కూడా ఉన్నాయి. ఈ సమన్వయాన్ని చూపించే శ్రుతులను ఘటక శ్రుతులు అంటారు. ఈ శ్రుతులు కూడా ప్రమాణములే కదా! ఈ ఘటక శ్రుతులను ఆధారంగా చేసుకొని భేదశ్రుతులకూ, అభేదశ్రుతులకూ సమన్వయాన్ని చూపించాలి. అన్ని శ్రుతి వాక్యాలనూ ప్రమాణమని అంగీకరించాలి. సరసమైన, స్వరసమైన అర్థాన్ని చెప్పుకోవాలి. ఇదీ భగవద్రామానుజులు అనుసరించిన పద్ధతి. పూర్వాచార్య రుచి పరిగృహీతమైన సమన్వయ మార్గం, ప్రాచీనులైన మహర్షులచేత ప్రతిపాదింపబడి పూర్వాచార్య సురక్షితమైన తత్త్వాన్ని, విశిష్టాద్వైత తత్త్వాన్ని, రామానుజులు మనకు శ్రీభాష్యాది గ్రంథములలో ఆవిష్కరించారు. అనుగ్రహించారు.

శ్రీభాష్యంలో "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అనే మొదటి సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ, ప్రధానంగా అద్వైతమతస్థుల 'అద్వైత' వాదాన్ని ప్రతిపక్షులే ఆశ్చర్యపడే విధంగా అనువదించారు. తర్వాత దానికి సమాధానం, తమ విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రతి పాదించారు. అద్వైత వాదంపై ఏడు అనుపపత్తులను చూపించారు. సప్త విధానుపపత్తులు అంటారు వీటిని. జీవునకూ, బ్రహ్మమునకూ అభేదాన్ని తెలిపే తత్త్వమసి మొదలైన వాక్యాలకు అర్థం ఎలా చెప్పాలో చూపించారు. ప్రతిపక్షులు చెప్పే అర్థాలు ఎలా సరికావో, తాము చెప్పే అర్థం ఎలా నిర్దుష్టమో నిరూపించారు.

పరమాత్మ చిత్, అచిత్‌లు శరీరంగా కలవాడు– చిదచిత్ శరీరకుడు అనే విషయాన్ని వేరు వేరు స్థలాలలో ఉన్న శ్రుతులను అందంగా ఒక చోట సంకలనంచేసి మనవంటి సామాన్యులకు కూడా అర్థం కావడం కోసం, సుగ్రాహ్యంగా ఉండడం కోసం "అత్రేదం తత్త్వమ్" అంటూ స్వసిద్ధాంత సారాన్ని ప్రసాదించారు భగవద్రా మానుజులు. "నివర్తకాను ప్రపత్తి"ని వివరిస్తున్న సందర్భంలోనిది ఈ "అత్రేదం తత్త్వమ్" అంటూ చేస్తున్న స్వసిద్ధాంత సార వివరణము.

(సశేషం)

# జీవన సాఫల్యము

శ్రీమాన్ సముద్రాల శఠగోపాచార్య స్వామి, వరంగల్

"ప్రాణినాం నరజన్మ దుర్లభం", "దుర్లభో మానుషో దేహః", "నరత్వం దుర్లభం లోకే" అనే సూక్తులు మానవజన్మ లభించడం అంత సులభం కాదని తెలుపుతున్నాయి. అనేకజన్మలలో చేసిన విశేష పుణ్యం వల్లనే కొందరు మానవులుగా జన్మించగలుగు తున్నారని, "మానుష్యం పుణ్యసంచయాత్" అనే విష్ణుపురాణ వచనము పేర్కొను చున్నది. వైదికధర్మాచరణతో, ఆధ్యాత్మికశోభతో, సాంస్కృతిక సంప్రదాయ ప్రభలతో విరాజిల్లుతున్న భారతదేశము ఇతర దేశాలకన్నా శ్రేష్ఠమైనదని, ఈ భారతదేశం స్వర్గమోక్షాలకు నిచ్చెనవంటిదని, కర్మభూమియైన ఈ దేశంలో పుట్టిన మానవుల అదృష్టాన్ని దేవతలు కూడా ఘనంగా కీర్తిస్తారని పరాశరమహర్షి విష్ణుపురాణంలో వివరించారు.

తాము జన్మించిన వంశప్రతిష్ఠకొరకై ఎవరు కృషిచేస్తారో, వారియొక్క పుట్టుకే ధన్యమైనది అవుతుంది "స జాతో యేన జాతేన యాతి వంశస్సమున్నతిమ్" అని భర్తృహరి మహాకవి ప్రబోధించి నట్లుగా కొందరు వంశప్రతిష్ఠాకరమైన సత్కార్యాలను నిర్వహించి సత్కీర్తిని పొంది చరిత్రలో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకుంటారు.

ఎవరి జీవనాన్ని ఆధారంగా చేసుకొని ఎక్కువమంది జీవించగలుగుతారో, అట్టివారి పుట్టుకే సార్థకమైనట్టిది "యస్మిన్ జీవతి జీవంతి బహవః సతు జీవతి" అని పేర్కొనబడిన రీతిలో కొందరు ధర్మసత్రాలను నిర్మించడం, కర్మాగారాలను స్థాపించడం, లోకహితకార్యాలను ఎన్నింటినో నిర్వహించడం ద్వారా పుణ్యాన్ని ఆర్జించి స్వర్గఫలాలను పొందుతారు.

మరికొందరు భగవత్తత్త్వాన్ని గుర్తించిన మహనీయుల దర్శనంతో పరమాత్మ దర్శనంతో, ఆరాధనతో తమ జీవితాలను ధన్యమొందించుకుంటుంటారు. ఇందుకు ఉదాహరణగా నిలిచే దశరథ మహారాజుయొక్క, భక్తశబరియొక్క, అక్రూరులవారి యొక్క వృత్తాంతాలను స్మరిద్దాం. వర్షం లేక, నీరు దొరకక జనులు ఇబ్బంది పడుతున్న ప్రాంతంలో భారీవర్షం కురిసినట్లు, పోగొట్టుకున్న ధనం లభించినట్లు, అమృతం లభించినట్లు నా అదృష్టవశమున తలవని తలంపుగా మీరు వచ్చినారని తపశ్శక్తి సంపన్నుడైన విశ్వామిత్రమహర్షితో దశరథ మహారాజు పలికెను. ఓ విశ్వామిత్రమహర్షీ! మీ రాకవలన నా జన్మ సఫలమైనది. నా జీవితము యోగ్యతను పొందినట్లుగా భావించు చున్నాను "అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్" అని దశరథ మహారాజు వినమ్రంగా విశ్వామిత్రునికి తెలిపెను. తపోధనుడైన విశ్వామిత్రమహర్షి దర్శనము పుణ్యక్షేత్ర వాసంతో సమానమైన పరమపవిత్ర సంఘటనగా దశరథ మహారాజు భావించెను. భగవత్తత్త్వాన్నెరిగిన మహనీయుల దర్శనము మన జన్మసాఫల్యమునకు కారణ మౌతుంది అనే సత్యాన్ని ఈ దశరథుని వృత్తాంతము తెలియపరుస్తున్నది.

తన ఆశ్రమానికి వచ్చిన శ్రీరామలక్ష్మణులను దర్శించుటవల్ల తన జన్మ ధన్యమైనదని భక్తశబరి భావించినది. ఎంతోకాలమునుండి తాను ఆచరించుచున్న తపము ఫలించినదని, ఆచార్యాజ్ఞగా శ్రీరామచంద్రస్వామిని ఆరాధించుటవల్ల గురుపూజా కార్యక్రమాన్ని చక్కగా కొనసాగించినట్లైనదని తలంచినది. శ్రీరామచంద్ర ప్రభువుయొక్క కటాక్షం వల్ల తాను పవిత్రమైనట్లు, ఇంతకాలం భగవత్ప్రాప్తికి విరోధంగా నిలిచిన పాపరాశులు తొలిగినట్లు తలంచినది. శ్రీరామారాధన వల్ల తనకు పరమపదప్రాప్తి తథ్యము

**"అద్య ప్రాప్తా తపస్సిద్ధిః తవ సందర్శనాన్మయా ।**
**అద్య మే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః ॥"**
**"అద్య మే సఫలం జన్మ స్వర్గశ్చైవ భవిష్యతి ।**
**త్వయి దేవవరే రామ! పూజితే పురుషర్షభ ॥"**
**"చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునందన!**
**గమిష్యామ్యక్షయాం లోకాన్ త్వత్ప్రసాదాదరిందమ ॥"**

అని నిర్ధారించుకున్నది. సదాచార్యులను ఆశ్రయిస్తే, భగవంతుడే స్వయంగా వచ్చి ఆరాధనను అందుకొని తన కటాక్షాన్ని ప్రసరింపజేసి, తన దివ్యధామానికి చేరుకునే యోగ్యతను కలిగిస్తాడని ఈ మానవజన్మకు సాఫల్యాన్ని సమకూరుస్తాడని శబరీ వృత్తాంతము పేర్కొనుచున్నది.

కంసుని దూతగా మధురనుండి బయలుదేరి రేపల్లెకు చేరుకొని, శ్రీకృష్ణ పరమాత్మను దర్శించినట్టి అక్రూరుడు శ్రీకృష్ణదర్శనం వల్ల తన జన్మకు సాఫల్యం కలిగిందని భావించాడు. భగవద్దర్శనానికి ఉపకరించిన ఈ ప్రాతఃకాలము తన జీవితానికి సార్థకతను కలిగించిన శుభోదయమని, ఇలాంటి ప్రభాతాన్ని అంటి పెట్టుకొనియున్న గడచిన రాత్రి కూడా నా శ్రేయస్సుకు సహకరించినది "అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మే నిశా" అని తలంచినాడు.

పరమాత్మను కీర్తించే నాలుకయే నాలుకని, సురరక్షకుడైన శ్రీమన్నారాయణుని దర్శించే కన్నులే కన్నులని భక్తపోతన ఆంధ్ర భాగవతంలో పేర్కొన్నట్లుగా పరమాత్మ సేవలో, భగవచ్చింతనలో మనం ప్రవేశిస్తేనే మన జన్మ ధన్యమవుతుంది, భగవంతని కృపాదృష్టి మనపై ప్రసరిస్తుంది, మన జన్మకు సాఫల్యం సమకూరుతుంది అనే విషయం మనకు అక్రూరుని చరితమువల్ల తెలియుచున్నది.

భగవత్స్వరూపాన్ని, పరమాత్మకు మనకు ఉండే నవవిధ సంబంధాన్ని, అర్థపంచక జ్ఞానాన్ని, ఆకారత్రయ స్వరూపాన్ని నిష్కర్షగా తెలియజేయునట్టి అష్టాక్షరి, ద్వయ, చరమ శ్లోకాలను సదాచార్యుల ముఖపద్మమునుండి ఉపదేశంగా పొందుదాము. యథాశక్తి వాటి అర్థజ్ఞానాన్ని ఆచార్యులవద్ద సేవిద్దాం. సర్వ రక్షకుడైన శ్రీమన్నారాయణునిపై నిశ్చలమైన భక్తివిశ్వాసాలను కలిగియుందాం. మనకు లభించిన ఈ మానవ **"జన్మసాఫల్యానికై"** త్రికరణశుద్ధిగా ప్రయత్నిద్దాం.

# ఆళ్వారుల దివ్యవైభవము

## (బుర్రకథ)

శ్రీమాన్ డా॥ మరింగంటి లక్ష్మణాచార్య స్వామి, హైదరాబాద్

*(గత సంచిక తరువాయి)*

వరదరాజస్వామి కృపతో ఋణం సమస్యతీరింది. అయినా తదీయారాధన (వైష్ణవ భోజన సంతర్పణ) కొనసాగడం కష్టం అయింది. మరోదారి లేక ఆళ్వార్లు దొంగగా, దారిదోపిడి దొంగగా కూడా మారారు. ఓసారి శ్రీమన్నారాయణుడు మారువేషంలో దేవతలందరితో సహా వచ్చారు. అమ్మ లక్ష్మి కూడా వచ్చింది. పెళ్ళి ఊరేగింపుగా వచ్చిన వారు ఆళ్వార్లనుపరీక్షించారు. ఆ పరీక్షలో మన ఆళ్వార్లు నెగ్గారు. స్వయంగా నారాయణుడే అతని కోరికపై నారాయణ మంత్రం ఉపదేశించారు. అప్పుడు జ్ఞానోదయం అయింది వారికి. చివరికి ఆయన శ్రీరంగం వచ్చి, రంగనాథుని ఆజ్ఞతో ప్రాకారాలు మొదలుగునవి నిర్మించారు. అక్కణ్ణించి ఎన్నో క్షేత్రాలు వెళ్ళారు. గొప్ప కవిత్వం చెప్పారు.కొన్ని దివ్యప్రబంధాల్ని మనకు ఇచ్చారు.

**శేషన్న :** చివరికి మహానుభావులు తొండరప్పొడి ఆళ్వార్ గురించికూడా క్లుప్తంగా చెప్పన్నా

**గరుడన్న :** అలాగే...

వైజయింతిమాల అంశమూ...సై
భక్తుల చరణాల రేణువూ...సై
రంగనాథుని భక్తుడూ...సై
అతడే విప్ర, నారాయణుడు (2 సార్లు) ॥వినరా॥
మండంగుడిలో జన్మించాడూ
తొండరడిప్పొడిఆళ్వారూ...
తొండరడిప్పొడిఆళ్వారూ...
రంగనాథునే రక్షకుండని మనసా, వాచా, నమ్మారూ...
యుక్తవయసులో ఉన్నా స్వామి...
తందానా తానతందనా
పెళ్ళంటేనే పడదు పాపం....
తందానా తానతందనా
శ్రీరంగనాథునే నమ్మాడూ....
నిరతం భక్తితో కొలిచాడూ....
నిరతం భక్తితో కొలిచాడూ....
రంగని సేవకు తోటనూ...సై
పెంచెను ఎంతో ప్రేమగా...సై
ఒకనాడు వచ్చిరి, యువతులూ...సై
దేవదాసీ లా ఇద్దరూ...సై
రాజుగారి నాట్య కత్తెలు...సై
తోటెంతో వారికి నచ్చెను...సై (2 సార్లు) ॥వినరా॥
తోటలోపలా తొండరడిప్పొడి వారికి అగుపించె....
భళాభళి
దేవదేవికి స్వామి పరాకు కోసం తెప్పించె.....
భళాభళి
ఆళ్వారామెను పలకరించక మౌనం వహించె...
భళాభళి
మదముతో ఆ దేవదేవి మరి ఎంతో ఆగ్రహించె...
॥ఎంతో ఆగ్రహించె॥
చెల్లె అలివేణి విసరిన సవాలు తాను స్వీకరించె
ఆళ్వార్లను వశ పరచుకొందునని శపథమ్ములు చేసె...శపథమ్ములు చేసె.
దేవదేవి ఇక ఆతోటనే మరి....ఇల్లుగ భావించె....
తన ఇల్లుగ భావించె

**శేషన్న :** అప్పుడేమైందన్నా!

**సేనయ్య :** ఏముందీ! ఇక మామూలు కథే. అమ్మాయి తన ఆటపాటల్తో స్వామికి వలవేసి ఉంటుంది హుఁ ఆళ్వార్లముందా, ఆమె ఆటలు? ఆమె పప్పులు ఉడికి ఉండవు.

**గరుడన్న :** కాదు...ఉడికాయ్. అప్పుడే కురిసిన వర్షం, ఆ వర్షంలో తడిసిన ఆవేశ్య దేవదేవి సౌందర్యం...మన

నాణ్యమైన ప్లాట్లు మరియు ఫ్లాట్లు కొనుగోలుకు నమ్మకమైన అగ్రగామి సంస్థ
అభినందన హౌసింగ్ (ప్రై). లిమిటెడ్
సెంట్రల్ ఆఫీస్ : 4వ లైను, పండరీపురం, లక్ష్మీపురం మొయిన్ రోడ్, గుంటూరు. ఫోన్ : 2354002.
మా బ్రాంచీలు: విజయవాడ1, విజయవాడ 2, విజయవాడ 3, గుంటూరు1, గుంటూరు 2, హైదరాబాద్, విశాఖపట్నం.
0866-6628668 : 0866-6642428 : 0866-6633668 : 0863-6641177 : 0863-6454588 : 040-66637799 : 0891-2538686.

ఆళ్వారు మనసు మార్చేసాయి ఆశ్చర్యం. పరమాశ్చర్యం అంతటి భక్తుడు ఆమెకు దాసుడై, చివరికి రంగనిసేవ కూడా వదిలేసారు.

**శేషన్న** : ఇందులో ఆశ్చర్యం ఏముంది? ఇదేదో ఆ శ్రీమన్నారాయణుడి నాటకం లాగా ఉంది దీనికేదో పరమార్థం ఉండి ఉంటుంది.

**సేనయ్య** : బాగా చెప్పినావన్న ఆ తర్వాత ఏమైంది గరుడన్నా!

**గరుడన్న** : భక్తాంఘ్రిరేణువు భక్తిని వీడె
తానతందనా తానతందనా
దేవదేవిపై పాటలుపాడె
తానతందనా తానతందనా
ఆమె వెంటపడి ఇంటికిజేరి
తానతందనా తానతందనా
వేశ్యమాత కది నచ్చకపోయే
తానతందనా తానతందనా
విప్రవరులను వెడలగొట్టించె (2 సార్లు)
తానతందనా తానతందనా

ఆళ్వార్ల దుస్థితి జగన్మాత మనసు కరిగించింది ఆమె నారాయణుణ్ణి వేడుకుంది అంతే! స్వామి ఒక నాటకం ఆడాడు.

**సేనయ్య** : ఏమా నాటకం?

**గరుడన్న** : వేషం మార్చి విష్ణువూ వచ్చెను...సై
వేశ్య ఇంటికి వచ్చెను...సై
బంగారు పాత్రా తెచ్చెనూ...సై
ఆళ్వార్ల శిష్యుణ్ణి నేను అంటూ మాటలు చెప్పెను
వేశ్య మాతకూ ఇచ్చెను...సై
తల్లికి ఆ పాత్ర నచ్చెనూ...సై
స్వామిని లోనికి పిల్చెనూ...సై
సేవలెన్నో తాను చేసెను (2 సార్లు)

**సేనయ్య** : భలె భలే? తరువాతేమైంది?

గరుడన్న : గుడి తలుపులు తెరిచిన అర్చకులకు బంగారు గిన్నె కనబడక పోయేసరికి గుండె గుభిల్లుమంది. ఈ వార్త రాజుకు చేరింది వెదికించారు. దేవదేవి ఇంట్లో ఆ పాత్ర దొరికింది. వేశ్యమాత ఆ పాత్ర తొందరడిప్పాడి ఆళ్వారిచ్చారని చెప్పింది. అంతే! రాజభటులు ఆళ్వారును బంధించి, తరువాత జైల్లో పెట్టడం జరిగింది. చివరికి స్వయంగా రంగనాథుడే రాజుగారికి కలలో కనబడి రాజుకు నిజం చెప్తారు. దాంతో ఆళ్వార్లు విడుదల అవుతారు.

రంగడి సేవలో ఆళ్వార్లు తన శేషజీవితం గొప్పభక్తి వైరాగ్యాలతో గడిపి, "తిరుప్పళ్ళిఎళ్ళుచ్చి" "తిరుమాలై అనే రెండు గొప్ప గ్రంథాలు వ్రాసి చివరికి పరమపదం చేరుకున్నారు.

**సేనయ్య** : హమ్మయ్య! ఇప్పుడెంతో తృప్తిగా ఉంది పన్నిద్దరాళ్వార్ల వైభవం విన్నాక మనసు కుదుటపడింది. గరుడన్నా! నీవల్ల నా జన్మధన్యం అయింది.

**గరుడన్న** : ధన్యజీవులు పావన చరితులు పన్నిద్దరాళ్వార్లు....
భళాభళి
ముక్తిమార్గమ్ము తెలిపిన ఘనులు పన్నిద్దరాళ్వార్లు...
భళాభళి
త్రికరణ శుద్ధిగ జీవించారు... భళాభళి
దివ్య ప్రబంధాలెన్నో వ్రాసిరి... భళాభళి
శరణాగతిని వివరించిరి మన పన్నిద్దరాళ్వార్లు...
భళాభళి
ఆళ్వార్ దివ్య తిరువడిగళే శరణమ్ (3 సార్లు)

**సర్వేజనాః సజ్జనాః భవంతు,**
**సర్వే 'సజ్జనా'ః సుఖినోభవంతు**




# అరచేతిలో ఆరోగ్యం



యం. విజయలక్ష్మి- హైదరాబాద్ (శ్రీరామస్థూప ప్రాజెక్ట్.)
సెల్ నెం. 9963484439

"షుగర్‌వ్యాధి"కి బీజం ఎక్కడ నాటుకుంది? వ్యాధి ఎలా త్వర త్వరగా వ్యాప్తి చెందుతుంది? వ్యాప్తిని అరికట్టలేమా? వ్యాధిని పూర్తిగా తొలగించలేమా? తొలగించగలమనే ఆక్యుప్రెషర్ వైద్యం చెపుతుంది. దశాబ్దాలుగా ఈ వైద్యంలో కృషి చేసి పేరుపొందిన ఆక్యుప్రెషర్ డాక్టర్లు "ఆ పాయింట్స్" గురించి వివరించారు. ఆ పాయింట్స్ పై ట్రీట్‌మెంటు తెలుసుకోవాలంటే ముందుగా తెలుసుకోవాల్సిన విషయము...

**పంచభూత సిద్ధాంతము:**

మనచుట్టూ ప్రకృతి లోని 1. భూమి 2. నీరు 3. అగ్ని 4. వాయువు 5. ఆకాశము వీటియొక్క సృజనాత్మకం (Generative Cycle), విధ్వంసం (Destuctive Cycle) మూలంగా ఈ ప్రపంచము కొనసాగుతున్నది.

మనలోని ప్రకృతి (శరీరమునందు) కూడా ఈ పంచభూత సిద్ధాంతమే "ఆరోగ్యం–అనారోగ్యం"కి కారణమవుతున్నది.

**మన శరీరంలో పంచభూతాలు (అవయవాలు)**

1. ఉదరము మరియు స్ప్లీన్ = భూమి
2. కిడ్నీలు మరియు మూత్రాశయము = నీరు
3. గుండె మరియు చిన్నప్రేగు = అగ్ని
4. లివర్ మరియు గాల్ బ్లాడర్ = వాయువు (Wood)
5. ఊపిరితిత్తులు మరియు పెద్దప్రేగు = ఆకాశము (Metal)

ఆక్యుప్రెషర్ వైద్యవిధానములో "వాయువు" స్థానములో Wood అనగా వృక్షముగా గుర్తిస్తారు.

"ఆకాశము" స్థానముని Metal అనగా ధాతువుగా గుర్తిస్తారు.

1. నీరు అగ్నిని అదుపు చేస్తుంది 2. అగ్ని ధాతువుని అదుపు చేస్తుంది 3. ఆకాశము (ధాతువు) వాయువుని (వృక్షాన్ని) అదుపు చేస్తుంది. 4. వాయువు భూమిని అదుపు చేస్తుంది. 5. భూమి నీటిని అదుపు చేస్తుంది. ఇది (విధ్వంస చర్య).

ఇక Generative Cycle (సృజనాత్మక చర్య)

1. అగ్ని నుండి భూమి 2. భూమి నుండి లోహము 3. లోహము నుండి నీరు 4. నీరు నుండి వాయువు

ఈ విధముగానే మన శరీరములో అవయవాలు కూడా ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి ఉంటాయి. ప్రకృతిలోని పంచభూతాల గుణాలే వీటికి ఉన్నాయి. నూటికి నూరుపాళ్ళు ఆ విధముగానే పని చేస్తాయి. ఈ ఐదు గుణాల హెచ్చుతగ్గులే రోగాలకి కారణం. ప్రపంచమంతా "గాలి" ఆవరించి ఉన్నట్లు మన శరీరమంతా "జీవశక్తి" ఆవరించి ఉంది. ఆక్యుప్రెషర్ వైద్యవిధానము ఈ జీవశక్తి పైనే పనిచేస్తుంది. జీవశక్తి తనంతతానుగా శరీరాన్ని నడపలేదు. "ఆరోగ్యం–అనారోగ్యం" వైపు నడిపిస్తుంది.

ప్రకృతిలో "వాతావరణం" హెచ్చరికలు మాదిరిగానే మన శరీరం తెలిపే హెచ్చరికలు తెలివిగా మనము గ్రహించుకో గలిగితే రోగాలనుండి మనం రక్షించుకో గలుగుతాము. ప్రకృతిలోని పంచభూతాల పనితీరు తెన్నులు ఉన్న విధముగనే శరీర అవయవాలు కూడా ఉన్నాయి.

1. భూమియొక్క గుణాన్ని పోలిన ఉదరము, స్ప్లీన్ శరీరంలో నీటి నిల్వలని నియంత్రించుతుంది. కిడ్నీలు, మూత్రాశయము పనితీరుపై ప్రభావము చూపుతుంది.
2. నీటి తత్వాన్ని కలిగిన కిడ్నీలు, మూత్రాశయము, హృదయము మరియు చిన్నప్రేగు పనితీరుని ప్రభావితం చేస్తాయి.
3. అగ్నితత్త్వము కలిగిన హృదయం, చిన్నప్రేగు ఇవి లంగ్స్‌ని పెద్దప్రేగుని నియంత్రించుతాయి.
4. గాలి లేక వృక్ష (Wood) తత్వాన్ని పొందిన లివర్ మరియు గాల్ బ్లాడర్ ఉదరమును స్ప్లీన్‌ని ప్రభావితం చేస్తాయి.
5. ఆకాశ తత్త్వమును కల్గిఉన్న ఊపిరితిత్తులు పెద్ద ప్రేగు ఇవి (Metal - ధాతువుగుణము) లివర్‌ని గాల్‌బ్లాడర్‌ని నియంత్రించుతాయి.

**ఒక ఉదాహరణ:** మనిషి ఎప్పుడైతే హాయిగా ఆనందంగా ఉంటాడో ఊపిరితిత్తులు చక్కగా పనిచేస్తాయి. పెద్దప్రేగునుండి వ్యర్థపదార్థాలు సక్రమంగా విసర్జింపబడుతాయి.

అలా కాకుండ ఎప్పుడైతే మనిషి దుఃఖములో దిగులు చెందుతుంటాడో అప్పుడు ఊపిరితిత్తులు కుచించుకుపోతాయి. అధిక వేడికి లోనవుతాయి. ఈ ప్రభావం లివర్‌పైన గాల్‌బ్లాడర్‌పైన పడుతుంది.

"లివర్" శరీరంలో మొత్తము జీవవ్యవస్థకి మూలము అని తెలుసుకున్నాము కదా! మరి ఆనందంగా ఉండటము అనేది "లివర్" అవయవానికి పునాదిలా పనిచేస్తుంది. అప్పుడు శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా నిలదొక్కుకుంటాయి. మరి ఎల్లప్పుడు ఆనందంగా ఉండటము సాధ్యము కాదుకదా! ప్రతిమనిషి "ఒత్తిడి"కి లోనవుతుంటాడు అనేక కారణములచేత.

ఈ ఒత్తిడి అనేది ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఉంటుంది. అయితే దీన్ని జయించడం ఎలా...?

మార్గము ఉన్నది. అది ఏమిటంటే...

దేహశక్తి స్థాయిని (జీవశక్తి) పెంచుకోవటం. జీవశక్తిని పెంచుకోవడం అనేదే ఈ **"ఆక్యుప్రెషర్". "యోగాసనాలు"** కూడా శరీరంలో "జీవశక్తి"ని వృద్ధిపరుస్తాయి. అందుకే ఆక్యుప్రెషర్–యోగాసనాలు దినచర్యలో భాగం చేసుకోవాలి.

(21.05.2015 యోగా దినోత్సవం ప్రపంచదేశాలు జరుపు కున్నాయి కదా! మన ప్రియతమ ప్రధాని నరేంద్రమోడి కృషివలన)

పాఠకులారా! ఇచ్చట ఒక విషయం బాగా ఆలోచించమని విజ్ఞప్తి చేస్తున్నాను. **"ఆక్యుప్రెషర్"** వైద్యము ఏదో నాటువైద్యమో లేక ఏదో నొప్పితో పాయింట్లు నొక్కడమో అని మాత్రమే అనుకోకండి. ఇది చక్కటి విజ్ఞాన శాస్త్రము.

మానసిక–శారీరక రుగ్మతలను రాకుండా మరియు వస్తే తగ్గించుకునే శాస్త్రము. వైద్యము చేస్తున్నప్పుడు నొప్పి కల్గించే ప్రతిపాయింట్లు వెనుక గొప్ప సూత్రాలు ఉన్నాయి.

**ఇక్కడ ఒక కేసు**

పేరు పాండురంగ, వయస్సు 62 సంవత్సరాలు. (కేరాఫ్ అడ్రస్ జీవా ఆశ్రమము) ఇతనికి రెండు సంవత్సరాల క్రితం "ముఖ పక్షవాతము" వచ్చినది. Bell's Palsy అంటారు. "చలి" ప్రభావం చేతగాని, వాతము వలనగాని "చెవి" మధ్య భాగంలో నొప్పితో కూడిన వాపు వలనగాని వస్తుంది. చాలామందికి ఇలా వస్తుంటుంది. తొందరలోనే తగ్గుతుంటుంది, వెంటనే సరి అయిన మందులు, వైద్యము చేయిస్తే. ఇతనికి వచ్చినరోజు నోట్లో ఆహారం మ్రింగటానికి కూడా రాలేదు. మాట సరిగ్గా రాలేదు. ఒక కన్ను లోతుకు వెళ్ళిపోయింది రెప్పవాలుటలేదు. మూతి వంకర అయినది. సరే, యథావిధిగా ఆక్యుప్రెషర్ పాయింట్లు (ముఖంపైన కొన్ని, తొడపైన కొన్ని) చేసాము. కేవలం రెండు రోజుల్లోనే ఆహారం మ్రింగి నమిలే స్టేజి వచ్చింది.

ఇక నెలరోజుల్లో ముఖంలో అన్నీ యథాస్థితికి వచ్చాయి. ఇప్పుడు ఏమాత్రం ఆ లక్షణాలు లేవు. 'పక్షవాతం' కేసుల్లో ఈ వైద్యములో Motor Gate Theory ఆధారంగా చాలా కేసులు చేసాము! మందులు–ఫిజియోథెరపి కూడా పనిచేయని సందర్భముల్లో ఈ Motor Gate Theory పనితో పక్షవాతం నుండి బయటపడవచ్చు. "షుగర్‌వ్యాధి"కి బీజం ఎక్కడ ప్రారంభమో వచ్చే సంచికలో!

**జూలై నెల మెదడుకు మేత సమాధానములు**

**1. మనస్సును క్రమబద్దం చేసే ప్రక్రియ 2. త్రిజటుడు 3. మనస్సును 4. ఉ.వే.శ్రీమాన్ తిరుమల న.చ.నరసింహాచార్యస్వామివారు 5. గంగాదేవి 6. ఎఱ్ఱని పద్మము 7. జగత్కారణత్వము, మోక్షప్రదత్వము 8. చూచినట్లయితే 9. అర్జునుడు 10. 43 రోజులు 11. నరసింహావతారాన్ని 12. యాజ్ఞవల్క్యుడు 13. శ్రీనివాసుని ఎదుట 14. విష్ణువు 15. 4 అంగుళాలు 16. వేణుపత్రాకారం 17. 14.07.2015 18. శ్రీవత్సచిహ్నా అంశతో**

సవరణ: జూన్ నెల మెదడుకు మేత 13వ సమాధానం "నమ్మాళ్వార్లు" అని గుర్తింపగలరు. 12వ సమాధానమే పొరపాటున 13వ సమాధానంగా కూడా ముద్రింపబడింది. ముద్రణ దోషాన్ని పాఠకులు గుర్తింపగోరుతున్నాం.

## శ్రీమన్మథనామ సంవత్సర 'రాశి ఫలాలు'

### నిజ ఆషాఢమాసం (జూలై 17 నుండి ఆగష్టు 14 వరకు)

**శ్రీమాన్ టి.ఎన్.సి.ఎస్.కె. ఆచార్య సిద్ధాన్తి, జనగామ**

**మేషరాశి** : మనోవిచారము, కుటుంబ కలహము, ప్రయత్నములందు ఆటంకములు, అధిక భయము శ్రమ అధికము కావున ప్రతినిత్యము 'విష్ణుసహస్రనామ స్తోత్రము' పఠించిన మేలుకలుగును.

**వృషభరాశి** : ధనలాభము, ఆరోగ్యము, నూతనవస్తుప్రాప్తి, శరీర ఆరోగ్యతము, హృదయానందము కలుగును.

**మిథునరాశి** : దుష్టసహవాసము, వ్యాపారములందు ధననష్టము, శరీర బలహీనతయు, అకారణ కలహములుండును ప్రతీరోజు 'సుందరకాండ' పారాయణమొనరించిన శుభములు కలుగును.

**కర్కాటకరాశి**: కుటుంబ జీవితములో సౌఖ్యము, వస్త్రలాభము, సంఘమున కీర్తి గౌరవము ధర్మకార్యాచరణము, ధనలాభములుండును.

**సింహరాశి** : ఎల్లప్పుడు విచారము, సౌఖ్యము లేకపోవుట, విరోధ మధికము, ధనవ్యయము, చెడు ఫలితములుండును. ప్రతిరోజు శ్రీరామ పట్టాభిషేక సర్గ పఠించిన శుభములు కలుగును.

**కన్యారాశి** : జయము, భూగృహలాభములు, బంధుమిత్రుల కలయిక నూతన వస్తుప్రాప్తి, శుభఫలితములుండును.

**తులారాశి** : సదావిచారము, వృథాశ్రమ, బంధుమిత్ర విరోధము, శరీర అనారోగ్యతలు అపకీర్తి మహాభయము, చెడు సహవాసము కలుగును. ప్రతిరోజు 'శ్రీసుదర్శనాష్టకము' పఠించిన మేలుకలుగును

**వృశ్చికరాశి** : స్థిరత్వం లేకపోవుట నిరుత్సాహము, కోపమధికము చంచలబుద్ధియు శ్రమయధికము. ఈ మాసము 'సౌలభ్య చూడామణి స్తోత్రము' పఠించిన మేలుకలుగును.

**ధనుస్సురాశి** : ఆరోగ్యము, ఉత్సాహము, నూతన వస్తువుల కొనుగోలు, ధనలాభము, శుభఫలితములుండును.

**మకరరాశి** : హృదయమందు సుఖము ధనలాభము సంపద చేయు పనులయందు అభివృద్ధియుండును.

**కుంభరాశి** : ధనలాభము, నూతనోత్సాహము, నూతన వస్తువుల కొనుగోలు, శరీరముబలము, సంతోషము కలుగును.

**మీనరాశి** : ప్రయత్న కార్యములందు భయము, ధనలాభము, ఆరోగ్యము, నూతన వస్తువుల కొనుగోలు, మంచి ఆలోచనలు, శుభఫలితములుండును.

| ఆగస్టు 2015 | శ్రీమన్మథనామ సంవత్సరము<br>**నిజ ఆషాఢమాసము-శ్రావణమాసము**<br>సౌరమానము : ఆణి - కర్కాటకమాసము | తేది సూ.ఉ. సూ.అ.<br>19 5-43 6-42<br>26 5-42 6-45<br>2 5-41 6-47<br>9 5-41 6-49<br>16 5-42 6-52 |
|---|---|---|

శ్రీ నమ్మాళ్వార్ శకం 5116   శ్రీ రామానుజ శకం 998   జీయర్ శకం-106

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN ఆది**<br>రా.కా.సా.4-30మొ6-0<br>దు.సా.4-24మొ5-12 | **30**<br>బ॥పాడ్యమి రా.10-28<br>శతభిషం ప.3-9<br>వ.రా. 9-7 మొ12-30 | **2**<br>విదియ ప. 12-41<br>ధనిష్ఠ ఉ. 8-32<br>వ.ప.3-18 మొ 4-48 | **9**<br>దశమి రా.7-23<br>రోహిణి రా. 9-38<br>వ.ప.1-51 మొ3-24<br>పునవ.రా.3-10మొ4-45 | **16**<br>విదియ రా. 10-9<br>పుబ్బ రా.తె. 5-42<br>వ.రా. 8-48మొ10-34 | **23**<br>అష్టమి ఉ.8-7<br>అనూరాధ రా.6-35<br>వ.రా.12-22మొ2-1 |
| **MON సోమ**<br>రా.కా.ఉ.7-30మొ9-0<br>దు.ప.12-24మొ1-12వ<br>పు.దు.ప.2-48మొ3-36 | **31**<br>విదియ రా.8-5<br>పూర్వాభాద్ర ప. 1-32<br>వ.రా.10-28మొ11-57 | **3**<br>తదియ ఉ. 9-32<br>శతభిషం ఉ. 7-3<br>పూర్వాభాద్ర రా.తె.5-27<br>వ.ప. 1-2 మొ 2-32 | **★10**<br>ఏకాదశి రా. 6-21<br>మృగశిర రా. 9-23<br>వ.రా.తె. 5-52మొ | **17**<br>తదియ రా. 12-7<br>ఉత్తర పూర్తి<br>వ.ప.1-41 మొ3-24 | **24**<br>నవమి 8-13<br>జ్యేష్ఠ రా. 7-20<br>వర్జ్యం లేదు |
| **TUE మంగళ**<br>రా.కా.ప.3-0మొ4-30వ<br>దు.ఉ.8-24మొ9-12వ<br>పు.దు.రా.10-48మొ11-36వ | | **4**<br>చవితి ఉ. 7-53<br>పంచమి రా.తె.5-24<br>ఉత్తరాభాద్రరా.తె.3-42<br>వ.ప.2-21మొ3-50 | **11**<br>ద్వాదశి సా.5-46<br>ఆర్ద్ర రా. 9-36<br>శే.వ.ఉ.7-29కు | **18**<br>చవితి రా.2-9<br>ఉత్తర ఉ.8-19<br>వ.సా.5-38 మొ17-24 | **25**<br>దశమి ఉ.8-52<br>మూల రా.7-37<br>వ.సా.6-0మొ7-37<br>పున వ.రా.తె.5-9మొ |
| **WED బుధ**<br>రా.కా.ప.12-0మొ1-30వ<br>దు.ఉ.11-36మొ12-24వ | | **5**<br>షష్ఠి రా. 3-18<br>రేవతి రా. 2-59<br>వ.ప. 3-4మొ 4-35 | **12**<br>త్రయోదశి సా. 5-42<br>పునర్వసు రా. 10-16<br>వ.ఉ.9-56 మొ11-34 | **19**<br>పంచమి రా.తె.4-7<br>హస్త ఉ. 10-27<br>వ.రా. ।-46 మొ9-32 | **★26**<br>ఏకాదశి ఉ.7-23<br>పూర్వాషాఢ రా.7-27<br>శే.వ.ఉ.6-44 కు పున<br>వ.రా.తె.3-15మొ4-48 |
| **THU గురు**<br>రా.కా.ఉ.1-30మొ3-00వ<br>దు.ఉ.10-0మొ10-48వ<br>పు.దు.ప.2-48మొ3-36వ | | **6**<br>సప్తమి రా.1-1<br>అశ్విని రా. 12-52<br>వ.రా. 9-7 మొ 10-37 | **13**<br>చతుర్దశి రా. 6-6<br>పుష్యమి రా. 11-29<br>వ.ఉ.6-40 మొ8-21 | **20**<br>షష్ఠి రా. తె. 5-49<br>చిత్త ప. 1-23<br>వ.రా.7-29మొ9-24 | **27**<br>ద్వాదశి ఉ.6-16<br>త్రయోదశి రా.తె.4-50<br>ఉత్తరాషాఢ రా.6-52<br>వ.రా.10-42మొ12-14 |
| **FRI శుక్ర**<br>రా.కా.ఉ.10.30మొ12.0వ<br>దు.ఉ.8.24మొ9.12వ<br>పు.దు.ప.12.24మొ1.12వ | | **7**<br>అష్టమి రా. 10-35<br>భరణి రా. 11-19<br>వ.ఉ. 9-51మొ11-21 | **•14**<br>అమావాస్య రా. 6-51<br>ఆశ్లేష రా. 1-9<br>వ.ప. 1-10 మొ 2-52 | **21**<br>సప్తమి పూర్తి<br>స్వాతి ప. 3-31<br>వ.రా. 9-32మొ11-15 | **28**<br>చతుర్దశి రా.2-56<br>శ్రవణం సా. 5-54<br>వ.రా.9-41 మొ11-12 |
| **SAT శని**<br>రా.కా.ఉ.9.00మొ10.30వ<br>దు.ఉ.6.0మొ6.48వ<br>పు.దు.ఉ.6.48మొ7.36వ | **1**<br>బ॥ పాడ్యమి ప. 2-49<br>శ్రవణం ఉ.9-52<br>వ.ప. 1-39 మొ 3-10 | **8**<br>నవమి రా. 8-49<br>కృత్తిక రా. 10-17<br>వ.ఉ. 10-47 మొ | **15**<br>శ్రావణశు॥పాడ్యమిరా.8-25<br>మఖ రా. 3-15<br>వ.ప. 2-13 మొ 3-57 | **22**<br>సప్తమి ఉ.7-3<br>విశాఖ సా. 5-16<br>వ.రా. 9-29మొ 11-10 | **○29**<br>పూర్ణిమ రా.12-48<br>ధనిష్ఠ సా.4-37<br>వ.రా.11-23మొ12-53 |

**పండుగలు**

1. తేర్కాళ్వార్ తిరునక్షత్రం
3. ఆశ్లేష కార్తి
4. అవమ తిథి
10. సర్వేషామేకాదశి
11. శుక్రమౌఢ్యారంభం
12. మాసశివరాత్రి
14. పిండపితృయజ్ఞము చుక్కల మావాస్య, గురు మౌఢ్యా రంభం
15. మైహోమ్‌హబ్‌ప్రాంగణములో మత్స్యకూర్మ లక్ష్మీ నారాయణ బ్రహోత్సవారంభము భారత స్వాతంత్ర్యదినోత్స వము
16. శ్రీఆండాల్ తిరునక్షత్రం
17. మఖకార్తి సింహసంక్ర మణం రా. 2-40
18. నాగ చతుర్థీ
19. నాగగరుడ పంచమి
21. త్రిద్యుస్పృక్, శుక్ర మౌఢ్య నివృత్తి
26. సర్వేషాం ఏకాదశి
27. అవమ తిథిః, దామోదర ద్వాదశి
28. వరలక్ష్మీవ్రతం, వరాహ జయంతి, ఋగ్వేదులకు ఉపాకర్మ
29. హయగ్రీవ జయంతి, యజు ర్వేదులకు ఉపాకర్మ, రక్షా బంధనం,విఖనస జయంతి
31. పుబ్బకార్తి

పంచాంగం కావలసినవారు క్రింది నెంబర్లలో సంప్రదించగలరు : 08645 272929, 0866 2420820



పరమహంస పరివ్రాజకులు

# శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారి ప్రచారవార్తలు



జూన్ 28వ, తేదీన శ్రీస్వామివారు జీవా మరియు జిమ్స్ సమావేశాల్లో పాల్గొని, తగు సూచనలందించారు. ఈ సమావేశాలు శ్రీమాన్ డా॥ జె. రామేశ్వర్‌రావుగారి తోటలో నిర్వహించారు.

జూన్ 29వ, తేదీన కోదాడ సమీపంలో మఠంపల్లి మండలంలోని గుఱ్ఱంపూడి తండా వేంచేసి మినరల్ వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించారు. ఈ ప్లాంట్‌ని తండాలోని ప్రజలందరికి ఉపయోగపడేలా అందించిన శ్రీమాన్ వసంత్ సూరిగారి అమ్మాయి ప్రణమ్యసూరి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీస్వామివారు పేద ప్రజలకు చక్కటి సదుపాయాన్ని కల్గించిన ప్రణమ్యకు, దాన్ని చక్కగా వినియోగించు కొమ్మని ఆ తండా ప్రజలందరికి శ్రీస్వామివారు అనేక మంగళా శాసనాలు కృపచేసారు.

జూన్ 30వ, తేదీన శ్రీస్వామివారు హైదరాబాద్ వేంచేసి శ్రీమాన్ దిట్టకవి తాతాచార్యులవారి పరమపదోత్సవంలో పాల్గొన్నారు. వీరు శ్రీస్వామివారు సంకల్పించిన అనేక కార్యక్రమాల్లో తమ సేవలందించి తరించిన మహానుభావులు. వీరి సంతానానికి కూడా సత్సంప్రదాయ సేవలో తరించే సంస్కారాన్ని అందించిన భగవద్రామానుజ సేవా నిరతులు. వీరికి ఆ పెరుమాళ్ళ సన్నిధిలో చక్కటి సేవాభాగ్యం లభించాలని మంగళాశాసనం చేసి సాయంకాలానికి జీవా ప్రాంగణం వేంచేసారు.

జూలై 3వ తేదీన శ్రీస్వామివారు శాంతిసుందర పారాయణని ముగించుకొని మధ్యాహ్నం 1.00 గంటకి విమానంలో ఢిల్లీ బయల్దేరారు. సాయంకాలం ఢిల్లీ చేరుకుని మొదటగా సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ చైర్మన్ శ్రీమాన్ కె.వి. చౌదరి గారింటికి వేంచేసి మంగళాశాసనం చేసారు. అనంతరం "అక్షర్ ధామ్"కి వేంచేసి "ట్రాన్స్‌డెన్స్" అనే గ్రంథానికి సంబంధించిన విశేష కార్యక్రమంలో శ్రీస్వామివారు పాల్గొన్నారు. భారత మాజీ రాష్ట్రపతి శ్రీమాన్ డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారు, స్వామి నారాయణ్ సంప్రదాయానికి ప్రధాన సూత్రధారులు అయిన శ్రీ ప్రముఖ్ స్వామీజీతో తమకు కల్గిన ఆధ్యాత్మిక మధురానుభూతులకు ఈ గ్రంథంలో వివరించారు. ఈ కార్యక్రమాన్ని సుసంపన్నం చేయడానికి అక్షర్‌ధామ్ నిర్వాహకులు శ్రీ ఆత్మస్వరూప్ స్వామీజీ మన శ్రీస్వామివారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇంకా అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. బి.జె.పి ప్రముఖ నాయకులు శ్రీమాన్ ఎల్.కె. అధ్వానిగారు, శంకర నేత్రాలయ సంస్థాపకులు శ్రీమాన్ ఎస్.ఎస్ బదరీనాథ్‌గారు, ఇస్రో చైర్మన్ శ్రీమాన్ ఎ.ఎస్. కిరణ్ కుమార్ గారు, జి.ఎమ్.ఆర్. బిజినెస్ చైర్మన్ శ్రీమాన్ బి.వి. రావుగారు, మనిపాల్ గ్లోబల్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీమాన్ మోహన్‌దాస్‌పై గారు ఈ విశేష కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక శోభను కల్గించారు. శ్రీస్వామివారు, శ్రీ ఆత్మస్వరూప్ స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం శ్రీ ఈశ్వర్‌చరణ్‌స్వామి స్వాగత వచనాలతో సభ ప్రారంభమయింది. వీరు శ్రీమాన్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారికి, శ్రీ ప్రముఖ్ స్వామీజీకి మధ్యలో జరిగిన మొదటి ఆధ్యాత్మిక అనుభవాన్ని వివరించారు. అనంతరం పెద్ద తెరమీద ఇద్దరు బాలుర అద్భుత కథనం చూపించారు. పడవ నడుపుకుని జీవనం సాగించే ఒక సామాన్యునికి జన్మించిన పిల్లవాడు పట్టుదలతో ఒక విజ్ఞానవేత్తగా ఎదిగి భారత రాష్ట్రపతిగా మారిన వైనాన్ని అనగా అబ్దుల్ కలాంగారి అద్భుత గాథని తెరపై చూపించారు. అలాగే ఒక సామాన్య రైతుబిడ్డ గొప్ప తత్త్వవేత్తగా ఎదిగి ఒక ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థకు దిశానిర్దేశం చేసే మహాత్ములుగా ఎదిగిన వైనాన్ని అనగా శ్రీ ప్రముఖ్ స్వామీజీ కథనాన్ని తెరపై కన్నులకు కట్టినట్లుగా చూపించారు.

అటుపిమ్మట శ్రీ బ్రహ్మ విహారి స్వామీజీ డా॥ అబ్దుల్‌కలాంగారికి ప్రముఖ్ స్వామీజీకి మధ్యలో జరిగిన కొన్ని ప్రధాన ఘట్టాలను వివరించారు. తర్వాత "ట్రాన్సెండెన్స్" అనే గ్రంథాన్ని గ్రంథస్థం చేయడంలో సహాయకులుగా వ్యవహరించిన ప్రొఫెసర్ శ్రీమాన్ అరుణ్ తివారి గారు ఈ గ్రంథం విషయంలో వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం హార్పర్ కాలిన్స్ పబ్లికేషన్ సి.ఇ.ఒ. శ్రీమాన్ పి.ఎమ్. సుకుమార్‌గారు, మాట్లాడుతూ ఈ గ్రంథం ముద్రించగానే రికార్డు స్థాయిలో పాఠకులు ఆదరించాలని, దీన్ని గుజరాతి, హిందీ, మరాఠి, తమిళం, తెలుగు, మలయాళం ఇలా 6 భాషల్లో అనువదించి అందించడానికి అనుమతి కూడా లభించింది అన్నారు. విచ్చేసిన ప్రముఖులు సంక్షిప్త వచనాలు పలికారు. చివరగా శ్రీస్వామివారు మంగళాశాసన ప్రవచనంతో సభ ప్రత్యేక శోభను సంతరించుకుంది. శ్రీ ఆత్మస్వరూప్ స్వామీజీ ముగింపు వచనాలతో సభ సమాప్త మయ్యింది. శ్రీసామివారు రాత్రి ఢిల్లీ విమానాశ్రయంలో జి.ఎమ్.ఆర్ అధినేత శ్రీమాన్ గ్రంధి మల్లిఖార్జున్‌రావుగారు ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిదిలో బస చేసారు.

జూలై 4వ, తేదీన ఉదయం 5.00 గంటలకు శ్రీస్వామివారు విమానంలో ఢిల్లీ నుండి హైదరాబాద్ బయల్దేరారు. ఉదయం 8.00 గంటలకు జీవా ప్రాంగణం చేరుకుని ఆరాధనాదులు ముగించుకొని సుందరకాండ పారాయణంలో పాల్గొన్నారు.

జూలై 5వ, తేదీన శ్రీస్వామివారు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని శ్రీమాన్ విజయ్‌కుమార్ అగర్వాల్‌గారి గృహానికి విచ్చేసి మంగళా శాసనం చేశారు. అనంతరం బండ్లగూడ ప్రాంతానికి విచ్చేసి సరస్వతి శిశుమందిర్‌కు సంబంధించిన తెలంగాణ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల శిబిరాన్ని సందర్శించి స్ఫూర్తిదాయక సందేశాన్నదించి మంగళా శాసనం చేసారు. తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీమాన్ లంగం సుధాకర్‌రెడ్డిగారు, అధ్యక్షులు శ్రీమాన్ ఉమామహేశ్వర్ రావుగారు (రిటైర్డ్ ఐ.ఎ.ఎస్) కూడా పాల్గొని శ్రీస్వామివారి మంగళా శాసనాలు స్వీకరించారు.

జూలై 7వ, తేదీన శ్రీస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో 'శాంతి సుందరం' మొదటి విడత సమాపన కార్యక్రమం జీవా ప్రాంగణంలోని పెద్ద సాకేత మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. "సుందరసేతు" కార్యక్రమంలో పాల్గొన్న భక్తగోష్ఠి ఇందులో అన్వయించి వారికి కేటాయించిన శ్లోకం కల్గిన సర్గనంతా పారాయణం చేసారు. ఒక్కొక్క సర్గకి ఒక్కొక్క స్థలాన్ని కేటాయించగా ఆయా సర్గకి సంబంధించిన శ్లోకం కలవారు ఆయా సర్గ స్థలంలో కూర్చుని ఆ సర్గనంతా పారాయణ చేశారు. ఈ విధంగా అతి తక్కువ సమయంలో సంపూర్ణ సుందరకాండ పారాయణ

చేసిన ఫలితాన్ని పొందగలిగారు. పారాయణ అనంతరం శ్రీసీతారామ కళ్యాణం, శ్రీరామపట్టాభిషేకం రంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ అహోబిల రామానుజ జీయర్‌స్వామివారు, శ్రీ దేవనాథ రామానుజ జీయర్‌స్వామివారు, శ్రీ ఉ.వే. శ్రీమాన్ డా॥ సముద్రాల రంగరామానుజా చార్యస్వామివారు, శ్రీమాన్ డా॥ జె. రామేశ్వర్‌రావుగారు ఈ కార్యక్రమంలో అన్వయించి శ్రీస్వామివారి మంగళాశాసనాలను స్వీకరించారు.

జూలై 9వ తేదీన ఉదయం ఆరాధన, తీర్థగోష్ఠి ముగించుకొని శ్రీస్వామివారు మధ్యాహ్నము శ్రీమాన్ బాలచంద్రగారి అభ్యర్థన మేరకు హైదరాబాద్ నగర పరిసరాల్లో ఇబ్రహీం పట్నం ప్రాంతంలో వారు నిర్వహిస్తున్న "అభయ ఫౌండేషన్" ప్రాంగణానికి విచ్చేసి మంగళాశాసనం చేసారు. ఈ సందర్భంగా అక్కడ చేరిన ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయక సందేశాన్నందించారు. "అభయ" వారు నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు శ్రీస్వామివారు కరకమలముల మీదుగా బహుమతులు స్వీకరించి ధన్యులయ్యారు. "అభయ"వారు ప్రభుత్వ సహాయంతో నేర్పించే వృత్తివిద్యా కోర్సులు నేర్చుకోవడానికి వచ్చిన వారికి కూడా మంగళాశాసనాలందించారు. శ్రీస్వామివారు, వివిధ రకాలైన సామాజిక సేవా కార్యక్రమాలను అద్భుతంగా చేస్తున్న శ్రీమాన్ బాలచంద్రగారి సేవానిరతిని శ్లాఘించారు. వీరి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న శ్రీమాన్ నర్సింహులుగారికి ప్రత్యేక మంగళాశాసనాలు కృపచేసి జీవా ప్రాంగణం చేరుకున్నారు.

జూలై 12వ, తేదీన మధ్యాహ్నం 1.00 గంటకి శ్రీస్వామివారు 14వ, తేదీ నుండి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను ప్రారంభించడానికి జీవా ప్రాంగణం నుండి భద్రాచల క్షేత్రానికి బయల్దేరారు. దారిలో ఖమ్మం నగరంలోని శ్రీమాన్ హరిగారి గృహాన్ని, శ్రీమాన్ ఎర్నేని రామారావుగారు నిర్వహిస్తున్న బయాసిస్ రిసార్ట్స్‌ని సందర్శించి మంగళాశాసనం చేసారు. పాల్వంచ సమీపంలోని శ్రీవేంకటేశ్వరాలయాన్ని సేవించి మంగళాశాసనం చేసారు. రాత్రి 7.00 గంటలకు భద్రాచలం క్షేత్రం రాజవీధిలోని జీయర్‌మఠానికి వేంచేసారు. శ్రీ ఉ.వే. శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు గారు, శ్రీమాన్ భట్టర్‌గారు, శ్రీమాన్ వేంకటాచార్యులుగారు, భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వికాస తరంగిణి బృందం వారు, శ్రీస్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. భద్రాచలక్షేత్ర అర్చక, వైదిక బృందంతో, ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి జ్యోతిగారు శ్రీస్వామివారిని దర్శించి స్వాగత సుమాంజలి సమర్పించారు.

## భద్రాచలం

జూలై 13వ, తేది ఉదయం శ్రీస్వామివారు జీయర్ మఠంలో ఆరాధన, తీర్థగోష్ఠి నిర్వహించి భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామిని సేవించి, నూతన వస్త్రాలని సమర్పించడానికి ఆలయానికి వేంచేసారు. ఆలయ అర్చక, వైదిక బృందంతో ఈ.ఓ శ్రీమతి జ్యోతిగారు శ్రీస్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాజస్థాన్ రాష్ట్రంలోని అల్వర్ ప్రాంతం నుండి విచ్చేసిన శ్రీమాన్ జగద్గురు కోసలేంద్ర ప్రపన్న ఫలహారీ స్వామి కూడా శ్రీస్వామివారిని అనుసరించారు. శ్రీసీతారామచంద్రులకు, పరివారానికి, ఆళ్వారాచార్యులందరికి నూతన పట్టువస్త్రాలని శ్రీస్వామివారు తమ కరకమలములతో సమర్పించారు. ఈ వస్త్ర కైంకర్యాన్ని చేసే సౌభాగ్యం తమిళనాడులోని సేలం పట్టణానికి చెందిన శ్రీమాన్ శ్రీరామ్-శ్రీమతి ఉమ దంపతులకు లభించింది. వారు కూడా స్వయంగా విచ్చేసి ఆచార్య ముఖేన పెరుమాళ్ళని సేవించుకున్నారు.

మధ్యాహ్నం జీయర్‌మఠంలో వికాస తరంగిణి కార్యకర్తల సమావేశంలో శ్రీస్వామివారు పాల్గొని గోదావరి పుష్కరాల సందర్భంగా విచ్చేసే భక్తులకు అందించే సేవల విషయంలో తగు సూచనలనందించారు. మళ్ళీ శ్రీస్వామివారు రాత్రి ఆలయానికి వేంచేసి శ్రీసీతారామచంద్రుల పవళింపు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని నెలల క్రితం వచ్చినప్పుడు కూడా శ్రీస్వామివారు పవళింపు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడు హరిదాసులు శ్రీరామదాసుగారు ఆలపించిన పవళింపు కీర్తనలు, గద్యము చదువుతున్నప్పుడు "బంగారు గిన్నెలో పొంగారు పాలు సమర్పించ వలయును" అని విన్నారు శ్రీస్వామివారు. కాని అక్కడ క్రియలో మాత్రం వెండి గిన్నెలో సమర్పించడం గమనించారు. శ్రీస్వామివారు, గద్యంలో పాడినట్టుగా బంగారుగిన్నెలోనే సమర్పిస్తేనే బాగుంటుంది అని సంకల్పించారు. శ్రీమాన్ వేణుస్వామిగారు మాటల సందర్భంలో సేలం శ్రీమాన్ శ్రీరామ్‌గారితో చెప్పినప్పుడు, ఆ భాగ్యాన్ని మాకు ప్రసాదించండి అని అభ్యర్థించారు. ఈ రోజు వారు 350 గ్రాముల బంగారు పాత్రని శ్రీసీతారామచంద్రులకు క్షీర నివేదనకు శ్రీస్వామివారి కరకమలముల మీదుగా సమర్పించారు. శ్రీస్వామివారే స్వయంగా పెరుమాళ్ళకు నూతన బంగారు పాత్రలో క్షీర నివేదనం చేసారు. భద్రాద్రి రాముడికి శ్రీస్వామివారు పాద సంవహనం చూస్తూ నిద్ర పుచ్చారు. ఈ సన్నివేశాన్ని సేవించుకున్న భక్తగోష్ఠి అంతా తమ జన్మధన్యమైందని భావించారు.

## గోదావరి పుష్కరాలు-భద్రాచలం

జూలై 14వ, తేది ఉదయం 5 గంటలకే స్నానాదికములను ముగించుకొని శ్రీస్వామివారు భక్తులందరితో కలిసి, ఆలయానికి విచ్చేసి సుదర్శన పెరుమాళ్ళని తోడ్కొని ఆలయ అర్చక, వైదిక, అధికారి బృందంతో భద్రాద్రి శ్రీసీతారాముల సన్నిధి నుండి సమీపంలోని పవిత్ర గోదావరీ నదికి శోభాయాత్రగా బయలేరారు. ఈ శోభాయాత్రలో తెలంగాణ ప్రభుత్వ భారీ నీటి పారుదల శాఖా మాత్యులు శ్రీమాన్ హరీశ్‌రావుగారు, రోడ్డు మరియు భవనాల శాఖామాత్యులు శ్రీమాన్ తుమ్మల నాగేశ్వరరావుగారు, తెలంగాణ రాష్ట్ర బి.జె.పి అధ్యక్షులు శ్రీమాన్ కిషన్‌రెడ్డిగారు, మైహోం గ్రూప్ సంస్థల అధినేత శ్రీమాన్ డా॥ కె. రామేశ్వరరావుగారు, శ్రీ జగద్గురు కోసలేంద్ర ప్రపన్న ఫలహారీ స్వామి పాల్గొని శ్రీస్వామివారిని అనుసరించారు. శ్రీస్వామివారు గోష్ఠిగా గోదావరీ నదికి చేరుకుని సుదర్శన పెరుమాళ్ళతో పడవను అధిరోహించి గోదావరీ నదీమ తల్లికి పుష్కర ప్రారంభ సందర్భంగా పూజ కావించారు. అప్పటికే అక్కడ లక్షలాది మంది చేరి నయనానంద కరంగా శ్రీస్వామివారు చేసే నదీ పూజను తిలకిస్తూ పుష్కర స్నానం కోసం ఉత్కంఠతతో వేచి చూస్తున్నారు. శ్రీస్వామివారు పూజ అనంతరం గోదావరీ నదికి హారతిచ్చి ప్రథమ పుష్కరస్నానం శ్రీసుదర్శన పెరుమాళ్ళకు కావించారు. అనంతరం శ్రీస్వామివారు గోదావరి నదిలో పుష్కరస్నానం ఆచరించగానే భక్తులంతా పుష్కర స్నానాన్ని ఆచరించి ధన్యుల మయ్యామని భావించారు. ఈ విధంగా శ్రీస్వామివారు రంగ రంగ వైభవంగా భద్రాద్రినాథుని సన్నిధిలో పవిత్ర గోదావరీ పుష్కరాలను ప్రారంభించారు.

మన భద్రాద్రి మఠంలో వెలసిన శ్రీగోదారంగనాథులకి ప్రథమ కళ్యాణోత్సవము శ్రీస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవముగా జరిగింది.

శ్రీమాన్ జయంత్–డా॥ శోభ దంపతులు ప్రధాన ఉభయదారులుగా వ్యవహరించి శ్రీస్వామివారి మంగళాశాసనా లందుకున్నారు.

జూలై 15వ, తేదీ ఉదయం ఆరాధన, తీర్థగోష్ఠి ముగించుకొని శ్రీస్వామివారు ఆలయ ప్రవచన మండపానికి వేంచేసి భక్తగోష్ఠికి సంక్షేప రామాయణాన్ని ఉపదేశ పూర్వకంగా అందించారు. సంక్షేప రామాయణం పాకెట్‌సైజ్ పుస్తకాలు శ్రీమతి శ్రీలత భూపాల్‌రెడ్డి గారు ముద్రణ చేయించి భక్తగోష్ఠి అందరికీ ఉచితంగా అందించి శ్రీస్వామివారి మంగళాశాసనాలు అందుకున్నారు. మంచిర్యాల, రాజమహేంద్రిలో కూడా అందిస్తామన్నారు. శ్రీస్వామివారు "ఈ రోజు నుండి సంక్షేప రామాయణాన్ని నిత్యపారాయణలో పెట్టుకుంటాం" అని ప్రతిజ్ఞ చేయండి అన్నారు. అందరూ కూడా ఆచార్య ఆజ్ఞ శిరసావహించి తప్పకుండా చేస్తామన్నారు.

సాయంత్రం మళ్ళీ ఆలయ మండపానికి శ్రీస్వామివారు వేంచేసి ప్రవచన గోష్ఠిని అనుగ్రహించారు. గోదావరి నదీ పుష్కర వైభవాన్ని వివరించారు. అనంతరం అర్చక పరివారంతో భద్రాద్రి శ్రీసీతారామ చంద్ర ప్రభువుకు ఊయల సేవను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు శ్రీమాన్ రమణాచార్యులు గారు పాల్గొన్నారు.

జూలై 16వ, తేది ఉదయం ఆరాధనానంతరం తీర్థగోష్ఠికి ముందు శ్రీస్వామివారు "శ్రీరామానుజ కీర్తి కౌముది" అనే కీర్తనల ఆడియో సి.డిని ఆవిష్కరించారు. శ్రీ ఉ.వే. శ్రీమాన్ టి.పి. రాఘవాచార్య స్వామిని, సంగీతాన్ని అందించి పాడిన శ్రీమాన్ తారక రామారావు గారిని, ఆర్థిక సహాయాన్ని అందించిన ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులు శ్రీమాన్ రవీందర్ రెడ్డిగారిని శ్రీస్వామివారు శ్లాఘించి ప్రత్యేక మంగళాశాసనాలు అందించారు. అనంతరం తీర్థగోష్ఠి నిర్వహించారు. అటుపిమ్మట ఆలయానికి వేంచేసి శ్రీసీతారామచంద్ర ప్రభువును సేవించి, ఆలయ అర్చకులకు, అధికారులకు ఈ పుష్కర మహోత్సవాన్ని సేవించవచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కావలసిన సూచనలందించి మధ్యాహ్నం 1 గంటకు శ్రీస్వామివారు భద్రాచలం నుండి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల పట్టణానికి బయల్దేరారు.

## మంచిర్యాల

సాయంకాలం 5.30 గంటలకు శ్రీస్వామివారు మంచిర్యాల పట్టణానికి చేరుకున్నారు. శ్రీదేవనాథ జీయర్‌స్వామివారు, శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్యులు, శ్రీమాన్ జగన్నాథాచార్యులు, స్థానిక ఎమ్.ఎల్.ఎ. శ్రీమాన్ దివాకర్‌రావుగారు, బ్రహ్మయజ్ఞ కమిటీ అధ్యక్షులు శ్రీమాన్ శ్యాంసుందర్‌రావుగారు, జెట్ (ఎస్) అధ్యక్షులు శ్రీమాన్ మిత్ర వేంకటేశ్వర రావుగారు, శ్రీమాన్ బాలకిషన్‌రావుగారు, మంచిర్యాల వికాస తరంగిణి కార్యదర్శి శ్రీమాన్ రాజేశ్వరరావుగారు, శ్రీమతి ఉమగారు, శ్రీమాన్ హన్మంతరావుగారు, శ్రీమాన్ నర్సింగరావుగారు ప్రభృతులు శ్రీస్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికి గోదావరి పుష్కర ఘాట్ సమీపంలోని బ్రహ్మయజ్ఞ స్థలానికి వేంచేశారు. అద్భుతంగా చేసిన ఏర్పాట్లను చూసి అచ్చెరువొంది మంగళాశాసనాలు చేసారు. వెంటనే శ్రీస్వామివారు పరివారము, భక్తులు వెంటరాగా గోదావరీ నదికి బయల్దేరారు. నదీపూజ కావించి హారతిచ్చి పుష్కరస్నానాన్ని ఆచరించారు. అనంతరం శ్రీమాన్ మధు సూదనాచార్యస్వామివారు అందరిచేత సంకల్పం చెప్పించి పుష్కర స్నానం చేయించారు. సాయంత్రం 8 గంటలకు ప్రవచన మండపంలో ఋత్విగ్వరణం శ్రీస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవంగా జరిగింది.

జూలై 17వ, తేది ఉదయం యాగశాల వద్ద గరుడ పట ఆవిష్కరణ కావించి అగ్ని మథన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు నిమిషాలలోపే అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యేసరికి అందరి ఆనందానికి అవధుల్లేవు. యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపనం చేసి వేద పురాణేతిహాస స్తోత్ర పారాయణలు ప్రారంభించారు. అనంతరం శ్రీస్వామివారు తీర్థగోష్ఠి నిర్వహించారు.

మధ్యాహ్నం శ్రీమాన్ రమేష్ గుప్తగారు వారి షష్ఠిపూర్తి మహోత్సవ శుభ సందర్భంగా ఆచార్య ఆరాధన వైభవంగా చేసుకున్నారు. శ్రీస్వామి వారు శ్రీమాన్ రమేష్‌గుప్త దంపతులకు పరిపూర్ణ మంగళాశాసనాలు కృపచేశారు. వారి కుటుంబ సభ్యులంతా ఈ కార్యక్రమాన్ని సేవించు కొన్నారు.

సాయంకాలం 4 గంటలకు హన్మంతరావుగారు, మంచిర్యాల వికాస తరంగిణి కార్యదర్శి శ్రీమాన్ రాజేశ్వర్‌రావు గార్ల గృహాన్ని సందర్శించి మంగళాశాసనాలు చేశారు. అనంతరం భక్తులందరితో గోదావరినదికి వెళ్ళి పూజకావించి, హారతిచ్చి, సంకల్పంతో నదీ స్నానం ఆచరించారు.

సాయంత్రం 6 గంటలకు వేదికపై విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం చేసారు, శ్రీస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షలో వికాస తరంగిణి ప్రముఖులు మరియు వివిధ కార్యకర్తలు, ప్రముఖులు ప్రసంగించారు. వారి సంస్థతో శ్రీస్వామివారితో ఉన్న అవినాభావ సంబంధాన్ని, మధుర స్మృతులను శ్రోతలందరితో పంచుకున్నారు. షష్ఠిపూర్తి మహోత్సవాన్ని జరుపుకున్న వికాస తరంగిణి కేంద్ర అధ్యక్షులు శ్రీమాన్ రమేష్‌గుప్తగారు, మంచిర్యాల ఎమ్.ఎల్.ఎ. శ్రీమాన్ దివాకర్‌రావుగారు, బ్రహ్మయజ్ఞ కమిటీ అధ్యక్షులు శ్రీమాన్ శ్యామ్‌సుందర్‌గారు, జెట్ (ఎస్) అధ్యక్షులు శ్రీమాన్ మిత్ర వేంకటేశ్వరరావుగారు, శ్రీమాన్ ప్రభాకర్‌రావుగారు, వరంగల్ వికాస తరంగిణి అధ్యక్షులు శ్రీమతి డా॥ జ్యోతిగారు, కరీంనగర్ అధ్యక్షులు శ్రీమాన్ గౌతమ్‌రావుగారు, శ్రీమాన్ బాలకిషన్‌రావుగారు మొదలగు వారు ప్రసంగించారు. చివరగా శ్రీస్వామివారు మంగళాశాసన ప్రవచనం కావించి, పూర్ణాహుతిలో అన్వయించారు.

జూలై 18వ, తేది ఆరాధన, తీర్థగోష్ఠి, యాగశాలలో కార్యక్రమాలు యథావిధిగా జరిగాయి. నక్షత్ర మరియు ఇష్టి యాగశాలలో కార్యక్రమ ప్రారంభమయ్యింది. పూర్ణాహుతితో ఉదయం కార్యక్రమం సుసంపన్నం అయ్యింది.

సాయంకాలం 4 గంటలకు మంచిర్యాల పట్టణంలోని శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయం నుండి గోదావరి ఘాట్ వరకు శోభాయాత్ర శ్రీస్వామివారి ప్రత్యక్షపర్యవేక్షణలో కన్నుల పండుగగా జరిగింది. 1000 మంది మహిళలు కోలాటం వేస్తూ పాల్గొని ప్రత్యేక శోభను చేకూర్చారు. కొంతమంది మహిళలు కలశాలు ధరించి కీర్తనలు ఆలపిస్తూ పాల్గొన్నారు. కొంతమంది పురుషులు మేళతాళాలతో భజనలు చేస్తూ, నృత్యం చేస్తూ పాల్గొన్నారు. గిరిజన తండాలనుండి వచ్చిన కొంతమంది ఆటవిక వేషధారణతో నృత్యం చేస్తూ అందరినీ అలరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇంకా అనేక మంది భక్తులు వెంటరాగా శ్రీస్వామివారు శ్రీదేవనాథ జీయర్‌స్వామివారు నేతృత్వంలో శోభాయాత్రగా గోదావరి ఘాట్‌కు చేరుకున్నారు.

జూలై 19వ, తేది ఆదివారం కావడంవల్ల భక్తజనం అసంఖ్యాకంగా విచ్చేసి సేవించుకున్నారు. తీర్థగోష్ఠికి ముందు శ్రీస్వామివారు ప్రవచన మండపంలో భక్తులకు గోదావరి పుష్కర వైభవాన్ని తెలియజేసారు. సుమారుగా 20,000 మందికిపైగా పాల్గొన్న భక్తులకు నిర్విరామంగా చెరగని చిరునవ్వుతో శ్రీస్వామివారు తీర్థగోష్ఠిని అనుగ్రహించారు.

సాయంకాలం నదీ పూజా, హారతి కార్యక్రమంలో శ్రీస్వామి వారితో పాటు తెలంగాణా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖామాత్యులు శ్రీమాన్ హరీష్‌రావుగారు, ఆర్థిక శాఖామాత్యులు శ్రీమాన్ ఈటెల రాజేందర్‌గారు పాల్గొని పుష్కర స్నానాన్ని ఆచరించి శ్రీస్వామివారి మంగళాశాసనాలు అందుకున్నారు.

రాత్రి యాగ పూర్ణాహుతి అనంతరం పెరుమాళ్ళు వటపత్రశాయి రూపంలో భక్తులకు దర్శనమిచ్చి ఊరేగింపుగా వేదికపైకి వేంచేసారు. శ్రీస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీమతి సముద్రాల మాధవి రామానుజంగారు వారి శిష్యబృందంతో 75వ, ఆచార్యత్రయం నృత్య రూపకం వజ్రోత్సవ వేడుకలను వైభవంగా ప్రదర్శించారు. అల్లంపల్లి జీయర్ గురుకులం విద్యార్థులు కూడా అన్వయించి అందరినీ అలరించారు. అనంతరం శ్రీస్వామివారు వారికి ప్రత్యేక మంగళా శాసనాలు కృపచేశారు. "మేము మాటవరుసకు 108 ప్రదర్శనలివ్వాలి అన్నమాటకు మాధవిగారు ఒక దీక్షగా తీసుకొని అప్పుడే వజ్రోత్సవ వేడుకలను పూర్తి చేసుకోవడం మాకు ఆనందంగాను, గర్వంగాను ఉంది" అన్నారు శ్రీస్వామివారు. 108 కూడా త్వరలోనే పూర్తవుతాయి అని మంగళాశాసనం చేశారు.

జూలై 20వ, తేది ఉదయం కార్యక్రమాలు యథావిధిగా ప్రారంభ మయ్యాయి. తెలంగాణా రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖామాత్యులు శ్రీమాన్ జోగురామన్నగారు బ్రహ్మయజ్ఞాన్ని సందర్శించి శ్రీస్వామివారి మంగళాశాసనాలు స్వీకరించారు.

మధ్యాహ్నం శ్రీస్వామివారు మంచిర్యాల పట్టణంలోని మార్వాడీ పరివారము కలిసి నిర్మించుకున్న లక్ష్మీనారాయణ ఆలయానికి వేంచేసి దర్శించి మంగళాశాసనం చేసారు. పుష్కర వైభవాన్ని, శ్రీరామానుజ సహస్రాబ్ది ప్రాజెక్టు విశేషాలని వివచించి నదీ స్నానానికి బయల్దేరారు. శ్రీస్వామివారు నదిలోకి ప్రవేశించగానే కుంభవృష్టి ప్రారంభమైంది. ఆ వర్షంలోనే శ్రీస్వామివారు నదీపూజ కావించి, హారతిని కూడా ఇవ్వడం విశేషం. తరువాత శ్రీస్వామివారు బ్రహ్మయజ్ఞ స్థలానికి చేరుకున్నారు. పూర్ణాహుతి అనంతరం పెరుమాళ్ళు ఈ రోజు విశేషంగా హనుమ ద్వాహనంపై ఊరేగుతూ భక్తులనందరినీ అలరిస్తూ అను గ్రహించారు. అటుపిమ్మట కార్యకర్తలందరికీ జ్ఞాపికలను బహూకరించారు.

జూలై 21వ, తేది గోదావరీ పుష్కర ప్రయుక్త బ్రహ్మయజ్ఞ మహాపూర్ణాహుతి రంగరంగ వైభవంగా జరిగింది. ఋత్విక్ సమ్మానం అనంతరం శ్రీస్వామివారు శ్రీమాన్ కిషన్‌రావుగారి గృహాన్ని సందర్శించి మంగళాశాసనాలు చేసి గోదావరీ నదికి అవభృద స్నానార్థం విచ్చేసారు. అశేష భక్తజన సందోహం ఈ అవభృద స్నాన కార్యక్రమంలో పాల్గొని ధన్యులమయ్యామని భావించారు. శ్రీస్వామివారు నదీపూజ కావించి హారతిచ్చి స్నానానంతరం మహాకుంభ ప్రోక్షణ భక్తులందరికీ కృప చేశారు. గోదావరీ పుష్కర ప్రయుక్త బ్రహ్మయజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహించుటకు ప్రధాన కారకులు మార్గదర్శకులు అయిన శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్‌స్వామివారికి సహకరించిన అర్చక, వైదిక వర్గాలవారందరికీ బ్రహ్మయజ్ఞ కమిటీ మరియు వికాస తరంగిణి తదితర కార్యకర్తలందరికీ శ్రీస్వామివారు పరిపూర్ణ మంగళాశాసనాలు అనుగ్రహించారు. సాయంకాలం 6 గంటలకు మంచిర్యాల పట్టణం నుండి రాజమహేంద్రికి బయల్దేరారు. ఇటీవల నిర్మించిన శ్రీగోదారంగనాథ ఆలయాన్ని సందర్శించి మంగళాశాసనం చేశారు. దాన్ని అకుంఠిత దీక్షతో నిర్మించిన శ్రీమాన్ బల్మూరి మహేందర్‌రావు గారికి వారి కుటుంబ సభ్యులందరికి మంగళాశాసనాలు అనుగ్రహించి రాజహేంద్రికి బలయల్దేరారు. రాత్రంతా ప్రయాణమే.

## రాజమండ్రి

జూలై 22వ, తేది సుదీర్ఘ ప్రయాణం చేసి శ్రీస్వామివారు ఉదయం 6 గంటలకు రాజమహేంద్రికి చేరుకుని ఎస్.కె.వి.టి. కళాశాల ప్రాంగణంలో బస చేసారు.

# చాతుర్మాస్య దీక్షారంభం



**శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారు ఈ నెల జూలై 31వ తేదీ గురుపూర్ణిమ నుండి ప్రారంభించి చాతుర్మాస్య దీక్షను ఆరంభిస్తారు. ఈ సంవత్సరం నాలుగు మాసాలు జీవా ప్రాంగణంలోనే ఉండి తమ దీక్షను సాగించాలని స్వామివారి నిర్ణయం. ఈ సమయంలో ఇటీవల రెండవ పర్యాయంగా ప్రారంభించిన శాంతిసుందర కార్యక్రమాన్ని ఉదయ సమయాల్లో యథాపూర్వంగా కొనసాగిస్తారు. ప్రతిదినం ఉదయం సరిగా 9 గంటలకు నిర్ణయించుకొన్న ప్రకారంగా 'సుందరసేతు' పారాయణం కూడా ఉంటుంది. చాతుర్మాస్య సమయంలో జరిగే విశేష కార్యక్రమాల గురించి జీవా రిసెప్షన్ నెంబర్లుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకొనవచ్చును. 31 ఉదయం ప్రారంభించే ఈ కార్యక్రమానికి భక్తులను సాదరంగా ఆహ్వానిస్తున్నాము.**

జీవా రిసెప్షన్ సెల్: 9553549971, 9553549972



శ్రీమతే నారాయణాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

# వికాసదర్శిని

*సమగ్ర సమాచార నివేదన*

**సంపాదకులు శ్రీమతి టి. అరుణ**

***కరీంనగర్ :***



పెరియాళ్వార్ తిరునక్షత్రం జూన్ 27వ తేదీన వేదభవనములో నిర్వహించారు. వేదం అధ్యాపకులు శ్రీమాన్ వరప్రసాద్ గురువుగారు పెరియాళ్వార్ల వైభవాన్ని తెలియజేసారు. వేద విద్యార్థులు అభిషేకం, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాటి కార్యక్రమానికి తదీయారాధనకి శ్రీమాన్ శ్రీనివాస్ (ఇ.ఇ) పెద్దపల్లి వాసులు సమర్పించారు.

***గోదావరి ఖని :***



వికాస తరంగిణి సభ్యులు, భక్తులు జూన్ 28వ తేదీ నుండి జూలై 6వ తేదీ వరకు సుందరకాండ పారాయణను ప్రతిరోజు ఉదయం 5 గంటలకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 80 మంది భక్తులు పాల్గొన్నారు. చివరిరోజు 68 విశేష పదార్థములను నివేదన చేసారు. శ్రీసీతారామకళ్యాణం, పట్టాభిషేకం శ్రీమాన్ జగన్నాథా చార్యులు, శ్రీమాన్ సంతోషాచార్యులు నిర్వహించారు. కళ్యాణంలో 400 మంది భక్తులు పాల్గొన్నారు.

శ్రీసదాశయ ఫౌండేషన్ నిర్వాహకులకు 50 మంది భక్తులు అవయవ నేత్ర దానము చేయుటకు పేర్లు నమోదు చేయించు కున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్‌స్వామివారు వేంచేసి రామాయణ వైభవాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరించారు. వికాస తరంగిణి సభ్యులు, కార్యకర్తలు ఆచార్య అనుగ్రహంతో సేవా కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని అందరికి వికాస తరంగిణి సేవలను గూర్చి వివరించారు.

శ్రీశ్రీశ్రీ స్వామివారి మంగళాశాసనములతో లక్షలాది మంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందరికి సుందరకాండ పారాయణ ఫలితం లభించాలిన 'సుందరసేతు' కార్యక్రమాన్ని అనుగ్రహించారు. పురుషోత్తమ మాసం (అధిక ఆషాఢం) నెలరోజులు ఉదయం తొమ్మిది గంటలకు ప్రతి ఒక్కరు వారికి కేటాయించిన శ్లోకాన్ని పారాయణ చేసారు. అలా 68 సర్గలు ప్రతిరోజూ పారాయణ చేసిన ఫలితం అందరికీ లభించింది. ఎందరో భక్తులు సుందరకాండ సత్సంగాలను నిర్వహించారు.

***వరంగల్ :***

శ్రీశ్రీశ్రీ స్వామివారు జూన్ 21వ తేదీన జీవా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దివస్ సందర్భంగా యోగాభ్యాసం చేయించారు. అదే విధంగా వికాస తరంగిణి కార్యకర్తలు అన్ని జిల్లాలలో యోగా భ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

వరంగల్ వికాస తరంగిణి అధ్యక్షులు శ్రీమతి జ్యోతిగారు, సేవావ్రతి శ్రీమాన్ పి. శ్రీనివాస్ (యోగా అధ్యాపకులు), వరంగల్ కలెక్టర్‌గారి కోరికపై అన్ని సేవా సంస్థలతో కలిసి నిర్వహించారు. వికాస తరంగిణి చేస్తున్న సేవలను గుర్తిస్తూ శ్రీమతి జ్యోతిగారికి వరంగల్ జిల్లా ప్రభుత్వ అధికారులు సత్కరించారు.

శ్రీమాన్ శ్రీనివాస్‌గారు 15 సంవత్సరాల నుండి యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందుకు సన్మానించారు. వికాస తరంగిణి ద్వారా 35 గ్రామాలలో శ్రీనివాస్‌గారు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు.

***జగ్గయ్యపేట:***

వికాస తరంగిణి కార్యకర్తలు వేసవి కాలంలో పోలీస్ చెక్‌పోస్టు సమీపంలో చలివేంద్రము ఏర్పాటు చేసి దాహార్తులకు మంచినీటిని,



మజ్జిగను అందించారు. స్థానిక సి.ఐ. వైవివిఎల్ నాయుడుగారు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనేకమంది ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎ.పుష్పవతి, కె. నాగమణి, ఆర్.జయసుధ, టి. సావిత్రమ్మ, సి.హెచ్ యామిని, యం. రాజ్యలక్ష్మి, టి. మోహనరావు తదితరులు సేవలు అందించారు. శ్రీమతి విజయలక్ష్మిగారు జగ్గయ్యపేట వికాస తరంగిణి కార్యక్రమాలు చక్కగా నిర్వహిస్తున్నారు.

*గంపలగూడెం :*




వికాస తరంగిణి సభ్యులు వినగడప గిరిజన తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నోటు పుస్తకాలను, పెన్నులు పంచిపెట్టారు. శ్రీమతి ఎన్. జ్యోతిగారు కైంకర్య ద్రవ్యాన్ని సమకూర్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేసారు.

28వ తేదీ ఏకాదశి సందర్భంగా తిరువూరి గ్రామంలో ఆర్.పుష్పావతిగారి గృహంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. రామానుజ చరిత్రను శ్రీమతి కొల్ల కృష్ణకుమారి గారు తెలియజేసారు. గంపలగూడెం, తిరువూరు భక్తులు పాల్గొన్నారు.

19వ తేదీన బాలవికాస్ సంస్థ నిర్వహిస్తున్న అనాథ బాలికల ఆశ్రమంలో తదీయారాధన నిర్వహించారు. శ్రీమాన్ పసుపులేటి రాముగారు తదీయారాధనతోపాటు 150 నోటు పుస్తకాలు, పెన్నులు, పాఠ్య పుస్తకాలు అందజేసారు.

**కటూరివానిపాలెం :**

కటూనివానిపాలెం పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజూ విద్యార్థులకు యోగ శిక్షణ ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా విద్యార్థుల యోగా కార్యక్రమాలు అందరిని ఆకర్షిస్తున్నాయి.



**ఏలూరు :**



వికాస తరంగిణి సభ్యులు 125 మంది కలిసి పారాయణ జేసారు. పది సంవత్సరాలు వయసుగల బంగారుబృంద అనే అమ్మాయి రామానుజుల వైభవాన్ని ఎంతో అద్భుతంగా చెప్పింది. జూలై 6వ తేది హనుమాన్ చాలీసా, సంక్షేప రామాయణ పారాయణ నిర్వహిం చారు. 50 మందికి పైగా పాల్గొన్నారు. ప్రతినెల రామానుజులవారి మాస తిరునక్షత్రం రోజు 'ఇరామానుశనూత్తన్దాది' పారాయణ చేస్తున్నారు. వికాస తరంగిణి అధ్యక్షులు సాయిలీల, కార్యదర్శి పద్మావతి నిర్వహిస్తున్నారు. కళావతి, ప్రభావతి, గీతారాణి మరియు వికాస తరంగిణి సభ్యులు అందరూ పాల్గొంటున్నారు.

**రాజమండ్రి :**

గోదావరి పుష్కరాలలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. పవిత్రమైన ఆ పుణ్య దినాలలో బ్రహ్మయజ్ఞాది కార్యక్రమాలు శ్రీస్వామివారు నిర్వహిస్తూ ఉంటారు. 1991 పుష్కర సమయంలోనే మన వికాస తరంగిణి ఆవిర్భవించింది. వేలాది మంది కార్యకర్తలు సేవలందిస్తూ తరిస్తూ ఉంటారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను రాజమండ్రి వికాస తరంగిణి ప్రధాన



సభ్యులు స్వీకరించారు. పుష్కర కార్యక్రమం ఏర్పాట్లను వికాస తరంగిణి కేంద్రకమిటీ అధ్యక్షులు శ్రీమాన్ టి. రమేష్ గుప్తగారు, యజ్ఞ కార్యక్రమ ఏర్పాట్లను ఆగమ పండితులు శ్రీమాన్ చిన్నమధు గురువుగారు జూన్ 12వ పరిశీలించారు. రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాల్లో కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. శ్రీమతి వేదవతిగారు కార్యకర్తలు 400 కేజీల పచ్చళ్ళను తయారుచేసారు. శ్రీమాన్ సత్తిరాజుగారు, శ్రీమాన్ వర్మగారు, కార్యక్రమానికి విశేష కృషిచేస్తున్నారు. డా॥ రాజారామ్‌గారు. డా॥ కర్రి రామారెడ్డిగారు, శ్రీమాన్ రామానుజమ్ గారు, శ్రీమతి పద్మావతిగారు, శ్రీమాన్ భట్టర్‌స్వామివారు అందరికి తగు సూచనలందిస్తున్నారు. శ్రీమాన్ వర్మగారు, శ్రీమతి భ్రమర లక్ష్మిగారు, రత్నంగారు శాంతి సుందరం కార్డులను అందజేస్తున్నారు. ప్రజ్ఞ శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసారు. ప్రజ్ఞ కార్యక్రమంలో భాగంగా శ్రీమతి ఇందిరా రామానుజంగారు 10వ తరగతిలో 8.5 మార్కులతో ఉత్తీర్ణులైన టి. అశ్విన్‌కు ఇంటర్‌మీడియట్ ఫీజు నిమిత్తం రూ.5,000/- అందజేసారు.

***విశాఖపట్టణం :***

సంస్కారవికాస్ పట్టణ సమన్వయకర్త శ్రీమతి లతగారు ప్రతినెల కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ శాఖల సమన్వయ కర్తలతో కార్యక్రమాలు నిర్వహింపచేస్తూ ప్రతినెల చేసిన కార్యక్రమాల వివరాలను కేంద్రకమిటీకి తెలియజేస్తున్నారు.

***విశాఖపట్నంలో వివిధ సత్సంగ కార్యక్రమ వివరాలు :***

తగరపువలసలో శ్రీమతి జయసుందరిగారు ప్రతి శుక్రవారం సత్సంగం నిర్వహిస్తున్నారు. వీరు క్రొత్తవారిని కార్యక్రమానికి ఆహ్వానిస్తూ వారి గృహాలలో కూడా సత్సంగాలను నిర్వహిస్తున్నారు. 26వ తేది భీమిలి ప్రాంతంలో కళ్యాణిగారి గృహంలో లక్ష్మీనారాయణ పూజ, లక్ష్మీస్తుతి అందరూ కలిసి పారాయణ చేశారు. శ్రీమతి లతగారు, పురుషోత్తమ మాస వైభవాన్ని వివరించి 'సుందరసేతు' కార్యక్రమాన్ని గూర్చి తెలియజేసారు. ఏకాదశి రోజు శ్రీమద్భగవద్గీత పారాయణ చేసారు.

'ఉషోదయ' ప్రాంతంలో శ్రీమతి లక్ష్మీదేవిగారు, శ్రీమతి పి. అరుణకుమారిగారు చాలా చక్కగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతివారం నూతన ప్రాంతంలో సత్సంగం నిర్వహిస్తున్నారు. నేత్ర విద్యాలయ గూర్చి, రామానుజ సహస్రాబ్ది గూర్చి తెలియజేస్తున్నారు. యువతని ప్రోత్సహిస్తూ సేవలలో పాల్గొనేలా చేస్తున్నారు.

***ఆదర్శనగర్ :***

శ్రీమతి పుష్పగారింట్లో జూన్ 26న సత్సంగం నిర్వహించారు. భగవంతుని వైభవాన్ని అందరికి వివరించారు. తిరుమలనంబి, అనంతాళ్వాన్, కుమ్మరి కథలను వివరించారు. శ్రీరామానుజ సహస్రాబ్ది గూర్చి క్రొత్త ప్రాంతాలలో వివరిస్తున్నారు.

సాగర్‌నగర్‌లో శ్రీమతి సీతగారి గృహంలో సత్సంగం నిర్వహిస్తు న్నారు. భగవద్గీత 13వ అధ్యాయంలో అనునిత్యాది గుణాలను గూర్చి చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పారాయణ ఎలా చేయాలో అందరికి తెలియజేస్తున్నారు.

గీతామందిరంలో జూలై 1వ తేదీ నుండి 12వ తేదీ వరకు విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 150 మంది పాల్గొంటున్నారు. విశాఖపట్టణంలో అనేక ప్రాంతాలలో కొత్త వారికి రామానుజ సహస్రాబ్దిగూర్చి సంస్కార వికాస్ కార్యకర్తలు తెలియజేస్తున్నారు.

యువవికాస్ సమన్వయకర్త శ్రీమాన్ రఘుగారు ప్రతినెల అనేక ప్రాంతాలలో సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరపాలెం, పెందుర్తి, మధురవాడ ప్రాంతాలలో శరణాగతి వైభవాన్ని వివరిస్తూ సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామానుజ వైభవం, భాగవత వైభవం అనేక ప్రాంతాలలో తెలియజేస్తున్నారు. శాంతి సుందరం పారాయణ అనేక ప్రాంతాలలో నిర్వహిస్తున్నారు.

***నేత్ర విద్యాలయ :***



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేత్ర విద్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు, వారిజ వేద విద్యార్థులు న్యూమంగొల్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా, ఏలూరులో నిర్వహించిన పోటీలకు ఎంపికయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పోటీలలో నేత్ర విద్యాలయ విద్యార్థులు అనేక బహుమతులు గెలుపొందారు.

**సీనియర్ విభాగంలో :**



బంగారుపతకం : పల్ల గణేష్, 10వ తరగతి, రజత పతకం : రామ్ ప్రసాద్, 10వ తరగతి, కాంస్యపతకం : ఎం. అనిల్ 6వ తరగతి, సంతోష్ 9వ తరగతి విద్యార్థులు గెలుపొందారు.

**జూనియర్ విభాగంలో :**

బంగారుపతకం : బి. అనిల్, రజత పతకాన్ని కార్తీక్ గెలుచుకోగా కాంస్య పతకాన్ని కె. శివ కైవసం చేసుకున్నాడు.

ప్రముఖ సినీనటుడు శ్రీమాన్ సుమన్‌గారు, ఏలూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

నేత్ర విద్యార్థుల ప్రతిభను చూస్తూ ఉంటే ఆ పాఠశాలలను దర్శించాలని ఉందని, తప్పకుండా మేమంతా పాఠశాల చూస్తామని పెద్దలంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు.

***విజయనగరం :***

వికాస తరంగిణి కార్యకర్తలు మహిళా ఆరోగ్య వికాస్, యువ వికాస్, సంస్కార వికాస్, ప్రజ్ఞ కార్యక్రమాలు మే, జూన్ మాసాలలో చక్కగా నిర్వహించారు.

ప్రజ్ఞ : సంవత్సరమంతా ప్రతిరోజూ 20 మంది విద్యార్థులకు సాయంత్రం వేళలో శ్రీమతి సత్యవతిగారు కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ స్తోత్రాలను నేర్పిస్తున్నారు.

వయసులో పెద్దవారైనా ఆమె కార్యదీక్షకు ఏమాత్రం లోటు లేదు. ఇంటింటికి వెళ్ళి చిన్నారులను తీసుకొని వచ్చి స్తోత్రాలను నేర్పించే సత్యవతమ్మగారు ఎందరికో ఆదర్శప్రాయురాలు. ప్రతి ఇంట సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆమె పెద్దవారిలో ఆధ్యాత్మిక చైతన్యం కల్గిస్తున్నారు. సంకల్పం గట్టిదైతే మంచి కార్యక్రమాలు నిర్వహించడానికి వృద్ధాప్యం అడ్డురాదు అని నిరూపిస్తున్నారు శ్రీమతి సత్యవతమ్మగారు. ఆమె శిక్షణ నిచ్చిన విద్యార్థులు స్తోత్ర పఠనం విని, శ్రీశ్రీశ్రీ స్వామివారు మంగళాశాసనం కూడా చేశారు. అంత పెద్ద వయస్సులో ఉండి సత్యవతమ్మగారు ఒక ప్రాంతంలో కార్యక్రమం నిర్వహిస్తే అతి చిన్న వయస్సులో అంటే కేవలం 12 సంవత్సరాల వయసు కలిగిన చి. పవన్ కుమార్ వేసవి కాలంలో 40 రోజులు శిక్షణ శిబిరం నిర్వహించి విద్యార్థులకు ప్రజ్ఞ శ్లోకాలు, కథలు, రామానుజ చరిత్ర, పాటలు, కోలాటం నేర్పించాడు. 40 మంది విద్యార్థులు ఈ వేసవి కాలమంతా శ్రీరామమందిరంలో రామునికి పూలమాలలు స్వయంగా కట్టి సమర్పించారు. ఆలయం శుభ్రపరచి మొక్కలు నాటారు. యువవికాస్ కన్వీనర్ శ్రీమాన్ పద్మనాభంగారు అయ్యన్నపేట ప్రాంతంలో 25 రోజులు 40 మంది విద్యార్థులకు ప్రజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. దేశభక్తి గీతాలు, కథలు, భజనలు, కోలాటం, శ్లోకాలు నేర్పించారు. ఆలయ నిర్వాహకులు శ్రీమతి రాధగారు సహకారమందించారు. శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామివారు విజయనగరం వేంచేసినపుడు విద్యార్థులకు



మంగళాశాసనం చేశారు.

సంస్కార వికాస్ కన్వీనర్ శ్రీమతి లక్ష్మిగారు హరినామ సంకీర్తనలో భాగంగా ప్రతి శనివారం సాయంత్రం 5.30 ని.లకు కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, ప్రతి ఆదివారం పంచముఖ ఆంజనేయస్వామివారి ఆలయంలో శ్రీమతి పద్మప్రియ గారిచే రామానుజులవారి పాటలలో శిక్షణ నిప్పిస్తున్నారు.

శాంతిసుందరంలో భాగంగా సుందరకాండలో శ్లోకాలను అందరికీ అందజేసారు. సర్గకి రూపాయి చొప్పున రూ. 68 రూపాయలు పారాయణ చేసిన వారంతా సమతామూర్తి రామానుజులవారి విగ్రహ నిర్మాణానికి సమర్పించాలని నిర్ణయించుకున్నారు.

భక్తులు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ సత్సంగాలు నిర్వహిస్తున్నారు. 29వ తేదీన నిర్వహించిన సంకీర్తల కార్యక్రమంలో శ్రీమతి పద్మప్రియ, శ్రీమతి మండపాక శారద, శ్రీమతి రాగిణి, శ్రీమతి మాలి, శ్రీమాన్ రవివర్మ గానం చేసారు. శ్రీమాన్ మండపాక రవిగారు మృదంగం, శ్రీమతి విజయలక్ష్మి వయోలిన్ సహకార మందించారు.

అయ్యన్నపేట కృష్ణమందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాసన్నపేట కృష్ణమందిరంలో 90 మందికి ఉచిత రక్తపరీక్షలు, షుగర్, బి.పి పరీక్షలు నిర్వహించారు. శ్రీమాన్ సత్యనారాయణ, రామరత్నం, శ్రీరాము, నాగలక్ష్మి పాల్గొన్నారు. శ్రీమతి శ్వేత యువవికాస్ సభ్యురాలు దుప్పాడ ప్రాంతంలో నూతనంగా వికాస తరంగిణి శాఖను ఏర్పాటు చేయడానికి ప్రోత్సహాన్నందించారు. శ్రీమాన్ పద్మనాభంగారు సత్సంగ కార్యక్రమంలో శాఖను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి శకుంతల, శ్రీమతి విజయ, శ్రీమతి శ్వేత, నేత్ర విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవావ్రతి అనుభవ నివేదిక :

**పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి పాదపద్మములకు అనేక దాసోహములు.**

**నా పేరు ఉరిటి రవితేజ రామానుజదాసు, విజయనగరం జిల్లా సాలూరు గ్రామం మా స్వస్థలం. 2013లో బి.కాం. డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. నాకు ఎమ్.బి.ఎ చెయ్యాలని ఉన్నా కొన్ని కారణాల వలన చెయ్యలేకపోయాను. ఒక సంవత్సరం వృథా అయింది. కాని నాకు ఇప్పుడు బాధ కలగడం లేదు. ఎందువలనంటే శ్రీశ్రీశ్రీ స్వామివారి సన్నిధిలో 40 రోజులు 11 సేవావ్రతుల శిక్షణ శిబిరంలో అనేక కొత్త విషయాలు నేర్చుకున్నాను. నాకు తెలియని కొన్ని సంస్కారాలను, విలువలను నేర్చుకున్నాను. శ్రీస్వామివారి ద్వారా అసలు సేవ అంటే ఏమిటి? ఎందుకు సేవ చేయాలి? ఎవరికి సేవ చేయాలో తెలుసుకున్నాను. సనాతన ధర్మాన్ని రక్షించడానికి శ్రీస్వామివారు పడే తపన మాకు తెలిసింది. అక్షరాలు ఎలా పలకాలి? ఎలా వ్రాయాలి? దగ్గర నుంచి ప్రారంభించి అనేక ఆధ్యాత్మిక విషయాల వరకు అందరికీ అర్థమయ్యేలా వివరించారు. యోగ, ప్రాతఃస్మరణీయం, ఆయుర్వేదం, హోమియోపతి గృహ వైద్యం మరియు కంప్యూటర్ కూడా నేర్చుకున్నాం. 40 రోజులలో ఎంతో మంది ప్రముఖుల ప్రవచనాలు విన్నాము. వారు మార్గనిర్దేశం చేసే విధానం చాలా బాగుంది. శ్రీస్వామివారు, ప్రముఖులు చెప్పిన వాటిని మేము ఆచరించి అందరితో ఆచరింపచేయాలని ప్రయత్నిస్తున్నాము. కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ఎంతోమంది మమ్మల్ని గౌరవించి, అభినందిస్తున్నారు. ఇదంతా శ్రీశ్రీశ్రీ స్వామివారి మంగళాశాసనముల ప్రభావమే. శ్రీస్వామివారికి దాసోహములు సమర్పించుకుంటున్నాను.**

*సాలూరు :* **సేవావ్రతి రవితేజ సాలూరు పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలో యోగాభ్యాసం చేయించారు. ప్రతి రోజు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

**పార్వతీపురంలో వికాస తరంగిణి సభ్యులు నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ స్వామివారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు వివరిస్తూ "నిజమైన సేవకులు ఎవరు? ఎలా ఉండాలి?" అనే విషయాల్ని ఉదాహరణ సహితంగా వివరించారు పార్వతీపురం వికాస తరంగిణి అధ్యక్షులు శ్రీమతి పార్వతిగరాఉ, వికాస తరంగిణి సభ్యులు ప్రతి వారం సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

*బొబ్బిలి :* **సేవావ్రతి రవితేజ బొబ్బిలిలో వికాస తరంగిణి కార్యకర్తలు నిర్వహించే సత్సంగంలో పాల్గొని రామానుజ సహస్రాబ్ది, శాంతి సుందరం కార్యక్రమాలు గూర్చి వివరించారు. పాలూరులో ప్రతి వారం ప్రజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రాతః స్మరణీయం, ప్రజ్ఞ శ్లోకాలు 45 మంది విద్యార్థులకు నేర్పిస్తున్నారు.**

# మహిళా ఆరోగ్యవికాస్

శ్రీమతి మాధవీరవీంద్ర- విజయవాడ
సెల్ : 9346405010



20.06.2015 మరియు 21.06.2015 వ తేదీలలో మార్కాపురంలో శ్రీమతి వరలక్ష్మి వాసుదేవరావు దంపతులు రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన ఉచిత మహిళా వైద్య శిబిరంలో 237 మంది మహిళలు పాల్గొనగా 118 మందికి వి.ఐ.ఎ పరీక్ష జరుపగా 20 మందికి రెండవ పరీక్ష నిర్వహిస్తున్నారు. మొదటి రోజున ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోనూ, రెండవరోజు వినోదా హస్పటల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి యువవికాస్ అధ్యక్షులు అయిన శ్రీమాన్ రంగనాయకులు వారి స్నేహితులతో కలిసి చక్కటి సహకారాన్ని అందించారు. వినోదా హస్పటల్స్ యాజమాన్యం మరియు వైద్యులు అయిన డా॥ వింధ్య విష్ణువర్ధన్ గార్లు ఈ శిబిరానికి కావలసిన ఏర్పాట్లను దగ్గరుండి అందించటమే కాక ప్రతినెలా ఆరోగ్యవికాస్ శిబిరాలను వికాస తరంగిని తరపున నిర్వహించడటానికి ముందుకురావటం అభినందనీయం. తల్లిదండ్రుల మార్గంలో సంప్రదాయాన్ని పాటిస్తూ, సేవాకార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ఈ దంపతులకు శ్రీస్వామివారి మంగళాశాసనాలు పరిపూర్ణంగా ఉండాలని ఆరోగ్యవికాస్ ఆశిస్తుంది. ఈ శిబిరాన్ని శ్రీమతి మాధవీ రవీంద్రగారు టీమ్ కలసి నిర్వహించారు.

28.06.2015వ తేదీన ప్రకాశం జిల్లా సమన్వయకర్త శ్రీమతి మాధవిగారు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరానికి 20 మంది కార్యకర్తలు



పాల్గొన్నారు. వారందరూ ఎంతో శ్రద్ధతో ఆరోగ్య వికాస్‌ను వారి జిల్లాలో నిర్వహించటానికి కావలసిన పరికరాలను సమకూర్చుకొని చక్కటి శిక్షణను తీసుకొన్నారు. మన శ్రీస్వామివారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కార్యక్రమాలలో జీవన్ వికాస్ ఒకటి. అనాద బాలురకు ఆశ్రయం కల్పించి, చదువు చెప్పిస్తూ, లౌకిక విద్యతో పాటు, ఆధ్యాత్మిక విద్యను కూడా బోధిస్తున్నారు. మార్టూరు వికాస తరంగిణి వారు నడుపుతున్న ఈ ఆశ్రమంలోనే ఆరోగ్యవికాస్ కార్యకర్తలు శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణను శ్రీమతి మాధవీరవీంద్రగారి టీమ్ అయిన శ్రీమతి రత్నమాలగారు, శ్రీమతి జయలక్ష్మిగారు, శ్రీమతి అనురాధగారు, శ్రీమతి సత్యవతిగారు చక్కటి సహకారాన్ని అందించారు.

30.06.2015వ తేదీన విజయనగరం, ధర్మపురి గ్రామాలలో శ్రీమతి శకుంతలగారు నిర్వహణలో జరిగిన ఉచిత మహిళా వైద్య శిబిరానికి హాజరైన మహిళలలో 45 మందికి వి.ఐ.ఎ పరీక్ష నిర్వహించగా 15 మందికి తదుపతి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి డా॥ సుధాకుమారిగారు తమ సేవలను అందించారు. అంతేకాకుండా తదుపరి



పరీక్షలను నిర్వహించారు. విజయనగరం ఆరోగ్యవికాస్ కార్యకర్తలు చక్కటి సహకారాన్ని అందించారు.

05.07.2015వ తేదీన జగ్గయ్యపేటలోని ధర్మవరప్పాడు తండాలో శ్రీమతి విజయలక్ష్మిగారు ఏర్పాటు చేసిన ఉచిన మహిళా వైద్య శిబిరానికి 103 మంది హాజరుకాగా 84 మందికి వి.ఐ.ఎ పరీక్ష జరిపారు. 6 గురికి రెండవ పరీక్ష నిర్వహిస్తున్నారు. డా॥ అరుణగారు తమ విలువైన కాలాన్ని సేవకు వినియోగించటమే కాకుండా, తదుపరి పరీక్షలు నిర్వహించవలసిన వారందరికీ వారి హస్పటల్‌లోనే పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. రామ్‌కో సంస్థకు చెందిన శ్రీమాన్ గోపాలకృష్ణగారు, డా॥ ఎస్. రాజాకేశవ ప్రసాద్‌గారు, ఆ తండా ప్రెసిడెంట్ మరియు ఎమ్.పి.టి.సి సభ్యులు ఈ శిబిరాన్ని సందర్శించి శ్రీస్వామివారి యొక్క సేవలను అభినందించమేకాకుండా తమ ప్రాంతాలలో కూడా శిబిరాలను ఏర్పాటు చేయమని కోరారు. ఆరోగ్యవికాస్ కార్యకర్తలు కూడా చక్కటి సహకారాన్ని అందించారు. ఈ శిబిరాన్ని శ్రీమతి మాధవీరవీంద్రగారు టీమ్‌తో కలసి నిర్వహించారు.

*మరిన్ని వివరాలు తరువాత సంచికలో...!*

# నూతన గ్రంథ పరిచయము

## వ్యాకరణ తత్త్వ దర్శనం

ఆరు వేదాంగాలలో వ్యాకరణం ముఖస్థానీయం అని శాస్త్ర ప్రసిద్ధం. వ్యాకరణం ఒక తత్త్వ దర్శనం అనే దృష్టి **అ ఇ ఉణ్** మొదలైన మహేశ్వర సూత్రాలకు ఏర్పడిన వ్యాఖ్యాన మూలంగా ఏర్పడి ఉంది. అయితే వ్యాకరణ పరిభాషను తాత్త్విక దృష్టితో విశ్లేణం చేసి లోకానికి అందించిన విధానం అంత ప్రసిద్ధంగా లేదు. తెలుగులో ఈ ప్రక్రియ అసలే లేదు. ఇలాంటి విధానాన్ని లోకానికి అందించిన మహనీయులు శ్రీమాన్ డా॥ యస్.టి.వి. రాజగోపాలాచార్యులు గారు. **వ్యాకరణ తత్త్వదర్శనం** అనే గ్రంథాన్ని వ్రాసి వ్యాకరణ పరిభాషలో ఇమిడి ఉన్న తాత్త్వికతను వెలికిదీసి చిన్నయ సూరిగారికి అంకితమొనర్చారు ఆచార్యులవారు. మోక్ష సోపానము వ్యాకరణం అని నిరూపిస్తున్నది ఈ గ్రంథం. ఆధ్యాత్మవిద్యలో అక్షరానికి ఉన్న స్థానం పదం, వాక్యం వీటి తత్త్వం వ్యాకరణ సంజ్ఞలలో ఇమిడి ఉన్న తత్త్వం అంటే బిందువు, వక్రం, వక్రతమమ్, కళలు, అవ్యయం, ఉపధలు, అంతస్థములు, ఊష్మములు, త్రికము, అనునాసికము, ఏకవచన, బహువచనములు కర్త కర్మ క్రియలు విభక్తులు మొదలైన వాటిలో ఎలా ఉన్నదో విశదపరుస్తున్నది ఈ గ్రంథము. సంధి సమాస ప్రక్రియలలో ఇమిడిఉన్న తాత్త్వికతను కూడా చక్కగా వివరించారు ఆచార్యులుగారు. ఈ చిన్న పుస్తకము అమూల్యంగా జిజ్ఞాసువులైన పాఠకులకు అందింపబడుతున్నది. తెలుగు పాఠకులు దీనిని ఆదరింతురు గాక

**చిరునామా:**

**శ్రీమాన్ డా॥ యస్.టి.వి. రాజగోపాలాచార్యులు**
**ప్లాట్ నెం: 61, ఫ్లాట్ నెం: 102,**
**ధర్మారెడ్డి కాలని ఫేస్: 2, చర్మాస్ వెనుక**
**హైదర్ నగర్ (కె.పి.హెచ్.వి)**
**హైదరాబాద్-500072, సెల్: 9704811174/ 84**

## క్రియా కైరవచంద్రిక

శ్రీమన్నారాయణుని ఆరాధనా నిరూపకమైన పాంచరాత్రాగమంలోను వివిధ సంహితలలో ఉన్న క్రియాకలాపాన్ని ప్రయోగరూపంగా ఆయా విద్వాంసులు ప్రతులను తయారు చేసుకొని ప్రతిష్ఠాది ప్రక్రియలను సాగించడం ఉంది. అయితే ప్రాచీన విద్వాంసులు కొందరు ఆగమ నిరూపితాలైన ప్రతిష్ఠ, ఉత్సవాది క్రియాకలాపం మొదలైనవాటిని ప్రయోగానుకూలమైన మంత్రాలతో చేర్చి ప్రయోగ గ్రంథాలుగా అందించి ఉన్నారు. అలాంటి గ్రంథాలలో **క్రియా కైరవ చంద్రిక** ప్రముఖమైనది. ఈ గ్రంథాన్ని కీ.శే.శ్రీమాన్ యస్.వి రఘునాథాచార్యులు **రా.కా** అనే వ్యాఖ్యతో ప్రకాశింపచేసారు. దానికి మన మన పెద్ద జీయర్ స్వామివారే ప్రోత్సాహకులు. మొట్టమొదటిగా **రా.కా** వ్యాఖ్యను తెలుగు లిపితో స్వామివారే ప్రకాశింపచేశారు. ప్రస్తుతం ఈ ప్రయోగ గ్రంథం మూలం మాత్రం తెలుగు వివరాలతో లోకానికి అందించే ప్రయత్నం చేసారు శ్రీమాన్ నల్లందిగళ్ లక్ష్మీనరసింహాచార్య స్వామివారు. ఇదివరకే వీరు అనేక సంహితలు ప్రకాశింపచేసి ఉన్నారు. రెండు సంపుటాలుగా ముద్రింపబడిన ఈ గ్రంథాన్ని **రూ.350/-** కే అందిస్తున్నారు.

**ప్రాప్తిస్థానం :**

**శ్రీమతి ఎమ్. రంగనాయకమ్మగారు**
**నెం: 7-1-101, రెడ్డి ఎంక్లేవ్**
**దేవుని ఆల్వాల, హైదరాబాద్ - 500010**
**సెల్ నెం: 9247357355, 9704168678**

**మా 'జీవా' రిసెర్చి విభాగంచేత ఈ క్రింది గ్రంథాలు ముద్రింప బడ్డాయి. ఇవి నాగారీ లిపిలో వ్రాసిన సంస్కృతగ్రంథాలు, ఆసక్తగల విద్వాంసులు, తమ వివరాలతో భక్తినివేదన సంపాదకునికి వ్రాసి తెప్పించుకోవచ్చు.**

1. ప్రణవమంజూష - మొదటి భాగం. (ఓంకారం గురించిన ఉపనిషత్తులు, స్మృతిగ్రంథాల సంకలనం)
2. తత్త్వ వివేచనా - భాగవత దశమస్కంధంపై శ్రీధరాది వ్యాఖ్యల తులనాత్మకాధ్యయనం - రచన : డా॥ వంగీపురం రామానుజా చార్యులు (పూర్వప్రాచార్యులు)
3. అగస్త్య సంహిత - (రామతత్త్వాన్ని గురించిన ఆగమగ్రంథం) సంపాదన : శ్రీ పి.టి.జి. భరతశేఖరాచార్యులు.

**గ్రంథకర్తలకు విశేష సూచన**

**తెలుగు సంస్కృత భాషలలో ప్రకాశింపబడే గ్రంథాల పరిచయం కోరేవారు రెండు ప్రతులు సంపాదకునికి పంపవలసి ఉంటుంది.**

**చిరునామా**

**సంపాదకుడు, భక్తినివేదన, జీవా, శ్రీరామనగరం, ముచ్చింతల్ రోడ్డు, పాలమాకుల (పో), శంషాబాద్ (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.**

జైశ్రీమన్నారాయణ

పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి పత్యక్ష పర్యవేక్షణలో...

# శాంతి సుందరమ్

## శ్రీసుందరకాండ పారాయణము

మొదటి భాగం 07.07.2015 తేదీన జీవా శ్రీరామనగరంలో శ్రీరాముని సన్నిధిలో పూర్తయింది.

రెండవ భాగం: భద్రాచలంలో ఆరంభించి రాజమహేంద్రిలో ముగించారు.

మూడవ భాగం: దివ్యసాకేతం, జీవాప్రాంగణం, శ్రీరాముని సన్నిధిలో శ్రావణ పూర్ణిమ నుండి కార్తీకమాసం దాక 108 రోజులు శ్రీసుందర కాండ పారాయణ చాతుర్మాస్యంతో ఆరంభం.

దీనితోపాటు ప్రతిరోజు...

| | | |
|---|---|---|
| మన ఆరోగ్యంకొరకు | - | గోపూజ, అరుణపారాయణం |
| వ్యాధి నివారణకు | - | మహాసౌరపారాయణం |
| సంపదలసిద్ధికి | - | శ్రీసూక్తహవనము |
| శత్రునివారణకు | - | మన్యుస్తూపారాయణం |
| సత్త్వశుద్ధికి | - | శ్రీవిష్ణు, లక్ష్మీసహస్రనామార్చన |
| సర్వదోషనివారణకు | - | అష్టాక్షరీ మహామంత్రజపం. |
| ఉన్నత పదవిప్రాప్తికి | - | సుదర్శన హోమం |
| శాంతికి | - | శ్రీభగవద్రామానుజ తిరుమంజనం |

*శాంతి జరిపించుకొనే కైంకర్య వివరాలు*

*మూడవ భాగం :* 108 దినాలు వారివారి గోత్రనామాలతో శాంతి హవనాదులు జరుగుతాయి. రూ. 25,000/-

*వివరములకు :* దివ్యసాకేతం - 95535 4997172
సీతానగరం - 08645 272929

గమనిక: ఈ కార్యక్రమంలో పాల్గొనదల్చినవారు శాంతిసుందరం పేరిట ఈ క్రింది సూచించిన బ్యాంక్‌ద్వారా పంపవచ్చు.

**Andhra Bank A/c No. 209710100009026**

**IFSC Code: ANDB0002097**

దానితోపాటు మీ గోత్రనామాలు, చిరునామా, ఫోన్ నెంబరు జతపరచి, జీవా ఆఫీస్‌కి పంపవలసినది.

## భక్తినివేదన పాఠకులకు సూచన

మీకు ప్రతినెల భక్తినివేదన పత్రిక అందుతున్నదా? మీ అడ్రస్సు మారితే వెంటనే తెలియపరుస్తున్నారా? ఈ క్రింది ఫోన్ నెంబరుతో మాత్రమే మీరు కోరిన సమాచారాన్ని పొందవచ్చు.
సీతానగరం - ఫోన్. 08645- 272929,272353

# పరమపద వార్తలు



తణుకు వాస్తవ్యులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ వంగల శ్రీరంగాచార్య స్వామి 26.06.2015 తేదీన పరమపదాన్ని అలంకరించారు వీరు సంగీతో పాధ్యాములు, వీరు కాతాలపర్రు క్షేత్రంలో 1921వ సంవత్సరంలో జన్మించారు. మేనమామలు చిన, పెద్ద వెంకటా చార్యుల స్వామి వద్ద చక్రాంకితము పొంది, దివ్య ప్రబంధా లని సేవించారు. వీరు 1969లో తణుకు శ్రీశారదా సంగీత పాఠశాలను స్థాపించి, సంగీతాన్ని వ్యాప్తి చేసే సేవలో కొన్ని వందల మందికి సంగీతాన్న బోధించారు. వీరు స్వామివారు నిర్వహించిన అనేక కార్యక్రమాలలో పాల్గొని తమ వంతు సేవలను అందించారు వీరి పరమపదంలో నిత్యకైంకర్యం లభించాలని శ్రీశ్రీశ్రీ స్వామివారు మంగళాశాసనం చేశారు.




కృష్ణాజిల్లా విజయవాడ వాస్తవ్యులు శ్రీమతి వెనిగళ్ళ సుగుణమ్మగారు 19.6.2015న పరమపదాన్ని అలంకరించారు. వీరు శ్రీస్వామి వారు నిర్వహించు అనేక కార్యక్రమాలలో పాల్గొని తమవంతు సేవను అందించారు. వీరికి పరమ పదవాసుని సన్నిధిలో నిత్య కైంకర్యం లభించాలని శ్రీస్వామివారు మంగళాశాసనం చేశారు.



కృష్ణాజిల్లా తిరువురు వాస్తవ్యులు, శ్రీపెద్దజీయర్ స్వామివారి శిష్యురాలు శ్రీమతి కందిమళ్ళ సీతాయిమ్మగారు 23.5.2015 పరమపదించి నారు. వీరు పెద్దస్వామివారు నిర్వహించిన అనేక కార్యక్రమములలో తమవంతు విశేష సేవలను అందించారు. వీరికి పరమాత్మ సన్నిధిలో నిత్యకైంకర్యం లభించాలని శ్రీస్వామివారు అనేక మంగళాశాసనములు కృపచేశారు.



గుంటూరు జిల్లా తాడేపల్లి వాస్తవ్యులు శ్రీమాన్ గోదాసు చంద్రశేఖరరావుగారు. 11.7.2015 పరమపదించారు. వీరు శ్రీస్వామివారి వద్ద సమాశ్రయిణము పొందినారు. కొద్దికాలం సీతానగరం జెట్‌లో సేవచేశారు. వీరికి పరమాత్మ సన్నిధిలో నిత్యకైంకర్యం లభించాలని శ్రీస్వామివారు అనేక మంగళాశాసనములు కృపచేశారు.



వరంగల్‌జిల్లా హనుమకొండ వాస్తవ్యులు శ్రీమాన్ ముప్వ సురేష్ బెనర్జీగారు 9.6.2015 పరమపదించారు. వీరు వికాస తరంగిణిలో కార్యకర్తగా వుంటూ శ్రీస్వామివారి కార్యక్రమములో పాల్గొనేవారు. వీరికి పరమాత్మ సన్నిధిలో నిత్యకైంకర్యం లభించాలని శ్రీస్వామివారు అనేక మంగళాశాసనములు కృపచేశారు.

# మెదడుకి మేత!

భగవద్బంధువులారా! జిజ్ఞాసతో మీరంతా చదువుతూ ఆదరిస్తున్న 'భక్తినివేదన'లో మీకోసం ఈ శీర్షిక! **ఈ పత్రికలోని వ్యాసాలనుండే మీకు ప్రశ్నలిస్తున్నాం!** అయినా మరొక్కసారి జ్ఞాపకం చేసుకోవడం మనస్సుకి ఆనందమని మెదడుకీ చిన్నమేత! అన్నీ సరిగా వ్రాస్తే ఆకర్షణీయ బహుమతులు! ప్రతినెల 15వ తేదీలోపు మాకందిన సమాధానాలని మాత్రమే పరిశీలిస్తాం! ఆ పై దాటివచ్చినవి పరిశీలించము. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. శ్రద్ధతో మీరు పంపిన **జూలై నెల సమాధానాలందాయి.** విజేత పేరు క్రింద ప్రకటిస్తున్నాము. బహుమతులు పంపిస్తాము! *గతనెల సమాధానాలు 37వ పేజీలో కలవు.*

**ప్రశ్నలు** **సమాధానాలు**

1. రెండు నిమిషాల్లో పూర్తి చేసేలాచేసే సుందరకాండ పారాయణానికి ఏమని పేరు ?
2. ఇంతిహాసాల్లోని కేవల కథలకంటే ప్రధానంగా దేన్ని ప్రతిబోధించాలి ?
3. ఎలాంటి ఆహారాలతో శరీరాన్ని పోషించుకోవాలి ?
4. మనవాళప్పెరుమాళ్ నాయనార్లు ఏగ్రంథాన్ని కటాక్షించారు ?
5. బ్రహ్మరాక్షసి ఎవరిని పట్టింది ?
6. ఈ నెల రామానుజ శతక పద్యంలో నిర్దేశించిన 'న్యాయం' ఏమిటి ?
7. గులాబీ పువ్వులవాసనవలె ఘుమ ఘుమలాడేది ఏమిటి ?
8. శ్రీవత్సాంకమిశ్రుని స్తోత్రాలనేమంటారు ?
9. 'తూయ' అంటే అర్థం ఏమిటి ?
10. క్షమావంతుని గొప్పతనాన్ని చెప్పిన గ్రంథం ఏది ?
11. 'కృత్వాభారావతరణం' అనే శ్లోకం ఎక్కడిది ?
12. ప్రథమ గోపుర ద్వారంలో వ్రేలాడదీయబడిన వస్తువేది ?
13. వేదం పురుషోత్తముడని ఎవరి స్పష్టపరుస్తోంది ?
14. శాంతి సుందరం 68 రోజులు ఏ తేదీని పూర్తయింది ?
15. శ్రీభాష్యం అద్వైతవాదంపై చూపిన ఏడు ఏమిటి ?
16. ఇంద్రియాల గురించి యాజ్ఞవల్క్యునితో సంవదించిన వాడెవడు ?
17. కంసునిదూతగా మధురనుండి వ్రేపల్లెకు వచ్చినవాడెవడు ?
18. ఆక్యుప్రెషర్ విధానంలో మెటల్‌దాతువుగా ఏ స్థానాన్ని గుర్తిస్తారు ?

సరియైన సమాధానాలు వ్రాసినవారు:
1. జి. రాజ్యలక్ష్మి, గుంటూరు 2. బి.వి. రమణారావు, కావలి 3. ఎన్. వి. జగన్నాథ్, హైదరాబాద్ 4. ఎ. సాధ్వీమణి, హైదరాబాద్ 5. శ్రీభాష్యం రమాదేవి, హన్మకొండ 6. ఎమ్ పద్మశ్రీ, హైదరాబాద్ 7. టి. అలివేలు, హైదరాబాద్ 8. శ్రీమన్నారాయణ, చిన్న వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా, 9. ఎన్. రేవతి, హన్మకొండ 10. బి. పద్మావతి, ఖమ్మం

గమనిక : ప్రశ్నలన్నిటికీ సరి అయిన సమాధానాలు వ్రాసినవారిలో 4 గురిని ఎంపిక చేసి బహుమతులు పంపిస్తాము.

మీ చిరునామా
..........................................
..........................................
..........................................
..........................................

**సూచన:** సమాధానాలు ఈ పత్రంలోనే నింపి, 15వ తేదీలోపు అందేట్లు ఈ క్రింది చిరునామాకి పంపగలరు.

భక్తినివేదన సీతానగరం-522 501, తాడేపల్లి పోస్ట్, గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్. 08645 272929